లోనారసి

సాహిత్య వ్యాసాలు



అవధానుల మణిబాబు

లోనారసి

సాహిత్య వ్యాసాలు



అవధానుల మణిబాబు

LONAARASI

Avadhanula Mani Babu,
M.Sc., B.Ed.,

First Edition : **October, 2022**

Rights : **Writer**

D.T.P. : **M.V.G. Srinivas,** Amalapuram

Printing : **Kalimi Sri,** Vijayawada

Price : Rs. 100/-

For Copies:

A. Mani Babu,
3-62, Near Bank of Maharashtra,
Sarpavaram, Kakinada Rural, E.G.Dist.,
Andhra Pradesh - 533 005, Mobile : 99481 79437

నావో రెండు మాటలు

కవిత్వం, విమర్శ రెండు విభాగాలలోనూ కృషి చేయమని చెప్పి వెళ్ళిపోయిన ప్రాతఃస్మరణీయులు డా. అద్దేపల్లి రామమోహనరావు, డా. ఆవంత్స సోమసుందర్‌ల సూచన మేరకు కవిత్వ విభాగంలో “బాటే … తన బ్రతుకంతా…”; “నాన్న..పాప…”; “నేనిలా.. తానలా…” శీర్షికలతో మూడు; ప్రసంగాలు, సమీక్షలుగా “అన్నవి … అనుకొన్నవి..”; “అందినంత చందమామ”; “స్ఫురణ.. స్మరణ..”; “పరమమ్” శీర్షికలతో నాలుగు మొత్తం ఏడు పుస్తకాలుగా తీసుకొచ్చాను. గత మూడు సంవత్సరాలుగా చేసిన ప్రసంగాలు, సమీక్షలను ఇపుడు ఎనిమిదో పుస్తకంగా మీ ముందుంచుతున్నాను.

సమీక్షో, ప్రసంగమో చేసి పత్రికకు పంపాక మళ్ళీ ఈ పుస్తకం వేయడం ఎందుకని చాలా మంది మిత్రులడిగారు. కేవలం పాఠకుడిగా పుస్తకం చదవడం వేరు. విమర్శ కోసం చదవడం వేరు. వ్యాసం వ్రాయాలంటే చదవాలి; చదువుతున్నపుడు కలిగిన అభిప్రాయాలను వ్రాసుకోవాలి; సందేహాలను ఆ రచయితనో, పెద్దలనో అడిగి తెలుసుకోవాలి; గతంలో అలాంటి వాక్యమో, భావనో మరెక్కడయినా విన్నామా? చదివామా? అని పుస్తకాలన్నీ తిరగేసి వెతుక్కోవాలి. ఆయా పుస్తకాల ముందుమాటలు, సమీక్షలలో ఇతరులు ఏమన్నారో చూడాలి. అపుడు మరోసారి చదివి, అన్నీ సమన్వయం చేసుకుంటూ వ్రాసుకోవాలి.

ఇంత చేసినా ఒక్కోసారి సభలో నలభై, ఏభై మందికి మించి ఉండరు (కొన్ని సందర్భాల్లో ఈ సంఖ్య ఇరవై లోపే). ఇతర వక్తల కోసం మన సమయాన్ని కుదించి అన్ని అభిప్రాయాలూ చెప్పడం కుదరదు. పత్రికలలో స్థలాభావంతో వారు మనం వ్రాసినదంతా ప్రచురించలేరు. అందుకే, ఆ పూర్తి పాఠాలను పుస్తకాలుగా తేవడం.

ఎన్నెన్నో పురస్కారాలు, గౌరవాలు పొందిన పెద్దలు సైతం నా సమీక్షలను పదిలంగా దాచుకోవడం, వారి ఇతర గ్రంథాలలో నా మాటలు ప్రస్తావించడం, సావనీర్లలో మరలా ప్రచురించడం నాకు ఎంతో సంతృప్తి నిచ్చింది. ఇలా మాట్లాడడం కోసమో, వ్రాయడం కోసమో మళ్ళీ చదవడంద్వారా నేను ఎంతో నేర్చుకొంటున్నాను.

ఐతే, కొన్నిసార్లు ఎంతో నచ్చిన పుస్తకాలపై కూడా వ్యాసం వీలు పడదు (నా విషయంలో సుమా!). పుస్తకం చదివిన వెంటనే వ్రాద్దామనుకున్నా ఉద్యోగ, కుటుంబ బాధ్యతలలో తీరిక కుదరక పోవడం, ఈలోగా ఆ పుస్తకంపై ఎన్నో మంచి మంచి వ్యాసాలు పత్రికల్లో, ఇతర మాధ్యమాల్లో రావడం, అవన్నీ చూశాక మనం ఇంకేం రాస్తాం! అని వాయిదా వేయడం, ఆ తరువాత రాద్దామన్నా ఎందుకో ముందుకు సాగదు. అలా ఎంతో ఇష్టపడి వ్రాయలేక పోయిన పుస్తకాలు కొన్నున్నాయ్. డా. ప్రసాద మూర్తి – పూలండోయ్ పూలు; మెట్టా నాగేశ్వరరావు– మనిషాక పద్యం; శ్రీ రామ ప్రసాద్ – నీటి చెలమ; డా. అవధానం రఘుకుమార్ – అంతర్వేది; వర్మ కలిదిండి – గోదారి పలకరింపు అలాంటి వాటిలో కొన్ని.

ఇక ఈ పుస్తకం పేరుకోసం చాలా కాలం ఆగాల్సి వచ్చింది. ఒకటి రెండు అనుకున్నా ఎందుకో సంతృప్తిగా అనిపించలేదు. ఓరోజు నన్నయ్యగారి ‘సారమతిం కవీంద్రులు’ పాడుకుంటుంటే ‘లోనారసి’ దగ్గర పద్యం ఆగిపోయింది. ఈ వ్యాసాలన్నీ లోపలికీ చూసి అంతర్వీక్షణతో వ్రాసినవే. అందుకే ఆ పేరుతోనే పుస్తకాన్ని మీ ముందుంచుతున్నాను.

ఈ సందర్భంగా విమర్శ పురస్కారం అందజేసిన కీ.శే. డా. ఎన్. రామచంద్ర (ప్రొద్దుటూరు); సోమనాథ కళా పీఠం (పాలకుర్తి); బుద్ధవరపు ఛారిటబుల్ ట్రస్ట్ వారికి; సమీక్షలను ప్రచురించిన కళాగౌతమి, సాహితీ ప్రస్థానం, రమ్యభారతి, ఆంధ్రప్రభ, సృజననేడు, విశాఖ సంస్కృతి, నవ మల్లెతీగ పత్రికలకు; కవిసంధ్య, సాహితీ స్రవంతి; ఆంధ్రీ కుటీరం; సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ సంస్థలకూ ధన్యవాదాలు.

–అవధానుల మణిబాబు

ఈ క్రమంలో...

***

1 కుముద్వతీ తీర కథలు

**"ఆయువుగల్గు నాల్గు గడియల్ కవితాసతి పాదసేవకై
కాయమునంకితం బిడితి, కాలమికెన్ని పసింది పూవులన్
పూయునొ? ముక్తి కాంత నను పొందునొ పొందదొ? మేధ పచ్చిలే
బ్రాయపుటూహలన్ బొదివి రంజిల జేయునొ చేయదోకదే!"**

–ఎనభై ఏళ్ళ జీవితంలో అధికసమయం కవితా సతి పాదసేవకై వెచ్చించి, వివిధ ప్రక్రియలలో సుమారు 30 గ్రంథాలను ప్రచురించి, జీవన సఫలత పొందిన సాహితీవేత్త డా. ఎన్. రామచంద్ర.

కవిత్వం, కథలు, నాలుగు నవలలు (నూర్జహాన్, నేను సైతం, రేనాడు, మాళవిక) పారిజాతాపహరణం, శ్రీ కృష్ణమాయ అనే పౌరాణిక పద్య నాటకాలు వీరి బహుముఖీన సాహిత్య వ్యాసంగాన్ని తెలియజేస్తాయి. వచన కవిత్వ విభాగంలో చేర్చదగ్గ "ఊకదంపుళ్ళు (చిరాకు–పరాకు)" ప్రత్యేకమైన రచన. కోయిలమ్మ పదాలు, సర్వాంతర్యామి (ఆధ్యాత్మిక, వేదాంత, తాత్త్విక వ్యాసాల సంకలనం) సాహిత్య చరిత్రలో వీరి ప్రత్యేకతను నిలిపే పుస్తకాలు. వీరి అసాధారణ విమర్శనాపటిమ "తేనె పల్కులు–తీపి గుర్తులు"లో కనిపిస్తుంది.

పై పుస్తకాల ముందుమాటలలో విభిన్న ప్రక్రియల గురించి తన విలువైన అభిప్రాయాలను ప్రతిపాదించారు డా. రామచంద్ర. అవన్నీ వారి సాహిత్య దృక్పథాన్ని మనకు అందజేస్తాయ్.

1. వస్తు తత్త్వ నిరూపణమే విమర్శ యొక్క ప్రధాన దృక్పథం. పరిశీలనా దృష్టి సంస్కృతీ వికాసానికి హేతువు. సాహిత్యం, విమర్శ - ఇవి రెండూ పరస్పరాశ్రితాలు. సాహిత్య సృష్టికి వ్యాఖ్యాత విమర్శకుడు. అతని బాధ్యత గురుతరం. రాగ ద్వేషాలకతీతంగా , నిష్పక్షపాతంగా కృతితత్త్వ వివేచన జరగాలి. కృతి, కృతికర్త పట్ల సానుభూతి అవసరం.

2. ప్రాచీన సాహిత్యాన్ని నవీనదృష్టితో, నవీన సాహిత్యాన్ని ప్రాచీన లాక్షణికదృష్టితో అంచనా వేయకూడదు.

3. కాలిక స్పృహ, ప్రాంతీయ స్పృహ, వస్తుస్పృహ, వాస్తవికతా, మానవతాస్పృహ విమర్శకుడికి తప్పని సరి.

***

వారి జీవిత చివరి దశలో "డా. ఎన్. రామచంద్ర జాతీయ విమర్శ పురస్కారం - 2018" నాకు అందజేస్తూ వారి సాహిత్య సంపదను బహూకరించారు. ఆ పుస్తకాలలో ఒకటైన "కుముద్వతీ తీర కథలు" గురించి తెలుసుకుందాం.

***

రాయలసీమ ప్రాంతంలో (కడప, కర్నూలు జిల్లాలలో) నేటి కుందునది పరీవాహక ప్రాంతమే కుముద్వతీ తీరం. ఆ ప్రాంతంలో ఉద్యోగరీత్యా అధిక కాలం

గడిపిన డా. ఎన్. రామచంద్ర 2015లో (వారి 76వ ఏట) ప్రచురించిన పుస్తకమిది.

సమకాలీన సామాజిక సంఘటనలు అంటే వారి సుదీర్ఘ జీవితానుభవంలో విన్నవి, కన్నవి... అవే ఈ కథలలో చోటుచేసుకున్నాయ్. ఉన్నదున్నట్లు చెప్పేస్తే అవి నివేదికలై ఉండేవి. కానీ, కల్పన జోడించి కథానికలుగా ఒప్పించిన సమర్థత వీరిది. పాత్రలు, సన్నివేశాలు ప్రాదేశిక సహజత్వం కలిగి ఉండడం, సంభాషణలు మాండలికంలోనే నడవడం వలన మరింత శోభ చేకూరింది.

గ్రామాలు, పరిసరాలు, ఆహారపు అలవాట్లు, పండించే పంటలు... పడ్డ బాధలు... వీటన్నిటి 'రూపం'లో మార్పుతప్ప మనచుట్టూ మనకు తెలిసిన జీవితాలే కనిపిస్తాయ్. ప్రతి కాలంలో, ప్రతి సమాజంలో కలవని అంతరాలు, వైషమ్యాలు ఈ కథలు. ఆధిపత్య వర్గాల దాష్టీకం, బడుగు జీవితాల దాస్యం, పాలకులు, ప్రకృతి ఎవరికి కోపం వచ్చినా బలయ్యేది ఎవరనే సత్యం, సంచారజాతుల జీవితాలు, కులవృత్తులు, వినోదాలు, విశ్వాసాలు, విలాసాలు, వివాదాలు, వ్యసనాలు ఇవన్నీ కథల్లో అంతర్భాగం. పాత్రలెన్నున్నా రచయిత మాత్రం పీడితుల పక్షమే, అధోజగత్ సోదరుడే రచయితకు నాయకుడు.

***

ఒక్కో కథా చెప్పుకుంటూనే ఎక్కడి విశేషాలు అక్కడ ముచ్చటించుకుందాం:

చీటీల సాయమ్మ కథలో వడ్రంగి పని చేసే భర్త ఏదో సంపాదించాలని "సిద్ధారెడ్డి" ఇచ్చిన నలభై వేల సాయంతో మస్కట్ వెళ్ళడం; ఒంటరైన సాయి చీటీలు నడుపుతూ సిద్ధారెడ్డికి చేరువకావడం, ఊళ్ళో మిగిలిన మగాళ్ళ మాటలు, చేతలు...

చివరికి కథ **"ఇంతకూ సాయమ్మది హత్యా? ఆత్మహత్యా?"** అనే ప్రశ్నతో ముగుస్తుంది. కారణం 'ఇతడు' అని పాఠకుడు చెప్పలేడు కానీ ఇది అని మాత్రం స్పష్టంగానే తెలుస్తుంది. దిగువ మధ్య తరగతి ప్రజలలో నేడు మంచి జరుగుబాటే ఉన్నా, రేపటికి ఒకింత కూడబెట్టాలనే ఆశ జంటలో ఒకరిని ఇతర దేశాలకు తీసుకుపోవడం, ఇక్కడ ఉన్న వారి జీవితాల్లో వచ్చే క్రమానుగత/పెను మార్పులు ఈ కథలో తెలియజేస్తారు.

మరో కథ **"జవహర్ షెడ్"** లో రెజీనా కువైట్ వెళ్ళడం, షెడ్లో పనితప్ప వేరే వ్యాపకం పట్టని ఆమె భర్త జబ్బార్ ఒంటరిగానే మిగిలిపోవడం, అతడి ఆలనాపాలనా చూసే ఇడ్లీలమ్మే పాపక్క చేరువకావడం.

ఓచోట జబ్బార్ వ్యక్తిత్వం గురించి చెబుతూ అతడు "ఒక చలివేంద్ర, ఒక సత్రం, ఒక పేదరాశి పెద్దమ్మ, ఒక దిగుడు బావి" అంటారు రచయిత. నాలుగు మాటల్లో ఒక జీవితాన్ని చెప్పారు కదూ! కథ చివర్లో **"జీవితంలో అన్ని ప్రశ్నలకూ, నిగూఢమైన, గాఢమైన సమాధానం ప్రణయంలోనే ఉంటుంది కానీ అది అందుకునేందుకు విశ్వమంత హృదయం ఉండాలి"** అంటారు. తాత్త్వికస్పర్శ లేని వాక్యం వ్రాయలేకపోవడం రామచంద్ర బలం.

"ఒక జన్మ చాలు" – హరికథా సంప్రదాయం, హరిదాసుల, నటీనటుల సాధన, కృషి; ఆయా రంగాలలో అలవాట్లు, ఏర్పడే తాత్కాలిక వ్యామోహాలు అవి తీసుకువచ్చే శాశ్వత మార్పులు వివరించే కథ.

మేక మేయని ఆకు: ఇది గొడ్డెనుముల నరసిములు కథ. పశువుల రోగాలకు చికిత్స చేసే అంజనప్ప బోయడు నల్లమల అడవుల్లో దొరికే తీగతో గొడ్డుమోతుగొడ్లు ఎదకు రావడానికి పసరు కనుక్కోవడం; ఆ విద్యతోనే వైద్యం, పశువుల వ్యాపారం నడుపుతున్న నరసిములు జీవితంలో ఈ ప్రయోగం ఎలా ఉపయోగపడింది అనేది కథ.

కథ ఎంత ఉత్సాహంగా నడుస్తుందో! ఎన్నెన్ని సంగతులు చెబుతారో రచయిత! అహోబిలేశ్వరుని రేనాటి పల్లెల విహారం, భక్తులు కాయకర్పూరాలు సమర్పించడం; బొల్లారం, రామతీర్థం, మద్రిపల్లె, పడకండ్ల, ఆళ్ళగడ్డలలో పండుగ వాతావరణం; బ్రహ్మోత్సవాల సందడి; పాములేటిలో గొంతు కోయించుకున్న జీవాలు; దరివెంబడి గుబురుచెట్ల దగ్గర విడిదిచేసి మసాలా రుబ్బుళ్ళు, పూరీల వత్తిళ్ళు, పరాచికాలు, మసాలా ఘుమఘుమలు, దట్టాలు చెట్టుకు తగిలించి కలాసాలు తీసేవాళ్ళు, మొద్దుల మీద తునకలు చేసేవాళ్లు వెరసి పొద్దు బారెడెక్కేసరికి నల్లపొడి, గుండెకాయలు, పొట్ట, పేగులు కలిపి వండే బోటీకూరతో నాస్తాకి సిద్ధపడేవాళ్ళు; రాత్రంతా తోలుబొమ్మలాటలు, చెంచు నాటకం, హరికథ, జడ కోలాటాలు, పందరి

భజనలు; చాయ్ ఖానాల దగ్గర కుష్కాలు, ఉగ్గాన్లు, ఉప్మాలు, వడలు..; తీర్థంలో అమ్మే రోకళ్ళు, బడెలు, ఇసురాత్రి గుంజలు, పిల్లనగ్రోవులు, పట్టుడు కర్రలు, వెదురు చాపలు, విసనకర్రలు, చేటలు, పెచ్చాటలు .. ఇలాంటి జాబితాలు ఎన్నో దొరుకుతాయ్.

తిరునాళ్ళకు వెళ్ళినవాడు ఏంచెయ్యాలి "దిగువ, ఎగువ సుట్టి, పాములేటిని సూసి, వరాహస్వామి, జ్వాలాముఖి, యోగానంద, భార్గవ, కారంజ, ఛత్ర స్వాముల్ని దర్శించుకొని " ఇవన్నీ చెప్పేస్తారు రచయిత.

దూళ్ళసంతలో విషయాలు కాడి మరిగిన గిత్తలు, దేశపెద్దులు, చుక్కెనుములు, సంటిదూడలు, మకరుదున్నలు, ఈతకొచ్చినవి, గొడ్డు మోతులు; వాటి అలవాట్లు సుళ్ళూ, సుద్దాలు, కొమ్ములవాటం, చంటి బిర్రు, ఇచ్చుడు మడి, పారుడు అలవాట్లు; ఇలా బోల్డు సంగతుల సమాహారం ఈ కథ.

***

"మోసం చేసేవాడు, మోసపోయే వాడు రెండూ మనిషే అయినపుడు ఇంకెవరిని మోసం చేస్తాం" ఈ ఆలోచనతో బ్రతికేసే సుబ్బన్న కథ **"పగటి వేషగాండ్రు"**. స్థానిక రాజకీయాల నుంచి, చిన్న చిన్న వ్యాపారాలకు అనుమతి, పెద్ద వ్యవహారాలలో మధ్యవర్తిత్వం; చివరికి ఉద్యోగాలకు నకిలీ సర్టిఫికేట్స్ ఇప్పించే స్కాంలో క్రియాశీలక పాత్ర... ఇది – సుబ్బయ్య పాత్ర. కథ పేరుని జస్టిఫై చేయడం కోసం పగటి వేషగాళ్ళ పాటను చెబుతారు, రచయిత. మనమూ ఓసారి చదువుకుందాం –

బలశాలి మాతాత బల్లెంబు చేబూని
పుల్లాకు తూటుగా పొడిచినాడు
ఎద్దుచ్చ పోయంగ ఏరులై పారంగ
తాటి దుంగలపైన దాటినాడు
కలుగులో నున్న కప్ప గర్రు గర్రుమనంగ
కట్టారు తీసుక గదిమినాడు
బీదసాదలు వచ్చి బిచ్చమడిగిన నాడు

ముల్లుగఱ్ఱలతోడ మోదినాడు

....

కాకి కూతకు జడిసేటి ఘటికులండి

పగటి వేషాలు మా వృత్తి పౌరులారా! శుభోజ్జయం.

***

కుటుంబంలో క్రమశిక్షణ లోపిస్తే, సామరస్యం కొరవడితే సంసారం ఎలా ఛిన్నాభిన్నమౌతుందో, సంపన్న కుటుంబాలలో, ఉన్నతాధికారుల ఇళ్ళలో మేడిపండు లాంటి గౌరవాలు ఎలా మసకబారిపోతాయో చెబుతారు – **"గాజుమేడ"** కథలో; మితిమీరిన ఆశలు, స్థాయికిమించిన హంగులు, చట్టానికి అతీతమైన చర్యలు కుటుంబాన్ని ఎలా దిగజారుస్తాయో **"బతికుండగానే..."** కథ చెబుతుంది.

***

ఒప్పందం, బండ బతుకులు, సంభవామి – ఈ మూడు కథలూ రాజకీయాలు, ఆధిక్య పోరులో బలయ్యే పేదలు, ఒంటరి స్త్రీని ఆదుకున్నందుకు సమాజపు ఛీత్కారాలు, ఉన్నత వర్గాల వినోదాలు, కాలక్షేపాలు వాటికోసం బడుగు జీవుల త్యాగాలు, భూమిపై ఆశ, బహుళ జాతిసంస్థలు విసిరే వలలు, చిక్కుకున్న గిరిజనులు, కాస్త మందుకి, డబ్బుకి లొంగిపోయే బలహీనతలు వీటిచుట్టూ తిరుగుతాయ్.

మట్కాస్కూల్ మరో కథ. ఇది చదువుతున్నపుడు అరె! మట్కా గురించి ఈయనకు ఎన్ని విషయాలు తెలుసురా! అనిపిస్తుంది. కథ చివర్లో ప్రధాన పాత్ర ఎద్దులప్ప మట్కా నెంబర్ గురించి తన అవగాహన వివరించినపుడు అదో పరిశోధనా పత్రంలా అనిపిస్తుంది. ఇతడిని కౌన్సిలింగ్ కి తీసుకెళ్ళిన ఎస్.పి గారు ఈ మాయలో పడడం కథలో చమత్కారం.

సవాలు కథలో సనాతన కుటుంబాలలో మంచికి, చెడుకి జరిపే కార్యక్రమాలను సంప్రదాయమని భావించేవారికి, కాదు అది మూఢత్వం అనే వారికీ కొనసాగించాలా? నిరాకరించాలా? అనే ప్రశ్నలకు మధ్య చర్చ. ఈ చర్చ రసవత్తరంగా సాగాలంటే రెండువైపులా సంభాషణలు పలికించాల్సినది రచయితే. ఆ బాధ్యత

సమర్థవంతంగా నిర్వహించారు, రామచంద్ర. చివరికి ఆ సమయం, సందర్భానికి అనుగుణమైన ముగింపునిచ్చారు. ఆ ముగింపు అన్ని సన్నివేశాలలో సాధ్యం కాదు. కానీ ఆలోచింపజేసే కథ అనడానికి అభ్యంతరం ఉండదెవరికీ.

నేనెవరు కథలో ఏ తప్పు చేయకపోయినా మనపై నింద వెయ్యడానికి సమాజం ఎంతగా కాసుకుని ఉంటుందో చెబుతారు. పశువులకాపరుల దినచర్య మంచి వర్ణన. వెన్నెల వేళల్లో "దాగుడుమూతలు, కనుమూసి గంతలు, ఓమనగుంటలు, గుప్పిటి గురిగింజ, చీకటి మొటికలు" ఇలా ఆడపిల్లల ఆటలముచ్చట్లు మన తరానికి తెలియజేస్తారు.

తనకు అండగా నిలిచిన పెద్ద మనిషికి, పెద్ద మనసుతో తాను తప్పుకుని ఓ శాశ్వత సంబంధాన్ని ఏర్పరిచిన శాబీ కథ **"నిర్వాసిత".** తన త్యాగం అడ్డంకిగా మారిన తర్వాత, మొదటి కథలాంటి ముగింపే – **"గట్టునుండి మట్టి జారి శాబీ గుంటలోపడి మరణించినట్లు గుంపులోని జనాల గుసగుసలు – పడి చనిపోయిందా? చనిపోయాక పడిందా?".**

***

కథలన్నీ రచయితే చెబుతారు. మధ్యమధ్యలో తత్త్వాలు, కృష్ణ శాస్త్రి గీతాలు, గేయాలు, కవితలు, శ్లోకాలు, పద్యాలు, ఇంగ్లీసు కొటేషన్స్ ఇవన్నీ ప్రస్తావిస్తారు. ఐతే కొన్నిచోట్ల రచయిత Excessive involvement పాఠకుడిని ఇబ్బంది పెడుతుంది. చదువుతూ తాను చూస్తున్న దృశ్యాన్ని రచయిత మసక బారుస్తున్నట్లవుతుంది.

కథారచనలో కావ్యభాష చోటు చేసుకోవడంపై వచ్చిన విమర్శకు రచయిత ముందుమాటలో సమాధానమిచ్చారు. కానీ, అగ్నిజ్వాలా కుసుమాలు వంటివి కొంత కృతకంగానే అనిపిస్తాయ్.

"సియ్యా, సేపా అంటే రెట్టింపు కడుపులవుతాయ్" వంటి వాక్యాలు, కథానుగుణంగా వాడిన నుడికారాలు, జాతీయాలు ఆకర్షిస్తాయ్. కష్టం వచ్చినపుడు అల్లాడిపల్లె వీరభద్రుని మొక్కులు; కదిరి నారసింహుని వైభవం; ఆకలి వేళల్లో "వేడివేడి సంగటి ముద్దలు, కొయిటాకు పప్పు; పల్లీల ఊరిబిండి, మటిక్కాయ తాళింపు;

మజ్జిగ; గోవాకు ఊరిబిండి, పప్పుమీద సన్న నిమ్మకాయంత అప్పుడే చిలికి తేర్చిన వెన్నముద్ద, చిప్పెడు మెంతిపప్పు; చదువుతున్నపుడు నోరూరిస్తాయ్. అప్పుడప్పుడు కుష్కా, చపాతీ, తలకూర కూడా కనిపిస్తాయ్.

***

ప్రతి కథా ఆర్తితో కూడిన ప్రశ్నకు ఆర్ద్రతతో సమాధానం ఇస్తుందని రామచంద్ర నమ్మకం. ఐతే ఆ సమాధానం కథలో నేరుగా దొరుకుతుందని చెప్పలేం. మనలో రగిల్చిన సంఘర్షణే మనదైన సమాధానాన్ని ఇస్తుంది. అది వైయక్తికం కావచ్చు, సార్వజనీనమూ కావచ్చు. ఈ కథలన్నీ సరదాకో, తోచుబాటుకాకో, ఏం రాస్తే కాదంటారులే! అని తేలిక భావనతో వ్రాసినవి కాదు. "మా పల్లె ముచ్చట్లు" అనే పుస్తకంలో ఓచోట **"ఓ గొప్ప కథ రాయాలంటే వంద సంవత్సరాల జీవితం, లక్ష కథల జీవితసారం నమిలి, మింగి, జీర్ణించుకొని జీవితాన్ని క్షాళితం చేసుకొని పునీతత్వం సాధించి ఉండాలి" అంటారు రామచంద్ర.** మరి, ఆ అభిప్రాయానికి వ్యతిరిక్తమైన కథలను వ్రాస్తారని ఎలా భావిస్తాం.

మనిషి ప్రాథమిక సహజాతాలను నిర్వహించుకొనే క్రమంలో సమాజపు అంగీకార అనంగీకారాలతో నిమిత్తం లేకుండా కొన్ని కొన్ని సర్దుబాట్లు ఎలా జరుగుతాయ్ అనేందుకు తాను వ్రాసిన ప్రతి కథనూ ఓ ఉదాహరణగా నిలిపారు. ముక్కారు పంటలిచ్చే కర్నూలు, కడప కాలువకింద భూములు, మున్నూట అరవై అయిదు రోజులు పనులు, నెమ్మదస్తులైన రైతులు, నమ్మకస్తులైన ఇరుగు పొరుగులు వీటన్నిటితో కథలన్నీ పాడి, పంటా వాసన కొడతాయ్. కంకి ముదరని లేత తీపి జొన్నకర్రల మధ్య చొప్పమోపు తలగడగా పెట్టుకు పడుకున్నంత హాయిగా ఉంటాయ్.

❖

2 పరిసరాలు, పరిచయాలకు కావ్యగౌరవమిచ్చిన శిఖామణి "యానాం కవితలు"

గడపలన్నిటిలోన ఏ గడప మేలు? అరుగులన్నిటిలోన ఏ అరుగు మేలు? ఊరులన్నిటిలోన ఏ ఊరు మేలు?– ఇలా చిన్నప్పుడే మన గడపని, అరుగుని , వీథిని, ఊరుని, గురువుని – అభిమానించడం నేర్పుతారు. కాస్త పెద్దయ్యాక ఈ అభిమానం ఆరాధన స్థాయికి పెరిగి, ఎలా వ్యక్తం చెయ్యాలి? – అనే తపన మొదలవుతుంది. ఈ వ్యక్తీకరణ మన వృత్తి, ప్రవృత్తి కల్పించిన అవకాశం మేరకు జరుగుతుంది. కొందరు పుట్టిన ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తే, మరికొందరు సౌకర్యాలు కల్పిస్తారు. మరి, సృజనకారుడు ఏం చేయగలడు? ఆ ఘనతను అక్షరాలలో పొదుగుతాడు. అలాంటి కథలు, గాథలు ఎన్నెన్నో సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయ్. అమరావతి కథలు, పసలపూడి కథలు, మా సీమ కథలు, చింతలవలస కథలు, యానాం కథలు, కథా పార్వతీపురం ఇలా ఎన్నెన్నో. పుట్టిన ఊరు నుంచే కాదు, ప్రవాసం గురించీ మరెన్నో కథలు. విశాఖ గురించి, హైదరాబాదు గురించి, వారి వారి గ్రామాల గురించి కవితా సంపుటులు, సంకలనాలు వచ్చాయ్ (కథలతో పోలిస్తే కవితల సంఖ్య తక్కువే). కానీ, తన ఊరి గురించి ఒక కవి 46 కవితలు వ్రాశాడంటే, అతడు ఎంతగా మమేకం చెందాడో! అదిగో అలా, కవి 'శిఖామణి' వివిధ కవితా సంపుటాలలో "యానాం" నేపథ్యంలో వ్రాసిన కవితల సమాహారం **"యానాం కవితలు"**.

ఒక ప్రాంతం అనగానే ఏం గుర్తుకొస్తాయ్! అక్షాంశాలు, రేఖాంశాలు, భౌగోళిక స్వరూపం, కొండకోనలు; ఉంటే కోటలు, బురుజులు.. ఇంతేనా! "దేశమంటే మనుషులోయ్" అని మనసారా నమ్మినవాడు కవి. అందుకే, "తనను కన్నవారు, తాను కన్నవారు, పెంచినవారు, కలిసి పెరిగినవారు, తీర్చిదిద్దినవారు, ఆత్మీయత పంచినవారు, ఆత్మలో నిలిచినవారు, విడిచి పోయినవారు..." వీరందరినీ కవితా వస్తువులుగా ఎంచుకున్నాడు.

ఇంత ఆపేక్షకు కారణం ఏమిటి? ఏదైనా కోల్పోయినపుడే కదూ! దానిపై ఆపేక్ష పెరిగేది. కవి కూడా అంతే.

పాతబడ్డ టైరులాంటి జీవితాన్ని
ఆట సాకుతో
దొర్లించుకుంటూ దొర్లించుకుంటూ
మాయానగర్ సర్కస్ గుడారానికి
దారితప్పి వచ్చానా?

ఈ విచికిత్స నిరంతరం వెంటాడుతూనే ఉంది. అవుననిపించిన ప్రతిసారీ ఓ కవిత ఉదయించింది. ఆ పరిసరాలు, వ్యక్తులు ఇపుడు మిగలకపోయినా జ్ఞాపకాలు మాత్రం సజీవంగా సతతహరితంగా నిలుపుకున్నారు **"తులసిమొక్క చనిపోయినా తులసికోట మిగిలిపోయినట్టు".**

కవితలన్నీ చాలాకాలం తర్వాత కుటుంబసభ్యులంతా కూర్చుని ఆల్బం తిరగేస్తున్నట్టు; బాల్యమిత్రులు రీ యూనియన్లో కలుసుకున్నట్లు; ఏ రైలు ప్రయాణంలోనో మన ఊరివాడు కనిపించి అందరి సంగతులూ చెబుతున్నట్లు ఉంటాయ్.

"పంటచేలో పరిగెలేరుకున్నట్టు
ఎండాకాలం ఏటివార
ఉప్పుడొంకల్లో
ఎండుపుల్లలు ఏరుకున్నట్టు – జ్ఞాపకాల్లో మనుషులను ఏరుకుంటూ కనిపిస్తారు శిఖామణి. పాత్రలతో పరిచయంలేని మనకు మొదట్లో అవన్నీ అంత

విశేషంగా అనిపించకపోవచ్చు. కానీ కవికి మాత్రం ఇవన్నీ **"అంచు విరిగినా, సన్నని బీటవారినా, రాజసం పోని రంగూను పింగాణీ ప్లేటు"**లాంటి జ్ఞాపకాలు.

ఆ పాత్రలు యానానికి చెందిన ఒకనాటి గంగిరెడ్ల మరిడమ్మ, చెల్లె గోపెమ్మ, హోటల్ ఓనర్ మన్నె బుల్లెయ్య, డ్రిల్లు మాస్టారు రమణమూర్తి, మోరంపూడి కుటుంబరావు, కొట్నాల ప్రభాకరరావు, దడాల రమణయ్య రఫేల్,... ఎవరైతేనేం? కవిత పూర్తయ్యేసరికి వారు మనకు ఆప్తులైన వారిలో ఒకరవుతారు.

ఈ తలపోతలన్నిటిలోనూ, వారి ఆత్మీయమిత్రుడు జిల్లెళ్ళ భాస్కరరావు సంస్మరణలో వ్రాసిన కవిత ఈ పుస్తకంలో పరాకాష్ఠగా నిలుస్తుంది. ఇక్కడ కవి ఏమన్నాడో చూడండి

"ఊళ్ళో కుక్కగానైనా పుట్టినా బాగుందును.
జ్ఞాపకానికి వచ్చినపుడల్లా స్మశానానికి వెళ్ళి
నీ సమాధి చుట్టూ మూచ్చూస్తూ ముమ్మార్లు తిరిగి
తలంపాలు దగ్గర కూచుని
తనివితీరా పడుకుని వద్దును" ఎవరనగలరు ఇలా? పది కవితాసంపుటాలు, పది విమర్శా గ్రంథాలు, డాక్టరేటులు, అవార్డులు ... ఇవేవీ శిఖామణిని స్నేహితుని సమాధిచుట్టూ తిరిగేందుకు కుక్కగా పుట్టినా బాగుందును అనేందుకు అడ్డు రాలేదు.

నిజమే, వ్యక్తిపై అవధిలేని ప్రేమ ఎంతమాటనయినా అనిపిస్తుంది. అతడు వేరు తాను వేరు అనే భావన లేదు. అందుకే "ఈ వాక్యాలు బతికుండగానే నా గురించి నేనే రాసుకున్న స్మృతిగీతం" అంటాడు. భాస్కరరావుగారిది అకాలమరణమే కావచ్చు, కానీ ఇలాంటి ఒక స్నేహితుడిని సంపాదించిన వారి జన్మ ధన్యమనిపిస్తుంది, ఈ కవిత చదివాక.

ఇలా వ్యథలు, గాథలే కాదు, మనుషుల మంచితనాలూ కన్నీరు తెప్పిస్తాయ్, చూడండి –

"పెద్ద పండక్కి
పేద అత్తవారింటికి
సంచీలో కొత్తపంచె తీసుకెళ్ళి

తిరుగు ప్రయాణంలో దానికి

అత్తవారి పసుపు పూయించుకొచ్చిన ఔదార్యం నీది" అంటారు తండ్రిని తలుచుకుంటూ. ఆ తండ్రి పోలికలు, అలవాట్లు తన పాపలో చూసుకుంటాడు కవి. అవి రూపంలోనో, ముఖకవళికల్లోనో కాదు వెదికేది. పశువులతోను, కోడిపిల్లలతోనూ పాపాయి ఆడుకొంటున్నపుడు తండ్రిలోని పసితనాన్ని దర్శిస్తాడు.

➢ సమాజంలో తప్పనిసరిగా ఉండాల్సిన అంశాలు, బాధలు, బంధాలు, బాధ్యతలు ఇపుడు లుప్తమైన దశలో వాటిని పదేపదే తలుచుకుంటాడు కవి.

"మనం పరుగులు తీసిన పేట సందులన్నీ ఇపుడు మనుషుల్లాగే మూసుకుపోయాయి".

"తేలుకుట్టి నేనేడుస్తుంటే
నన్నుచూసి నాకంటే నువ్వే ఎక్కువ ఏడ్చావు గుర్తుందా –
ఇప్పుడు ఎవరి ఏడ్పులు వారివేతప్ప
ఇతరుల కోసం ఏడ్చే మనుషులేరి మీరా!"

"ఇప్పుడు నువ్వు లేనట్టే మీ ఇల్లూ లేదు" ఈ వాక్యాలలో మనుషుల్లాగే మూసుకుపోవడం, ఇతరుల కోసం ఏడ్వలేకపోవడం, నీలాగే ఇల్లు లేకపోవడం అనడంలో కవి ఉద్దేశ్యం కేవలం మార్పును తెలియజేయడం కాదు, సమాజం ఎంత సంకుచితమైపోయిందో చెప్పడం, ఏర్పడిన వెలితిని ఎత్తిచూపడం.

➢ కేవలం, ఈ పుస్తకంలో కవి వాడిన ఉపమానాలు, అన్వయాలపైనే ఓ పరిశోధనా వ్యాసం వ్రాయవచ్చు. ప్రతి విషయాన్ని అద్భుతమైన పోలికతో సంసర్గం చేస్తూ చెప్పగలగడం కవి తాలూకు బలం.

i) **"ఆకాశాన్ని దీర్ఘ చతురస్రంగా అయిదు అడుగుల మేర కత్తిరించి అందమైన ఫ్రేములో బంధిస్తే అది ముత్యాలుగారి నిలువుటద్దం అయింది"** – ఎంత బావుందీ వాక్యం! మబ్బులు నిరంతరం సాగిపోతూ ఆకాశరూపం మారుతూ ఉంటుంది. చూసేవాళ్ళ మనసుని బట్టి ఒక్కోరూపం కనిపిస్తుంది. మరి, అద్దమూ అంతే కదా! చూసేవాళ్ళను బట్టి రూపం మారుతుంది. (నాకు

ఇలా అర్థమైంది సార్, అంటే నా ఉద్దేశ్యం ఇది కాదు గానీ, ఇదీ చాలా బావుంది అనేంత మంచితనం శిఖామణిగారిది)

ii) **నరసమ్మగారు లేని యానాం సరస్వతి లేని బాసరలా ఉందంటారు**, కవి. అంటే ఆలయం తప్ప బాసరలో మరేమీ లేదని కాదు, ఏ అంశం వలన దానికి ఉదాత్తత చేకూరిందో అది లేకపోతే, మిగిలినవి ఉన్నా లేనట్టే అని.

iii) **రొమ్ములూ, గర్భసంచి లేని మగతల్లిగా** పెంచిన తండ్రిగారిని; **మనిషి రూపమెత్తిన ఆదిమపనిముట్టుగా** మేనత్త గిడ్డి వీరమ్మ గారిని స్మరిస్తారు.

iv) **ఆకాశపు బాస్కెట్లో సూర్యబింబపు బంతిని వేయదానికి పైకెత్తిన చెయ్యిలా** జెండాస్థంభాన్ని ఊహించడం... ఇలా ఎన్నెన్నో.

v) **"మా అమ్మ చేయి ఎప్పుడూ కళ్ళకు అందనంత దూరంలోనే ఉండిపోయేది"** అని పగటిపూట, చేతిపై తలపెట్టుకుని పడుకోడానికి కాసేపైనా తీరిక లేని అమ్మను తలచుకుంటాడు.

vi) ఇక పుస్తకంలో గొప్ప వాక్యం ఏదంటే ఇదేనేమో – **"నది చెట్టును అలల రంపంతో కోయగా వచ్చిన రంపపు పొట్టులాంటి ఇసుక"**. గాథా సప్తశతిలోని గాథల స్థాయి వాక్యమిది.

vii) **తల్లి గోదారి తపస్సుచేస్తే**
నువ్వు అర్టోస్ రూపంలో చిరంజీవిగా ఉంటావు
అని గౌతమమహర్షి వరమిచ్చి వుంటాడు – అని రాజుగారి రంగుకాయ (Artos Cool Drink) గురించి; **"నా బతుకు పరీక్షను గట్టెక్కించి పరిపూర్ణతను చేకూర్చిన గ్రేస్ మార్కువి తల్లీ నీవు"** అని పాపాయి గురించి వ్రాసినపుడు 'ఇలా ఎలా రాస్తాడ్రా ఈయన' అనిపించకమానదు.

➢ ఈ పోలికలకోసం మనకు తెలిసిన దృశ్యాలనే కాక, గోదాదేవి పూలమాల లేసుకోవడం, కావ్యాలలో గహనాటవులు, ఆముక్తమాల్యదలో ఊడలమఱ్ఱి, బెజ్జమహాదేవి, గడగూచి, సిరియాళుడు, భగీరథుడు, ద్రోణుడు వంటి ప్రబంధ, పురాణ, ప్రాచీన కావ్యాంశాలను అందంగా ఉదహరిస్తారు. అధ్యయనం, అధ్యాపనం దాగేవి కాదు.

➢ జీవితాలతోబాటు జీవన సూత్రాలనూ చెబుతాడు కవి.

i) **"నా బతుకంతా ఎదురీతే**
ఉరకలెత్తే వరద గోదారి
సముద్రంలో కలిసే సంగమ స్థలి
నా పోరాట రణస్థలి" అనిపిస్తారు పులసతో. అయితే ఇంత పోరాడి ఎదురీది పొందినది విజయమా? పరాజయమా? అందుకే ముగింపులో **"లక్షలాది జనుల రాసిక్యపు నోళ్ళలో ఒక్క లాలాజలం బిందువునై ఉదయిస్తున్నందుకు సంతోషిస్తాను"** అనిపించి త్యాగాన్ని, సార్థకతను, తృప్తిని "పులస చేప స్వగతం"గా వినిపిస్తారు.

ii) పడవే ప్రమాదం అయినపుడు **"యుద్ధం నదితోనా, పడవతోనా?"** అని ప్రశ్నించి మరో కవితలోకి వెళ్లిపోతాడు కానీ, అది వందల ప్రశ్నలుగా మనల్ని వెంటాడుతూనే ఉంటుంది.

iii) చిన్నపుడు అన్ని ఆటల్లో నెగ్గిన నువ్వు జీవితపు ఆటలో ఓడిపోయావ్ అని బాల్య స్నేహితురాలు మీరా గురించి బాధపడతారు. బాల్యపు విజయాలు భవితను నిర్ణయించలేవని, మనిషంటే విధి చేతిలో బొమ్మేనని నమ్మిక తప్పదు కదూ!

***

➢ పుస్తకమంతా తడిదనం, అది చేతిని కాక మనసుని తడుపుతుంది.

"వాన వెలిసాక
గంగరావి చెట్టు కింద నించొని
చెట్టు కొమ్మట్టుకు లాగినట్లు" ప్రయత్నపూర్వకంగా చెమ్మగిల్లుతూ ఉంటాడు. అందుకే, పూలమ్ముకునే కుర్రాణ్ణి "బాల్యాన్ని మూరమూర చొప్పున కోసి అమ్ముకుంటున్నాడు" అంటారు. "ఎండపొడ తగిలి వొడిలిపోతున్న పూలపై చెమటనూ కన్నీళ్ళనూ చల్లి మృదుత్వాన్ని కాపాడుతున్నాడు" వాడు అమ్మేది పూలైనా, కట్టెలైనా ఒకటేగా అని బాధ పెట్టేస్తాడు.

ఎందుకిలా ఇంత బలవంతంగా గుర్తుచేసుకుని బాధపడడం అని అడుగుతారేమో –

"కన్నీరు పెట్టుకోడానికి ఏదో బలమైన కారణముండాలి
అన్నంతో తీరని ఆకలిలాగో,
నీటితో తీరని దాహంలాగో
నన్ను నేను ద్రవింపజేసుకుంటాను" అంటాడు. కవితాలన్నీ చదివాక, "జీవితపు ఇంత పై పొరలోనే దుఃఖం ఉందనుకోలేదు ఇంతకాలం" అంటాం మనం కూడా.

- ➢ అంతులేని ఆత్మ విశ్వాసాన్ని ప్రదర్శించేటప్పుడూ అది వినమ్రంగా వ్యక్తీకరించడం శిఖామణిలో చూస్తాం. "ఆ రోజు మట్టి ప్రమిదలో మీరు ఎగదోసిన చిన్న ఒత్తి ఈ రోజు దీపశిఖయై కవిత్వాన్ని వెలిగిస్తోంది". కవిత్వమై వెలుగుతోంది అనకుండా కవిత్వాన్ని వెలిగిస్తోంది అని ఒకింత సాధికారంగా చెప్పుకున్నా, వినయంగా అది నరసమ్మగారిచ్చిన కవిత్వపు స్తన్యమని గుర్తు చేసుకుంటారు. ఈ ఒద్దిక కవిలోను, కవితలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

"నడి వేసవి, పొలం గట్టున, తుమ్మ చెట్టు నీడలోని నిద్రలాంటి" ఓ ఊరిలో "పొద్దు తిరుగుతున్న వయసులో ఏరుకున్న జ్ఞాపకాలు" గురించి కవి చెబుతుంటే మనకు "అమ్మమ్మ ఇంట్లో ఇత్తడి దస్తాగిన్నెలో అన్నం తిన్నట్టు" ఉంటుంది. హృదయంలో ఇన్ని జ్ఞాపకాలుంటే అది మరేం తోచనిస్తుంది? ఓ కవితలో రెండుసార్లు వ్రాసుకున్నట్లు – "ఒక్కోసారి ఏమీ చేతకాదు వుత్త గుర్తుకు తెచ్చుకోవడం తప్ప".

సాహిత్య ప్రస్థానం డిసెంబర్ 2020లో ప్రచురితం.

3 శ్రీ నీలకంఠేశ్వరా!

ఇష్టమైన అంశంపై ఇష్టమైన రీతిలో అనేక భావాలను సమన్వయం చేసుకుంటూ రచన చేసేందుకు అవకాశమున్న ప్రక్రియ శతకమ్. ఇన్ని వందల ఏండ్లలో ఎన్నెన్ని శతకాలని? ఎంచుకున్న అంశం పరిధి ఎంత విస్తృతమైతే వ్యాఖ్యానానికి, విన్యాసాలకీ అంత అవకాశం. ఇక "వాచామగోచరమనేక గుణస్వరూప"మైన పరమాత్మపై శతకం అయితే ఆలోచనలకు అవధి ఏముంటుంది? ఐతే సామర్థ్యమున్న కవి ఇన్ని అవకాశాలనూ వినియోగించుకోకుండా, తనకు తానుగా పరిధి విధించుకున్నా తలస్పర్శి ఐన జ్ఞానవిశేషాలు అసంకల్పితంగానే ప్రదర్శితమౌతాయ్. అలా, "త్రయీ వేద్యం, హృద్యం" అయిన స్వామి దివ్యమంగళ విగ్రహమంతా కాకుండా కేవలం స్వామి నీలకంఠము మాత్రమే కవితావస్తువుగా స్వీకరించి ఆధ్యాత్మిక సాహిత్య జీవులిరువురికీ శ్రీ సామవేదం షణ్ముఖశర్మ అందించిన ఉపాయనం "శ్రీ నీలకంఠేశ్వరా" శతకం.

ఓ సాహిత్య ఉపాసకుడు తన తొలిదశలో, ముప్పై ఒకటవ ఏట ఈ శతకాన్ని వ్రాశారంటే ఆధ్యాత్మికరంగంలో ముందుముందు అతడు చేరబోయే శిఖరాలను గురించి అప్పటి పెద్దలు ఏమనుకున్నారో! అవన్నీ నాడు ఆకాంక్షలు, నేడు ఋజువైన సత్యాలు.

కేవలం పదమకుటంగా కాక, ప్రతి పద్యం "నీలకంఠేశ్వర" శబ్దసార్థక్యంతో వ్రాయాలని సంకల్పించి కృతకృత్యులయ్యారు, కవి. ముందుమాటలో వారి సంకల్పం ఎంతో వినమ్రంగా విశేషంగా ఉంటుంది. స్వామి అర్చనే జీవితంగాసాగేందుకు సహృదయుల దీవెనలు కోరుతూ, ఈ పద్యాలలో ఒదిగిన తాత్త్వికదృక్పథం తన త్రికరణశైలిగా మారేలా స్వామి అనుగ్రహించాలని ప్రార్థిస్తూ ప్రారంభిస్తారు. శతకం మొత్తంలో నూటయాభైకిపైగా విశేషణాలతో స్వామిని సంబోధిస్తారు. అంటే మకుటంలో వచ్చే "నీలకంఠేశ్వరా"తో సంపుటీకరణం చేస్తూ ఇన్నిసార్లూ మనం శివుని జపించినట్లు.

- మొదటిపద్యంలోనే, ఆ పరమశివుని సాహిత్యస్వరూపంగా దర్శిస్తారు. సాగరతుల్యమైన శబ్దాన్ని మథించినపుడు జనించే కావ్యాలలో కొన్ని మాత్రమే సుధలు చిందుతాయ్. ఐతే, విషాన్ని మాత్రం నీకిచ్చి, అనంతర అద్భుతాలన్నీ ఉంచుకున్న దేవతలవంటివాడిని కాను స్వామీ! ఆజీవనం నేవ్రాసే (నీవు వ్రాయించే) కావ్యాలన్నీ అవి రసమయమైనా/ రసహీనమైనా నీకే అర్పించుకుంటాను అంటారు, శతకకర్త.

  మరో పద్యంలో, నేనూ ఆ దేవతలవంటివాడినే, కొన్నిసార్లు ఈ పంపకాల పోరులో మోహంలో పడిపోతాను, మన్నించి వారిని అనుగ్రహించినట్లే నన్నూ కృపజూడు, అని వేడుకుంటారు. ఈ రెండు భావనలూ ఎంతమాత్రం విరుద్ధం కాదు. మొదటిది భక్తి వలన కలిగే ఆత్మవిశ్వాసం; రెండవది తాను కేవలం జీవుడిని అనే ఎరుకతో పరమాత్మ పట్ల విశ్వాసం. అయినా, శతక పద్యాలన్నీ ముక్తకాలు కావున వేటికవి స్వతంత్రాలు; స్వామిగళమే ఏకసూత్రత.

ఈశ్వర స్వరూపాన్ని ఓ పరిపూర్ణజ్యోతిగా భావనచేస్తే జ్యోతిలో కన్పించే వివిధ వర్ణాలలో నీలపుకాంతి కంఠభాగంగా కనబడుతుంది కవికి. జ్యోతిలో ఉష్ణోగ్రతాభేదాన్ని అనుసరించి Non luminous zone, Blue Zone, Dark Zone, luminous Zone, Non luminous Veil అనే ఆవరణలు వివిధ కాంతులలో ఉంటాయి. అలాగే ధ్యానస్థితిలో కూడా మన:స్థితిని అనుసరించి అనేక రంగులు కనిపిస్తాయ్. ఆ వర్ణాలలో స్వామి రూపాన్ని, వర్ణనావస్తువైన కంఠాన్ని దర్శించడం విశేషం.

స్వచ్ఛ పారదర్శక స్ఫటికం తన సమీప వస్తువు రంగులోనే కనిపించినట్లు నీ రంగులన్నీ నిన్ను ఆవరించిన లీలలు తప్ప "పరమ శుద్ధుడవు" నీకు రంగేమిటి స్వామీ! అంటారు, మరో పద్యంలో. ఇలా వైజ్ఞానిక దృగ్విషయాలనూ పొందుపరచుకున్న విశేషాలెన్నో!

- అజ్ఞానం అంటే అందుబాటులోఉన్న అద్భుతాలని గుర్తించకపోవడమే; వారు దేవతలైనా, మానవులైనా. అన్యులకు దుస్సాధ్యమైన విషపానం చేసిన తర్వాత కూడా నువ్వే అమృతమని తెలుసుకోలేక మళ్ళీ మధనం కొనసాగించారు కదా! అంటారు.

- "తవపి తవ గుణానాం ఈశ పారం నయాతి" అంటుంది శివమహిమ్ని స్తోత్రం. మరి పరమేశ్వరుని లీలలు అనేకమైనా ఆ నీలకంఠంపై శతకకర్తకు అవ్యాజమైన ఆరాధన. ఈ సందర్భంలో ఓ మాట చెప్పుకుందాం. సినిమాకోసం శివుని పాట వ్రాసినపుడూ "గరళం మింగి గంభీరంగా, నిలిచావంట నిబ్బరంగా" అని వ్రాసారందుకే. ఈ నిబ్బరమనే పదం పాటలోనే కాదు ఈ శార్దూలపద్యంలో ఎంత గాఢమైన భావనతో ఒదిగిపోయిందో చూడండి.

అబ్బా! నిబ్బరమన్న నీది కద, దేవాదుల్ మహా తప్తులై
బొబ్బల్ వెట్టుచు బార, సాహసిగ నీవున్నావు విశ్వాన త
బ్బిబ్బుల్ బాపగ; లోకమెల్ల ప్రళయాభీలోద్ధతిన్ దూలుచున్
దిబ్బల్ మున్గెడి వేళ నిల్చు చిరదీప్తీ! నీలకంఠేశ్వరా

- చిన్న, చిన్న విజయాలకే చక్రవర్తుల విజయచిహ్నంగా స్థూపాలను, భవంతులను నిర్మించుకున్నారు. మరి హాలాహల భక్షణ చేసిన స్వామికి విజయచిహ్నం ఉండవద్దా? అందుకే, అంత విషాన్ని ఇంత చేసి గొంతులో దాచగలిగినవాడు ఆమాత్రం కూడా లేకుండా చెయ్యలేక కాదు, అలాంటి కష్టం వచ్చినపుడు స్వామి ఉన్నాడులే అని ఆ లీల జ్ఞప్తికివచ్చి మనం నిర్భయంగా ఉంటామని భరోసానిచ్చేందుకుట. అందుకే గరళకంఠం విజయచిహ్నమే కాదు, రక్షాచిహ్నం కూడా.

- జీవునికి, దేవునికి భేదం తెలుపుతూ – **"పిసరంతైన మహా విపత్తుగను బెంబేలెత్తు నేనెంత, ఆకసమంతైన విసంబు మ్రింగిన మహా గంభీర!"** అంటాడు కవి. మరోపద్యంలో స్వామీ విషం కేవలం నీ కంఠంలోనే ఉంది, కానీ నా దేహమంతా విషమయమే అంటారు.

  ఐశ్వర్యమ్ముల ప్రోవువైన నీ వేషం భోగవర్జితము అంటారు మరో పద్యంలో. అన్నీ ఇవ్వగలిగినవాడే అంత నిరాడంబరంగా ఉన్నపుడు అర్థించే మనకు ఎన్నెన్ని ఆడంబరాలో! భక్తితోనే కాదు, ఒకింత సిగ్గుపడీ తలదించుకుంటాం ఇలాంటి పద్యాలప్పుడు.

- సర్వజ్ఞుడైన స్వామి దర్శించేది భావాన్నే, వస్తువుని కాదు. అందుకే పూలబాణాలు వేసిన మన్మథుని దగ్ధంచేసి, విషాన్నిచ్చిన దేవతలను అనుగ్రహించావు స్వామీ అంటారు. ఈ సందర్భంలో భావవేద్య! అని సంబోధిస్తారు, కవి. మరోచోట శివుని **ఆనందాబ్ధి** అని పిలచి, **దాచుకొందు నెదలోయన్** అంటారు. కానీ, లోయలో సముద్రం ఇముడుతుందా? తెలియక కాదు, కవికి. జీవునిగా తన పరిమితి, స్వామి అప్రమేయత బాగా తెలిసి వ్రాసినవే ఇవి.

  ఎంతసేపూ నీలకంఠమేనా! అందుకు కారణమైన హాలాహలాన్నీ విస్మరించలేదు, కవి. **"సమ్యక్ప్రభా మూర్తివై ఊహాతీత విధాన శైవ గళ మందున్నావు రత్నమ్ముగా"** అంటూ ఆమె భాగ్యాన్ని ప్రశంసిస్తారు.

- **మా నిర్వాకములే సమస్తమనుచున్ మత్తిల్లు కాలాలలో**
ఏ నీరో మరి వాయువో యనలమో యిట్టే విజృంభించి, మా
నానాధీబలమంత వ్యర్థమనుచున్నానాగతిన్ దెల్పగా
నీ నాథత్వము రూఢి జేసెదవు గానీ నీలకంఠేశ్వరా!

ఇటీవలికాలంలో పదేపదే గుర్తొచ్చిన పద్యమిది. అన్నీ మా నిర్వాకాలే అని విర్రవీగే సమయంలో ప్రకృతిశక్తులు **విజృంభించి** మా బుద్ధుల పరతంత్రాన్ని వెల్లడిజేస్తున్నాయ్. వాటిని కలిగించేది, తొలగించేది నీవే స్వామీ! అంటారు.

తరువాత పద్యంలో కోరినవెంటనే బాంధవుడవై మన భారాలను మోసే స్వామిని "ఆశుతోషుడు" అంటారు. "క్షిప్ర ప్రసాదనిరతా" అంటారు ఆదిశంకరులు అయ్యప్పను ఇలాంటి సందర్భంలోనే.

కొన్ని పద్యాలలో యోగసంబంధ వర్ణనలు, మరికొన్ని ధ్యానసంబంధ రహస్యాలతో నీలకంఠవర్ణన సాగుతుంది. మరో అద్భుతపద్యంలో నీకు సమర్పించిన ప్రతి వస్తువు సౌభద్రమై, మాకు ప్రియాన్ని కలిగిస్తుంది, నీ కంఠానగల గరళంతో సహా. అది విషమని విస్మరించి నీలమణిగా పూజిస్తున్నాం అంటారు, కవి. ఇది శివుని సామీప్యత వలన కలిగిన గౌరవం.

కవి చెప్పదలచుకున్నదేమిటి? స్వామీ! నీకు అర్పించినది ఏదైనా యశస్సుని పొందుతుంది కదా! నేనూ నీ పాదాలచెంత నిలుస్తాను, భద్రతను ప్రసాదించు అని. ఐతే ఈ ఆత్మ నివేదన అందరికీ సాధ్యమయ్యేది కాదు కదా! అందుకూ పరమాత్మ అనుగ్రహం కావాలి.

- పసి సామీ, వెర్రి దొరా, ఆప్తా ఈ సంబోధనలన్నీ ఎంత చేరువ చేస్తాయో! ఎన్నెన్ని విశేషణాలు– నిగమవర్ణ్యా, శమదాయీ, విషాంకా, స్మరారీ, శుచిరూపా, అగజేశా, వినతబంధు, చిద్ఘన, ధరాధరజా హృన్నిలయా, పరమ వ్యోమనటా, హిమాంశుధరా, దురాహా, శుభ్రానలాక్షా, ఇనద్రుక్, త్రాతా, శాంత పయోధి, చిద్వ్యోమవాసీ, మంత్ర కలితా, శుద్ధ సత్యాకృతీ, హృద్భవ, మాయాబర్హ విలాసనర్తక, రసోన్మత్తేశ, నైగమ మయూఖా, మహా నృత్యేశ, నాదోద్భట, వృష తరంగా, ప్రధాన తత్త్వ, స్మితాస్య, క్షేమాగార,

త్రితాపహారా, శుచిమద్రోచీ, సంవిద్రూప, నాదీ, సస్యకరా, ప్రసవాస్త్రాంత్రక, గిరిధన్వీ, యమాంతా, పురదాహా,...... ఇవన్నీ పద్యంలోనూ, భావంలోనూ సందర్భోచితంగా ఇమిడిపోతే, ఆ నిగమనిగమాంత వర్ణితరూపం మన హృదయంలో నిండిపోతుంది.

- మరికొన్ని పద్యాలు మాయచుట్టూ తిరుగుతాయ్. నిజానికీ, భ్రాంతికి తేడా తెలియని నేను నిన్నేమడగాలో తెలియటం లేదంటారు. అందుకే ఇది విషమని తెలిస్తే కాపాడమని అడుగుతాను గానీ **"సుధా భ్రమన్ గొలుపు మోహకార హాలాహలంబిది",** అందుకే మోహనిర్మూలనం చేసి నువ్వే అనుగ్రహించు అని ప్రార్థిస్తారు.

  భోగేచ్ఛ, పరమాయురిచ్ఛ, సుఖలాలసత్వం – ఇవీ మాయలంటారు మరో పద్యంలో. విషంతో పెద్దగా ప్రమాదంలేదు అది వెంటనే మృత్యువునిస్తుంది. మాకు ప్రమాదమల్లా అవిద్యతోనే, అది అశాశ్వతాన్ని శాశ్వతంగా చూపుతోంది అంటారు.

- సాధారణంగా ఓ గొప్ప పనిచేస్తే అతడినే మనసులో ఆరాధిస్తాం కదా! కాలవిషాన్ని మింగిన నీ లీల తెలిసిన తర్వాత కూడా నిన్ను వదిలి అన్యచింతనలు చేయడం ఎంత విడ్డూరమంటారు, కవి. **"లీలల్ చాల విన్నన్ సరే చిరమీ సామిని వీడి యన్యములలో చేరెన్ కదా మానసం"** అంటూ. ఈ ఆవేదన ఆదిశంకరులకే తప్పలేదు కదా! **"దేవ భ్రాంత్యా భవతి భవదన్యం జడజనో మహా దేవేశం త్వం మనసి చన మత్వా పశుపతే"** అంటారు శివానందలహరిలో.

- సుఖదుఃఖాలను యథాతథంగా స్వీకరించడమే తెలుసు స్వామీ మాకు. కానీ, వాటికీ నీవు అతీతుడవు సుమా! కారణం – ఈ రెంటికీ అతీతమైన ఆనందమే సత్యం, ఆ సత్యమే నీ తత్త్వం అంటూ, ఈ రెండూ "సాపేక్షానుభూతులు" అనే అద్భుతమైన మాట వాడతారు కవి. అంటే ఇది సుఖమా? దుఃఖమా అని నిర్ధారించుకోవడంలో కూడా వ్యక్తివ్యక్తికీ మార్పు, వ్యక్తిలోనే సమయాన్నీ, సందర్భాన్నీ బట్టి మార్పు.

- అన్నిటికీ కర్తవు నీవే కదూ! మరి, ఈ విషాన్ని రప్పించడం, దానినుండి రక్షించడం ఇన్ని ఆటలు ఎందుకు? అడిగేవాడు లేడనే కదూ! అని ప్రశ్నించి ఇది నీ లీలకదూ! **"కర్మమిషతో వేర్వేరు తాపంబులిందిడనేలా? ఇవి బాపి బ్రోవుమనగా హేలాకృపామూర్తి"** అంటారు. హేలాకృపామూర్తి ఎంత భావగర్భితమైన విశేషణం.

ఇదంతా కవి అంతర్వీక్షణమే; ప్రశ్నించినా, సమాధానపడినా స్వామి ప్రత్యుత్తరమివ్వడు కదా! అందుకే "గొంతులో హాలాహలం నిండడం వలననా? పలుకవు" అని సమాధాన పడతారు మరో పద్యంలో.

- కవిత్వ లక్షణాలుగా ఆలంకారికులు పేర్కొనే కాంతాసమ్మితత్వం, ధ్వని, అలంకారాలు, శిల్పము, రసం ఇవన్నీ శివునిలోనే చూడగలిగినవాడీ కవి. అందుకే స్వామినే పై అంశాలన్నిటి సమాహారమైన "పరమాద్భుత కావ్యశిల్పం" అంటారు. సారస్వతంలోనూ, ఆధ్యాత్మిక తత్త్వంలోనూ సాధకుడు మాత్రమే వ్రాయగల పద్యమిది.

- శర్వాయ, భవాయ, రుద్రాయ, ఉగ్రాయ, భీమాయ, పసుపతయే., మహాదేవ, ఈశానాయ నామాలతో క్షితి, జల, అగ్ని, వాయు, ఆకాశ, యజమాన, సోమ, సూర్య రూపాలతో అష్టమూర్తిగా దర్శిస్తూ ఎనిమిది పద్యాల నందించారు, కవి. మరో పద్యంలో స్వామిని సరస్వతీ స్వరూపంగా భావిస్తారు. "నమః సారస్వతీచమ ఇన్ద్రశ్చమే" అని చెబుతుందిగా చమకమ్.

  ఇక నవరత్నమూర్తిగా వర్ణించిన పద్యంలో – **"అర్ధ తనువున్ తారుణ్య చిజ్జ్యోతియా మలరాకూతురు పుష్య రాగ మగు"; "బిల్వమ్ములే పలు పచ్చల్"**; అనేవి అత్యుత్తమ భావనలు. నీలకంఠం శబ్దానికి ఉన్న "నెమలి" అనే అర్థంలో మూడు పద్యాలలో నూత్న భావనలు పురివిప్పాయ్.

- "ఏ మాధుర్యపు టోగిరమ్మిడినదోయీ అన్నపూర్ణమ్మ" – నీ గొంతులోని తీవ్రత శాంతించడానికి అని స్వామిని అడుగుతూ, ఈ వేదనలు తీరేందుకు ఆ భిక్షను మాకిమ్మని అమ్మకు చెప్పమంటారు. చమత్కారం కోసం అలా అన్నారు గానీ, అమ్మ వేరు, అయ్య వేరు కాదని తెలియనివారా! అందుకే

అమ్మలందరినీ ఒకే మూర్తిగా దర్శిస్తూ మరోపద్యంలో **"నీ జడ కెంపులందు లలితారూపమ్ము, ఫాలభాగంలో అగ్నివర్ణ దుర్గ, హాసమున లీలన్ శారదామూర్తి, శ్రీ కరంబౌ గళమందు కాళి, తనువున్ పాలించె గౌరీ ప్రభల్"** అని పద్యాన్ని ముగిస్తూ **చిద్రూపా! నిను జూడ తల్లి కనిపించెన్ నీలకంఠేశ్వరా** అంటారు. ఇక్కడ స్వామిని "చిద్రూప" అని సంబోధిస్తారు, మరే విశేషణమూ ఈ భావనకు ఇంత సరిగ్గా సరిపోదేమో!

- ఇక చివరిపద్యంలో కృష్ణాజిల్లా నందమూరు శ్రీ విశ్వేశ్వరస్వామికి, రెండు పద్యసుమాలతో అర్చిస్తూ అంకితమిచ్చిన ఈ కావ్యాన్ని (ఇంత చదివాకా కావ్యమనకుండా ఎలా ఉంటాం!) ముగిస్తూ – నీ కంఠంపై వ్రాయడం మొదలుపెడితేనే ఇన్ని వందల ఊహలు వస్తే ఇక నీ శరీరమంతా వర్ణించడం ప్రారంభిస్తే ఇంకెన్ని భావనలు జనిస్తాయో అంటూ, ఆ ప్రయత్నంలోనే నా జీవితాన్ని "సుకవిత్వాఖ్య తపస్సు"గా బ్రతికించు నీలకంఠేశ్వరా! అని అర్థిస్తారు. స్వామి ఆనాడే తథాస్తు అన్నాడని మనకు తెలియనిది కాదు.

గత రెండు దశాబ్దాలుగా ఎందరో పెద్దలు ఈ శతకాన్ని వ్యాఖ్యానించారు, ఇపుడీ ప్రయత్నం ఎందుకు? ఈ శతకం, కవి, కవితా వస్తువు మూడూ "ఎంత మాత్రమున ఎవ్వరు కొలిచిన అంతమాత్రమే" కనుక.

నవంబర్ 2020 'శ్రీ కళాగౌతమి'లో ప్రచురితం.

4 ముందుమాటల వెనుక

ఏ సాహితీ ప్రక్రియనైనా, రచయిత తాలూకు భావన, శబ్దశక్తి, అభివ్యక్తి నిపుణత, అధ్యయనానుభవం, సామాజిక దర్శనం, అంతర్లీన భావజాలం ... ఇలాంటి వైయక్తిక అంశాలు నిర్దేశిస్తూ ఉంటాయ్. అయితే పీఠిక రాయడం ఇంతకుమించి కొంత కష్టమైన వ్యవహారం. ఓ గ్రంథాన్ని గురించి నాలుగు మాటలు చెప్పమన్నపుడు తన నుండి విడివడి, పైన చెప్పుకున్న అంశాలన్నిటా ఆ రచయితతో పీఠికకర్త తాదాత్మ్యం పొందాలి. తిరిగి తనలోనికి చేరి, తలెత్తిన ఆలోచనలన్నీ చిక్కులు పడకుండా అల్లుకుని తనేం దర్శించాడో ప్రపంచానికి చూపాలి. ఇదంతా అలనాటి జానపద సినిమాలలో చూసిన పరకాయ ప్రవేశ విద్యలాంటిది.

సృజనకారుడు తానుగానే ఉంటూ వందల కవితలు/ కథలు రాయగల్గినా, పీఠిక కర్త మాత్రం ఒక్కొక్క వ్యాస నిర్మాణానికి ఓ స్వల్పకాలిక జీవనానుభవాన్ని పొందాలన్న మాట. ఇందులో మరో మెలికుంది. ప్రత్యేకించి కవిగానో, కథకునిగానో, గేయకర్తగానో... ఒకే చట్రంలో తన కృషిని కొనసాగించవచ్చు గానీ, ఈ ముందుమాటకారి పరిధి కేవలం ఒకటి రెండు ప్రక్రియలతో పరిమితమై ఉండదు. ఇందుకు వివిధ సాహిత్య శాఖలలో విస్తృతమైన అభినివేశం కావాలి. ఒక్కమాట, పీఠికకర్తగా మనగలగడానికి బహురూపధారణ, బహుముఖీన ప్రజ్ఞ ఆవశ్యక కౌశలాలు.

***

ముందుమాటను ఒక సాహితీప్రక్రియగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన వారిలో అగ్రగామి, అద్దేపల్లి. పీఠికారచన గురించి పైన మాట్లాడుకున్న విషయాలన్నీ ఒకవైపు, అద్దేపల్లి వారి సాహిత్యపరమైన అర్హతలను ఓవైపు జాబితాలుగా రాస్తే, జతపరచబడని అంశాలెన్నో అద్దేపల్లి వైపు మిగిలిపోతాయ్. కారణం ఆయన:

1) ప్రాచీన, ఆధునిక సంప్రదాయాల మర్మం తెలిసినవారు.

2) పద్యాన్ని, వచన కవితనూ సమర్థవంతంగా నిర్వహించినవారు.

3) తాను చేసిన గొప్ప ప్రసంగాన్ని వ్యాసంగా మలచగలిగి; రాసిన అందమైన వ్యాసాన్ని చక్కగా ప్రసంగించగలిగినవారు.

4) గేయరచయిత, గాయకుడు.

5) ఇంటి గది, రైలు పెట్టె, సభా వేదిక ఇలా నలుగురు కలిసిన ప్రతిచోటునీ వేదిక చేసి, సాహిత్యమే ధ్యాసగా జీవించినవారు.

6) అన్ని కవితా ప్రక్రియలను ఆహ్వానించి, ఆదరించినవారు; కొన్నింట అగ్రేసరునిగా నిలిచినవారు.

7) నిబద్ధ సభా నిర్వాహకులు, నిత్య సాహిత్య సంచారి.

8) నిరంతర పాఠకులు, అవిరళ అధ్యాపకులు.

9) సాహిత్యంలోను, సమాజంలోనూ క్రమానుగత పరిణామాలన్నిటినీ అధ్యయనం చేసినవారు.

10) సంస్కృత, ఆంగ్ల భాషా సాహిత్యాలను చదువుకున్నవారు, అనువాద తత్త్వం తెలిసినవారు.

11) ఏ విభజన రేఖలూ లేని సమదర్శి.

12) అన్నిటికీ మించి అన్ని తరాల వారి మధ్యా అమరిపోగల "స్థితిస్థాపక" గుణం కలవారు.

తలస్పర్శి అయిన పై ప్రతిభా విశేష సమూహమే పీఠికారచనను మహోద్యమంగా నిర్వహించేందుకు అద్దేపల్లికి అక్షర తూణీరమైంది.

***

పాఠం చెప్పే ముందు విద్యార్థికి అభ్యసనా సంసిద్ధత కలిగించడంలాంటి కర్తవ్యమేదో పీఠిక నిర్వహిస్తుంది. ఒక వేళ పాఠకుడికి ముందుమాటను చదవడంద్వారా తాను ఒక కోణంలోనే గ్రంథాన్ని అవగాహనచేసుకునే సంకుచిత మనఃస్థితిలో ఉంటాననే భయముంటే, గ్రంథం చదివిన తరువాతైనా పీఠిక చదవడం ద్వారా తాను దృష్టిపెట్టని కొన్ని సౌందర్యాల పరిచయం పొందుతాడు. మరోవిషయం – కవిత్వావగాహనకు అది రాసిన కాలంనాటి స్థితిగతుల గురించి అవగాహన అవసరం. కానీ ఆ సంగతులన్నీ కవి తన గ్రంథంలో ప్రస్తావించలేడు. కవితా సంపుటాలలో కవితానిర్మాణం జరిగిన కాలాన్ని ముద్రించినా కొన్నేళ్ళ తరువాత లేదా తదనంతర తరంలోని పాఠకునికి ఈ విషయాలన్నీ తెలిసే అవకాశం ఉండదు. ఈ ఇబ్బందిని తొలగించే బాధ్యతను పీఠికకర్త భుజాలకెత్తుకుంటాడు. ఎవరి విషయంలోనో ఎందుకు? అద్దేపల్లి వారి నిర్యాణం తరువాత ప్రచురించిన "సీతారామరాజు" వీర కథా కావ్యానికి తంగిరాల వెంకట సుబ్బారావుగారు రాసిన పీఠిక చదవకముందు, చదివిన తరువాత ఆ గ్రంథాన్ని చదివే దృష్టికోణంలో మనకు మార్పు కలుగుతుంది. అంటే వందలాది ముందుమాటలు వ్రాసిన ప్రజాకవి కావ్యానికీ ముందుమాట అవసరముంది.

కొన్ని సందర్భాలలో కేవలం కవిత్వాన్ని గురించే కాకుండా ఆ కవి తాలూకు ఇతర సాహిత్య సేవ, వివిధ సాంస్కృతిక సంస్థలలో క్రియాశీలక పాత్ర, ఇతరత్రా ప్రస్తావించదగ్గ ప్రత్యేకతలు పాఠకుడికి తెలియాల్సిన అవసరం ఏర్పడుతుంది. కవిత్వాన్ని ఆస్వాదించడానికి ఈ ఎరుక అవసరమా అంటే లేదనగలమేమో గానీ, ఇవి తెలిసాక కవి పట్ల ఏర్పడిన ఓ అభిప్రాయం కవిత్వాన్ని చదివే సమయంలో మనల్ని కొంత ప్రభావితం చేస్తుందంటే కాదనలేం. అందుకే, మొహమాటపు మాటలుగా కాకుండా గ్రంథం ద్వారా మనకు తెలియని ఎన్నెన్నో విషయాలను మన ముందుంచేవారు, అద్దేపల్లి.

అలాగే, గ్రంథంలోని ముఖ్యమైన వాక్యాలని, కవి అనుసరించిన నూతన పోకడల్ని, శైలిని, శిల్పాన్ని; ఇలా Internal mechanism గురించి చెప్పవలసిన పరిధి మేరకు చెప్పినా, మొదటి పేరాలను స్వీయ భావజాల ప్రకటనకు, తాను నమ్మిన సిద్ధాంత ప్రతిపాదనకు వేదికగా మలచుకునేవారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత లేదా

వారు ఏకీభవించే ఇతర అంశాలపై రాయబడిన కవిత్వమయితే వ్యాసం మరింత సుదీర్ఘంగా సూటిగా, ఘాటుగా తయారయ్యేది.

కవికి భవిష్యత్తు పట్ల భరోసా కలిగించడం అద్దేపల్లివారి ప్రధాన లక్ష్యం. దోషాలున్నా, బెదిరించి పరుగులెత్తించకుండా వాత్సల్యంగా సూచనచేయడం వారి శైలి. ఈ వాక్యాలు చూడండి ఎంత ప్రేమగా ఉంటాయో: **"వీరిలో పరిణత భావాలున్నాయ్, పరిణమించవలసిన భావాలూ ఉన్నాయ్".** ఇక గట్టిగా చెప్పక తప్పదన్నపుడు **"వచనత్వం ఎక్కువవుతోంది. వచనత్వం వేరు, వచన కవిత్వం వేరు. వచనం కవిత్వం కావడానికి కవిలో కొంత అభివ్యక్తి మీద ఆలోచన కావాలి".** ఇక్కడ కవికే నేరుగా చెబుతున్నా, సాధారణీకరణం చేస్తున్నట్లుగా అనిపించి కవి హర్ట్ కాకుండా ఉంటాడు. పాఠకుడు కూడా సాహిత్య వ్యాసంగం కలవాడైతే తానూ సరిదిద్దుకుంటాడు.

పీఠికలలో అలవోకగా వ్రాసిన వివరణలలో సంబంధిత ప్రక్రియకు సంబంధించిన అనేక నిర్వచనాలు దొరుకుతాయ్. ఒక వ్యాసంలోని నిర్వచనానికి, మరో వ్యాసంలో నిర్వచనానికీ పదసంయోజనంలో మార్పు తప్ప, మూలభావన నుండి ఎంత మాత్రం వైరుధ్యం కనిపించదు.

***

పీఠికల ద్వారా అద్దేపల్లి అందజేసిన విలువైన సూచనలలోని సారాంశం కొంత:

- ఒక సామాజిక వైరుధ్యాన్నిగానీ, లేక మరొక అంశాన్నిగానీ గమనించినపుడు కవి కార్యకారణ సంబంధాలు తెలుసుకోవాలి. మూల కారణాల అన్వేషణ, అవగాహన లేనప్పుడు కవిత ద్వారా కవి సమాజానికి ఇచ్చే నిర్దేశాలు అంతగా ప్రభావం చూపలేవు.
- ముందుగా కవి అత్యుత్తమ పాఠకుడు కావాలి. అన్ని భావజాలాలకు చెందిన కవిత్వాన్నీ చదవాలి. తన అభిప్రాయం చెప్పడానికి కాకుండా, కవిత్వాన్ని కవిత్వం కోసమే చదవాలి. అపుడు విస్తృతమైన అంతరంగ ప్రేరణతో కవితా నిర్మాణానికి సమాయత్తమవ్వాలి.

- కవిత్వాన్ని, జీవితంతో ముడిపడిన ప్రయాణంగానే భావించాలి. ప్రత్యేకతగానో, కీర్తి కిరీటంగానో భావించరాదు. అది నీ చైతన్యంలో అనివార్య భాగం కావాలి.
- కవి ఏ అభిప్రాయాలు కవిత్వంలో చెప్తున్నాడో, వాటిని హృదయపూర్వకంగా నమ్మి ఉండడం, వాటి వెలుగులోనే జీవితాన్ని విశ్లేషించుకోవడం, తాను, తన కవిత్వము కలిసి ప్రయాణించడమే నిబద్ధత.
- "కవి కాలాన్నీ, పరిణామ క్రమాన్నీ గమనించకుండా చేసే సాహిత్య విమర్శ ఎప్పటికీ సమగ్రం కాదు" (విమర్శ గ్రంథాలకు రాసిన ముందుమాటలలో).

***

అద్దేపల్లి వందల ముందుమాటలలో వచన కవితా సంపుటాలదే అగ్రస్థానం. అందుకే వచన కవిత శైలి గురించి వారేమన్నారో కొంత చెప్పుకుందాం:

- భావాన్ని ఏ కృత్రిమ లక్షణాలూ లేకుండా సూటిగా చెప్పడానికి వచనకవిత అవతరించి, పరిణమించింది. ఇటువంటి కవితల్లో శైలి సాధించడం గొప్ప విషయం. పద్యంలోగాని, పాటలోగానీ భావనలో విలక్షణత్వం లేకపోయినా, నియమబద్ధమైన శైలి పాఠకుణ్ణి పదాలతో లాక్కుపోవడానికి అవకాశం ఉంది. కానీ వచన కవితలో ఏ నియమమూ లేకపోవడం వలన, ఇక్కడ భావనకి తగిన శైలిని సృష్టించి లీనం చేసుకోవడం కష్టసాధ్యం.
- ప్రతి పదమూ సార్థకంగా వుండి, ఒక పదం బదులు మరో పదాన్ని ప్రయోగిస్తే భావం యొక్క నడక అసంపూర్ణం కావడమే శైలి యొక్క ఈ లక్షణం – 'తమలోన దొరలు శబ్దములు' కూర్చడం అంటే ఇదే.

***

ప్రత్యేక తరహాకి చెందిన ఓ సంపుటిలోని కవిత్వాన్ని విశ్లేషిస్తూ – **"పదంలోంచి పదంలోకి భావధార ప్రవహించాలని గాని, వాక్యానికీ, వాక్యానికీ తర్కబద్ధమైన సంబంధం ఉండాలని గానీ, భావానికీ, భావానికీ క్రమ పరిణామం ఉండాలని గాని అతడు(కవి) భావించడు. కానీ ఒక ఆవేశం, ఉద్రేకం, ఆవేదన మొదలైన వాటి తాలుకు భావధార నిండుగా ప్రవహిస్తూనే ఉంటుంది"** అని

కవిత్వతత్త్వాన్ని ముందుగా పరిచయం చేస్తారు. ఇంతవరకూ పరిచయకర్తగానే వ్యవహరించి, తరువాత తన అభిప్రాయాన్ని సూటిగా తెలియజేస్తూ ఇలా అంటారు: **"ఒక అర్థాన్ని వివరించుకోవాలంటే పాఠకుడు తన ఆలోచనల్లోంచి ప్రయత్నించవలసిందే. ఆ ఆలోచనలు పాఠకుడికీ, పాఠకుడికీ భిన్నంగా ఉండే అవకాశం కూడా ఉంటుంది. ఈ అస్పష్టత వాంఛనీయం కాదనే నా అభిప్రాయం. వైచిత్రి, ప్రధాన వస్తువును మరుగున పెట్టడం కవిత్వ ప్రయోజనాన్ని బలహీన పరుస్తుందనుకుంటాను"**. కవితో ఏకీభవించే విషయంలో ఏ బిందువు వద్ద ఆగాలో తెలిసినవారు అద్దేపల్లి. పై వాక్యాన్ని శ్రద్ధగా చదివితే 'అనుకుంటాను' అనే పదం చాలా గొప్పప్రయోగం. చెబుతున్నది తనకంటే ఎంతో చిన్నవాడైన కవి తాలుకు కృషి అయినా ప్రకటనలా కాకుండా అనుకుంటాను అని కేవలం తన అభిప్రాయంగా ప్రతిపాదించడం ఎంతో గొప్ప విషయం కదా! మరలా కొనసాగిస్తూ, **"అర్థం, భావధారతో నిమిత్తం లేకుండా రాసే కవులకి సాధారణంగా స్వచ్ఛమైన అనుభూతి, తాత్త్వికత, జీవిత రహస్యాలు ఇలాంటివి వస్తువులుగా ఉంటై. ఎందుకంటే తమకు గల ప్రయోగాభిలాషకు ఆ వస్తువులే తగినవిగా భావిస్తారు"** అని ఆ కవిత్వం వెనుక నేపథ్యాన్ని సదరు కవి స్థానంలో ఉండి సమర్థిస్తారు.

***

ఓ పాటల సంపుటికి ముందుమాటవ్రాస్తూ, సరైన పాట రాయడం ఎంత కష్టమో, ఏ అంశాల వద్ద మనం విఫలమౌతామో తెలియజేసి, సరళమైన పద ప్రయోగం, అక్షర సంయోజనం, ఉత్తేజం కలిగించే భాష, భావన, గణబద్ధత వీటన్నిటినీ వివరించి **"ధార కోసం ఎక్కడా కష్ట పడినట్లుండరాదు"** అని ముగిస్తారు, ఏదో చెప్పకనే చెబుతూ.

***

ముందుమాటను అంతగా సాహిత్యాభినివేశం లేనివారికి సైతం రాసినప్పుడు వినిపించిన విమర్శలకు మాటల మధ్యలో చాలాసార్లే వివరణనిచ్చినా, తంగిరాల చక్రవర్తి చేసిన ఓ ఇంటర్వ్యూలో **"సాధారణంగా తన కవిత్వంలోని విధానాన్ని విశ్లేషించగల వారివల్ల, తనను తాను చూసుకునేందుకు కవులు ముందుమాట రాయించుకుంటారు. ముందుమాట రాయించుకునే కవి తాను గొప్పవాడినని**

అనుకోడు. ముందుమాట సమీక్ష కాదు, విమర్శ కాదు, అది ప్రోత్సాహం. అందుకే ముందు మాట రాయించుకున్న కవే ప్రత్యక్షంగా నాతో మాట్లాడినపుడు ఎన్నో లోపాల్ని చెప్పి అతని పురోగమనానికి కృషిచేస్తాను. కవుల్ని రూపొందించే ఉద్యమంలాంటి ప్రయత్నంలో ముందుమాట ఒక భాగం అని గ్రహిస్తే, నా వందలాది ముందుమాటల నేపథ్యం తెలుస్తుంది" అంటారు అద్దేపల్లి – చాలా ప్రశ్నలకు సరిపోయే సమాధానమిది.

***

కొన్ని సందర్భాలలో అద్దేపల్లి వ్యక్తం చేసిన అభిప్రాయాలు విశేషించి ప్రస్తావించదగినవి. అలాంటి ఓ వ్యాసభాగాన్ని యథాతథంగా చూద్దాం. **"ఏ దేశపు సిద్ధాంతపు సాహిత్యమైనా అసలైన కవితా ప్రేరణ గలవారికి ఏ మాత్రమూ నిషిద్ధం కాదు. గొప్ప ప్రేరణ కలిగిన సాహితీపరుడు కాళిదాసు నుంచి షేక్స్‌పియర్ దాక, మిల్టన్ నుండి మయకోవిస్కీ దాకా ఎవర్నైనా చదువుతాడు. కవులపైన పడే ప్రభావాల వైవిధ్యాన్ని, ఈనాటి దాక అవగాహనకుపయోగించే శాశ్వత సత్యాల్ని మన ప్రాచీన ఆలంకారికులు చెప్పారని తెలిస్తే, తెలియనివారు లేదా కావాలని వారందరినీ బహిష్కరించిన వారు ఎంత ఆశ్చర్యపడతారు?"** నిజమే, అద్దేపల్లి పై మాటలు కూడా చెప్పారంటే తెలియనివారు, తెలిసినా కావాలని విస్మరించినవారు ఎంత ఆశ్చర్యపడతారో?

ఇదంతా వారి ఐదు దశాబ్దాల సాహిత్యానుభవం తరువాత రాసినవైతే, ఎం.ఎ చదివే రోజులలో రాసిన "నాచన సోముని నవీన గుణము" అనే వ్యాసములో చేసిన ప్రతిపాదనలు చూడండి: **"అర్థ గాంభీర్యముతో బాటు శబ్ద సౌందర్యమును గూడ నారాధించుట నాచన సోముని యొక వినూత్న గుణము. ఆ శబ్ద సౌందర్యము మీది యతిశిత దృష్టి వలన నాతడు అర్థ సారస్యమును చెడగొట్టుకొన్న పట్టులును లేకపోలేదు"** విద్యార్థి దశలోనే అద్దేపల్లి వైమర్శన స్థాయి ఇది.

***

పై విషయాలన్నీ గీటురాయి (1 నుండి 4 భాగాలూ), విలోకనం పేరిట సంకలనం చేయబడ్డ అద్దేపల్లి వారి ముందుమాటలలో ఒక శాతం ముఖ్యాంశాల రూపమే . అనేక కారణాల వలన ముద్రణకు నోచుకోని గ్రంథాలలో మరెన్ని అనర్ఘ

రత్నాలు దాగున్నాయో. కవిని కుసుమంగాను, సమీక్షకుడిని ఆకుల మాటున దాగిఉన్న ఆ కుసుమం ఉనికిని బయటకుతీసి పరిమళాన్ని రసజ్ఞులకు పరిచయం చేసే సమీరం గాను వర్ణిస్తారు కదా! అలా వేల కుసుమాల సురభిళాన్ని వ్యాప్తి చేసేందుకు నిరంతర సంచారం చేసిన సాహితీ సమీరం అద్దేపల్లి.

ఫిబ్రవరి 2018 నవమల్లెతీగలో ప్రచురితం.

5 ఒక దుఃఖానికి కొంచెం ముందు

కవిత, వ్యాసం, అనువాదం, చారిత్రక అంశం... ఏదైనా సాధికారంగా వ్రాసి, ధైర్యంగా ప్రకటించి ప్రశంసలను, విమర్శలను సమానంగా స్వీకరించి; సమకాలీన తెలుగు సాహిత్య రంగంలో తనదైన ముద్రను ప్రముఖంగా ప్రకటించుకున్న బొల్లోజు బాబా మూడవ కవితా సంపుటి "మూడో కన్నీటి చుక్క".

75కవితల సంపుటానికి ఈ బయాలజీ మేస్టారు ఏకవచనాన్ని శీర్షికగా పెట్టారంటే కన్నీటి గురించి ఇప్పటివరకూ నేర్చుకోనిది ఏదో తెలుసుకోవాలనిపించింది. ఒక కన్నీటి చుక్క అనేక (దాదాపు 1500 ప్రోటీన్లతో కలిసి) అంశాల సముదాయమని; అందులో 1) Mucous layer 2) Aqueous layer 3) Oily layer అని మూడు పొరలు ఉంటాయని; కారణాన్ని బట్టి Basal tears, Reflex tears & Emotional tears గా విభజిస్తారని తెలిసింది. అన్నేసి విషయాలు పోగేసుకున్న మన పాఠ్యపుస్తకాల్లో కన్నీరుకి చోటు లేకపోయిందే అనిపించింది. ఇంత 'విషయం' ఉంది కాబట్టే, వాటి విలువ తెలిసిన బాబాకు కవితావస్తువే కాదు, కావ్యానికి శీర్షిక కూడా అయింది.

బాబా కవితలను చదివేప్పుడు గతంలో ఓ కవితలో ఆయనే అన్నట్టు మెదడుతో తూకం వేస్తూ హృదయంతో మూల్యాంకనం చేసుకోవాలి. దాదాపు కవితలన్నీ స్వయంగా తాను అనుభవించిన సన్నివేశాలు లేదా ఆ సన్నివేశంలో/ పాత్రలో తాను ప్రవేశించినపుడు కలిగిన అనుభూతులను కవితలుగా మలచినవే; ఎవరి అభిప్రాయాలనో ఆధారం చేసుకుని అల్లినవి కావు. పూర్తి ఎరుకతో, నమ్మికతో వ్రాసిన కవితలు. ఓ చోట **"భయ్యా, నేనన్నీ గమనిస్తూనే ఉన్నాను"** అని ఒప్పుకున్నారు కూడా.

బాబా కవిత్వ నిర్మాణ రహస్యమంతా నాకు 'వేడుక' కవితలో కనిపిస్తుంది. పసివాడు లోకాన్ని చూసి పొందే బాధ చూడలేక **"ఓ దేవత వాడి నేత్రాలపై బీజాక్షరాలను లిఖించి కన్నీటి బిందువులను కవిత్వంగా మార్చే వరమిచ్చింది"**. అప్పటినుండీ ఇలా లోకం మరిన్ని దృశ్యాలను అతని కళ్ళల్లోకి వంపి కవిత్వాన్ని పిండుకుంటోంది. అంటే పైన చెప్పుకున్న విభజనలో Emotional Tears అన్నమాట.

ఇమేజరీ, పెర్సోనిఫికేషన్,అల్యూజన్,ఎక్కువగా అల్లిగోరి (అన్యాపదేశంగా మరేదో చెప్పడం), అడపాదడపా అస్పష్టత... వెతికే కొద్దీ కావలసినన్ని. "కవిత్వ భాష"లో వీటన్నిటికీ ప్రసిద్ధ కవుల కవితా పంక్తులను ఉదాహరణలిచ్చి వివరించిన బాబా, ప్రతి అధ్యాయానికీ కావలసినన్ని ఉదాహరణలను ఈ సంపుటిగా మన ముందుంచారు. Side headings పెట్టి రాస్తే వ్యాసం కాస్తా వ్యాస రూప ప్రశ్నకు జవాబుగా మారుతుంది అందుకే, అక్కడక్కడా... ఒక్కొక్కటి.

మొదటి కవిత శీర్షిక **"ఒక దుఃఖానికి కొంచెం ముందు"** కవిత వ్రాసినది ఎప్పుడో అయినా సాహిత్యలోకం ఈ కవితను నిజంగానే ఓ పెను ప్రాపంచిక దుఃఖానికి (COVID-19) ముందు చదివింది.

ఒక స్థితిని వర్ణించడానికి పరిసరాలను కాక పరికరాలను ఎలా వాడుకోవాలో కవికి తెలుసు అందుకే, **"కళాయి పోయిన అద్దంలో చూసుకుంటూ నుదిటిపై సూర్య బింబమంత కుంకుమ దిద్దుకుంటోంది"** అంటారు. 'కళాయిపోయిన అద్దం' కవి చెప్పకుండా దాచిన చాలా సంగతులు చెప్పేస్తుంది. నేరుగా చెప్పేసి ఇదే కవిత్వం అనడంరాని కవి, బాబా. ఆత్మహత్యకు ఎంచుకున్న పద్ధతి ఏదైనా తరువాత దశ

మట్టిగా మారడమే. కానీ చెట్టుకు ఉరి పోసుకుని చనిపోయిన రైతు గురించి ఆ మాట సూటిగా చెప్పలేదు – **“అప్పటికింకా అతను చెట్టుకొమ్మకు పిడికెడు మట్టై వేలాడలేదు”** అంటారు.

- **“నాన్నతనాన్ని బజార్లో ఎక్కడున్నా ఇట్టే గుర్తు పట్టేయవచ్చు సైజులు సరిపోకపోతే మారుస్తారు కదూ అంటో బట్టల షాపులో”** – సాధారణ సన్నివేశమే కానీ కవితగా చదివినపుడు ఎంత ఆర్ధ్రమైపోయిందో హృదయం. కవిత చివరలో, ఇంత చేసినా కేవలం వాడి ఫోన్లో ఒక కాంటాక్ట్‌గానే మిగిలి పోతాం అని కాస్త బాధపెట్టి; తరువాత కవితలో, ఫోన్ చెయ్యడం మానుకున్న (ఓ) బబ్లూ గాడిని గురించి వాళ్ళ నాన్నకు గుర్తుచేస్తారు. ఈ రెండు కవితలూ వ్రాసేటపుడు, పుస్తకంలో వేసేటపుడూ ఈ Connectivity ని కవి ఆలోచించలేదు. తండ్రిగానూ అంతే. ఎవరూ భవిష్యత్తులో బాగా చూసుకుంటారా? లేదా? అనే విషయాన్ని పెంచేటప్పుడు ఆలోచించం.
- పాపాయిని ఎత్తుకుంటే తోసేసిందిట, వాళ్ళమ్మకి ఇచ్చేస్తే సొట్ట బుగ్గలతో బోసినోటితో నవ్వుతోందిట –

  “ఒక్కసారి అనిపించింది
  తిరస్కరించిన తరువాత
  ద్వేషించనక్కరలేదని
  చక్కగా ప్రేమించుకోవచ్చనీ!”

పొరలుగా పొరలుగా ఒలుచుకోవాలేగానీ ఇది అన్ని బంధాలకీ వర్తిస్తుంది, కదూ! జీవితంలో అధిక భాగం మనం మనని తిరస్కరించిన వారిని ద్వేషిస్తూ గడిపేస్తాం. కానీ, ఈ సూత్రం గురించి బాగా తెలిసిన వారు బాబా. అందుకే ఫేస్‌బుక్‌లో రాజపూజ్య, అవమానాలకు (రెండోవి సంఖ్యలో తక్కువే అయినా పట్టించుకోకుండా ఉండలేనివి) అతీతంగా అందరినీ ప్రేమిస్తూ సాగిపోతున్నారు. **పట్టుబడిన ఎలుకలను ఊరవతల విడిచినట్లు నిన్ను బాధించిన వ్యక్తులను మర్చిపో** అంటారు మరో కవితలో. కొంచెం తీవ్రంగా చెప్పినట్టు అనిపించినా కాదనలేని సత్యం **“యుద్ధానంతరం భూమికి మనం ఓ ఆరడుగుల బాధ్యత”** అని గుర్తు చేస్తారు.

- అమ్మాయి తన పాతగౌనులను పంచి వచ్చిందిట, మర్నాడు ఆమె ఎప్పుడో నాటిన గులాబీ మొక్కకు ఓ పువ్వు పూసిందిట. అంటే **"బహుశా ఎక్కడో ఎవరో ఓ పాప తనకు సరిగ్గా సరిపోయిన గౌనును చూసుకుని మురిసిపోయినప్పటి ఆనందం కావచ్చు, ఆ గులాబీ".** చిన్నపుడు Law of Conservation of Energy చెప్పారు మా ఫిజిక్స్ మాస్టారు, బహుశా ఇదీ అలాంటిదేనేమో. లేదా ఈ కవి నమ్మే బటర్‌ఫ్లై థియరీ కావచ్చు.

- అన్నీ పునరావృతం అవుతాయనే సిద్ధాంతాన్ని బాబా నమ్ముతారు. తన ప్రతిబింబాన్ని చూసుకోవడానికి నాన్న ఇక్కడిక్కడే తిరుగుతున్నాడంటే ఎవరూ నమ్మటం లేదని **"కానీ రేపెపుడో నేనూ అలా కనిపించినపుడు నమ్ముతారు బహుశా!"** అని ముగిస్తారు.

  ఆవేశాన్ని అక్షరాలుగా మార్చి సమాజంలోకి పంపి, మార్పు సాధ్యమవుతుందని నమ్మడం మనలో చాలామంది చేసే పని. ఇందులోనూ వాళ్ళ నాన్నగారిని గుర్తు చేసుకుంటూ:

  "సమాజం పట్ల ఆవేశం కలిగినపుడు
  హిందూ పత్రికకు ఓ ఉత్తరం వ్రాసి పారేసి
  ప్రపంచం మారిపోతుంది అని కలలు కనేవాడు
  ఇప్పుడు నేనూ అంతే, ఇంకేం చేయాలో తెలియక" అంటారు.

ఈ సందర్భంలో సోమసుందర్ మాటలు గుర్తొస్తున్నాయ్ సమాజాన్ని కేవలం రచనల ద్వారానే సముద్ధరించగలమన్నది దురాశ. అయితే మనలాగే ఆలోచించే కొద్దిమంది ఆలోచనలకి, ఆశలకీ దీప్తి కలిగిస్తే చాలు. సామాజిక సమస్యలని సామాజికులే పరిష్కరించుకోవాలి. సామాజికులలో కవి భాగస్వామి. ఈ పనిని రెండు తరాలూ కొనసాగిస్తున్నాయ్. కవి కాస్త వ్యంగ్యంగా **"మేమిద్దరం రకరకాల పాలకుల్ని మార్చాం కూడా"** అని చెబుతాడు గానీ గతంలో ఆయనే అన్నట్టు **"అన్ని నిర్ణయాలూ ముందే అయిపోయాయి, ఏదో కాలక్షేపానికి జీవించాలి అంతే".**

- మంచి సందేశం, జీవన తాత్త్వికత చాల కవితల్లో పలకరిస్తాయి.

"గతాన్నొక గాలిపటంచేసి ఎగరేసి దాని దారం తెంపెయ్యి" దారం చేతిలో ఉన్నంతసేపూ నువ్వు గాలిపటాన్ని మోస్తున్నట్లే, బరువుండదుగానీ, దానిని పట్టి ఉంచడం ఎంత బాధ్యతో? అన్ని సందర్భాలలో తెంచుకుపోవడం సులభం కాదు కదూ!

కవిత్వానికి ఔచిత్యం ప్రధానం. ఈ విషయం తెలిసిన వాడీ కవి. అంతా అయిపోయాక ఏమీ చెయ్యలేనప్పుడు కొన్ని ప్రశ్నలు అనవసరం. అందుకే **"ఎలాగా అనబోయి అలాగా అన్నాను"** అంటారు. బతికుండగా ఎపుడూ గుర్తురానివారు మరణించాక అందరికీ తెగ గుర్తొస్తారు. వారితో బాటు పోయినవారితో సంబంధం ఉన్నవారంతా. అందుకే కవి **"ఒక చావు వంద చావుల్ని బతికిస్తుంది"** అంటాడు. **"జీవించడం అంటే ప్రేమించిన ఒక్కొక్కరినీ కోల్పోవటం కాదూ!"** అనిముగిస్తాడు. అలా అని జీవితం అంటే అంతే అనుకుంటామేమోనని మరో కవితలో **"చివరి క్షణం వరకూ చెయ్యాల్సిన పనుల్ని చేస్తూండటాన్ని కాలంకూడా తప్పించుకోలేదు"** అని చికెన్ షాప్ లో కోడిపుంజు మెడసారించి కూయడాన్ని గుర్తుచేస్తారు.

"జీవిత పర్యంతమూ
పరిమళించీ పరిమళించీ
పూదోటగా విస్తరించటానికే
నువ్వు ఇక్కడకు వచ్చావు" అని దిశా నిర్దేశం చేస్తారు. ఒత్తిడి తట్టుకోలేక విడిచి పెట్టేస్తానంటావేమో **"పాదం బరువుకు ఒరిగిన పచ్చిక మెల్లమెల్లగా ఎలా నిటారుగా తలెత్తుకొంటోందో చూడు"** అని ధైర్యం చెప్తారు.

***

విహారానికి వెళ్ళినపుడు ఎవరి కాలక్షేపాలువారివి. దృశ్యం ఒక్కటే అయినా, దృష్టికోణాలు వేరు. కోరంగి (తూర్పుగోదావరి జిల్లాలో మడ అడవులు) వెళ్ళినపుడు కొందరు చెక్కల వంతెన, తడి బురద నేలపై జంతువుల పాదముద్రలు, రకరకాల పక్షులు, చెట్లు చూస్తారు. మరికొందరు, పురాతన లైట్ హౌస్, వలయాకారపు మెట్లు ఎక్కి ఫోటోలు తీసుకుంటారు. ఏ ఒకడో మాత్రమే "దూరంగా కనిపించే సువిశాల సముద్రాన్నీ, నగర హర్మ్యాలని, సుదూరంగా కనిపించే ఫాక్టరీ గొట్టాల్నీ, శిథిలమై

పోయిన ఒకనాటి కోరంగి మహానగరాన్నీ తదేకంగాచూసి మౌనభారంతో మెట్లు దిగుతాడు" అలా అందరికీ పట్టనవి చూసి మౌనభారంతో మెట్లు దిగేవాడు కవికాక మరెవరు?

రాత్రి చేసిన ఫోన్ కాల్ కి స్పందించలేదేమని బాస్ అడిగినపుడు **"24/7 సిగ్నల్స్ రిసీవ్ చేసుకోవడానికి నేను సెల్ టవర్నికాను, మనిషిని అందామనుకుని సారీ బాస్"** అన్నానంటారు. వాకాటి పాండురంగారావుగారు ఓసారి కథ గురించి చెబుతూ తాను కాదలచుకున్నదానికీ అయిన దానికీ మధ్య అఖాతాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో రచయిత సన్నివేశాలు కల్పిస్తాడు – అంటారు. పై వాక్యాలు ఆ మాటలు గుర్తుచేశాయి. అన్నట్టు బాబాగారి కవితలో కథానాత్మక శైలి గురించి విమర్శకులెందరో చాలా వ్యాసాల్లో చెప్పేశారుగా. మనం మరో విషయానికి వెళ్దాం.

ప్రవేశ నిర్గమాల మధ్య మనం చేసిన ప్రయాణమే జీవితం. మరి మన జీవితాలను ఎలా గడిపేస్తున్నామో చెప్పడానికి ఎక్కువ పదాలు వాడరు, కవి – **"ఎంతో స్వచ్ఛంగా బోసి నవ్వులతో ఇక్కడికి వస్తాం. మురికి మురికిగా మరి ఏడుస్తూ నిష్క్రమిస్తాం"** అంటారంతే.

చాలా కవితల్లో కవి ఎన్నో ప్రశ్నలను సంధిస్తారు. అంటే అవి ప్రశ్నాపత్రంలా వాక్యం చివర ? తో ఉండవు. అంతర్గతంగా తమలో ప్రశ్నలను దాచుకుంటాయి. వాటికీ సమాధానాలు మనకే విడిచి పెడతారు, తాను చెప్పలేక కాదు, మనకేది తడుతుందో అని. ఈ సందర్భంలో ఎందుకో "ఎర్ర సీత" నవలలో గొల్లపూడి మారుతీరావు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. "ఆ సమాధానం వెనుక ఒక జీవితం ఉంది. ఓ ఛాలెంజ్ ఉంది. ఓ తెగింపు ఉంది. ఓ పరిష్కారం ఉంది. అంతకు మించి ఓ ముగింపు ఉంది. అయినా, సమాధానం చాలా క్లుప్తమయిందే" ఈ మాటలు బాబా ప్రశ్నలకు (ఆ మాటకొస్తే కవులందరి ప్రశ్నలకు) సరిగ్గా సరిపోతాయ్.

"వలస పక్షుల గానం" కవిత కొంత ఆశ్చర్యపరిచింది. కన్నీటికి మూలం సాధారణంగా దుఃఖమే కదా! దుఃఖ నివృత్తి శ్లోకాలు (కాతత్ర పరివేదనా – ఎందుకు ఏడుస్తున్నావ్) పేరిట చిన్నపుడు కొన్ని శ్లోకాలు చెప్పారు. "ఇదం కాష్టం ఇదం కాష్టం నద్యామ్ వహతి సంగమాం సంయోగాశ్చ వియోగాశ్చ కాతత్ర పరివేదన".

ఇవి బాబాగారికి పరిచయం లేకపోవచ్చు. కానీ వాటి సారాన్ని ఆధునిక కవిత్వ పరిభాషలో అద్భుతంగా చెప్పారు.

ఇక ఫ్రాగ్మెంట్లను సంపుటిలో చేర్చడం బాబా స్టైల్. ఇవి అదనం కాదు, అంతర్భాగం. కావాలని కుదించాలనో, పని గట్టుకుని పెంచాలనో కవి ప్రయత్నించినపుడు కలం కాగితంపై ఎంత మేర పరుగు దీసి ఆగిపోతుందో, కవి అక్కడే ఆపి ప్రచురించారు తప్ప అవి వచనకవితలే. అలాగే, **"జీవించటమే..."** అనేది పారాగ్రాఫుల రూపంలో ఒకటిన్నర పేజీ సాగినది కవితేనా? అనే సందేహం వస్తే సమాధానం తన కవిత్వ భాషలో చెప్పారు బాబా. "కవిత్వ ఫార్మేట్లో వ్రాసిందంతా కవిత్వంకానట్లే వచనం రూపంలో వ్రాసిందంతా వచనమూ కాదు, ఈ రెండిటి మధ్యా సరిహద్దు రేఖ గీయటం అంత సులభం కాదు. ఉత్త సమాచారం కాక మరింకేదో అందించేదాన్ని కవిత్వంగా గుర్తించాలి" అని. ఇదిగో అలా 'మరింకేదో'' అందించడం వలన అది కవితయింది. ఇది కొత్త కూడా కాదు. అద్దేపల్లి 'ఇవ్వాళకి రేపు లేదు', 'దిగంతాల దాకా ఎక్కుపెట్టిన బాణం' వంటివి ఈ తరహా కవితలే.

వచన కవితలో పాదవిభజనకు చెందిన లినియేషన్ గురించి బాబా చెప్పిన విషయాలు ఈ విషయంలో సందేహనివృత్తి చేసినా 'ప్రవచించే వాక్యం' లాంటి కవితలు కొన్నిటిలో (సుదీర్ఘ మైన పాదాలు ఉండవు కానీ) వచనత్వం పాలు ఎక్కువయింది.

బాబా ఎపుడూ నాకో మాట చెబుతారు "విమర్శలో బాంబులు కురిపించాలి గురూ! అపుడు హోరాహోరీ చర్చ జరుగుతుంది" అని. అయితే, "కవిత్వ భాష" తెలుసుకుని, నేర్చుకుని, అధ్యయనం చేసి పుస్తకంగా వ్రాసిన వాడీ కవి. అందుకే నేనేమి చెప్పగలను? ఒక్క వైరి సమాసాల గురించి తప్ప. అవి వచన కవిత్వంలో ఉండకూడదననుగానీ, అన్ని ఉండకపోతే బావుంటుంది అని నమ్ముతాను.

"బొరియలోకి దూరింది కుర్రపీత – భూమిని మరోసారి ప్రేమించటానికి" అనే బాబా వాక్యంతో మన కబుర్లను ఇక్కడితో ఆపి, కవిత్వాన్ని ప్రేమించడానికి మరోసారి ఈ పుస్తకంలోకి దూరదాం.

సాహితీ స్రవంతి కార్యక్రమంలో తేది: 13 మార్చి, 2021న ప్రసంగం.

6 ఆత్రేయ గురించి పైడిపాల

"ఆచార్య ఆత్రేయ" గా ప్రసిద్ధి పొందిన సినీ రచయిత "కిళాంబి వేంకట నరసింహాచార్యులు" వ్రాసిన నూట పదహారు పాటలపై డా. పైడిపాల వ్యాఖ్యానాత్మక విశ్లేషణా గ్రంథం "పాడుతా తీయగా" (ఆత్రేయ నూట పదార్లు). ఐతే, కేవలం నూట పదహారు పాటలను, వాటిపై వ్యాఖ్యానాన్నీ ముద్రించి పుస్తకం వేసెయ్యడం కాదు. వాటిని పదహారు భాగాలుగా విభజించి ఒక్కో విభాగానికీ ఒక్కో చక్కని శీర్షికనిచ్చి ముందుగా ఉపోద్ఘాతము, పాటలు, చివరలో ఒక కొసమెరుపు ఇలా ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ ఆత్రేయ ఆత్మకథలో వ్రాసుకున్నవి, సన్నిహితులకు మాత్రమే తెలిసినవి, నాటి పత్రికలు ప్రచురించినవీ, సినీ రంగంలో రచయిత స్నేహితులు పంచుకున్నవి – వీటన్నిటినీ పాటలవెనుక కథలుగా చెబుతూ మంచి పఠనీయత సాధించారు రచయిత.

కేవలం సినీసాహిత్యాన్ని గురించే కాక, ఆత్రేయ రచనా ప్రస్థానమూ తెలుస్తుంది ఈ పుస్తకంలో. ఆ తరంలో అందరిలా ముందుగా పద్య కవిత్వం, తరువాత నాటక సాహిత్యం, అటుపై సినీ రచన. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళిన విషయం, స్వాతంత్ర్యం వచ్చాక "సుప్రభాతం", "అరణ్య రోదన" పద్యకావ్యాలు వ్రాసి పాలకుల చర్యలను నిరసించి, ప్రజల అసహాయతకు, ఆర్తికి, ఆవేదనలను ప్రతిఫలించే రచనలు చేసిన విషయం.. ఇవన్నీ కేవలం ఆత్రేయ సినీ రచయిత అనుకునే వారికి తెలియవు. ఈటెల్లాంటి మాటలతో నాటికలను వ్రాసి వ్యవస్థను మేల్కొల్పిన ఆత్రేయ 1955 మధ్యంతర ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రచారంకోసం నాటక ప్రదర్శనలిచ్చారు. సినీ గీతాల్లో సైతం అవకాశం ఉన్నంత మేరా అభ్యుదయాన్ని, అంతర్గత వేదనను అక్షరీకరించారు.

నేరుగా పాట గురించి మాత్రమే చెబితే ఇది పాటల పుస్తకమే అవుతుంది తప్ప విశ్లేషణ గ్రంథం అంటామా? సినిమా చూసిన వారికి కథ, పాట వచ్చినవాడికి సాహిత్యం, బాణీ వేరెవరో చెప్పక్కర లేదు కదా! అందుకే ఓ సీనియర్ రచయితగా తాను చేయవలసినది సమర్థవంతంగా చేసి చూపారు పైడిపాల. ఈ తరహాలో వేరెవరైనా కొనసాగించాలంటే అందుకు ఆదర్శవంతమైన దారి వేసి చూపారు.

చక్కని ఎత్తుగడ, ఆకరాల ఆధారంగా అనేక విశేషాలు, పాట, సినిమా చెప్పని కబుర్లు... ఇలా సాగుతాయి అధ్యాయాలన్నీ. ప్రతి అధ్యాయంలో చర్చించిన పాటలన్నిటికీ ఓ అంతస్సూత్రం ఉంటుంది. దాని ఆధారంగా ఎన్నిక చేసిన పాటల అల్లిక ఉంటుంది.

మొదట ఓ అధ్యాయాన్ని నిశితంగా చూస్తే నమూనా అర్థమవుతుంది. మొదటి అధ్యాయం శీర్షిక : **"ఉన్నట్టే ఉన్నాడనే ఊగిసలాటలో".**

ఆత్రేయ జీవితమంతా దైవం ఉన్నాడా? లేడా? అనే ఊగిసలాటలోనే ఉండిపోయారంటారు, రచయిత. 'అమ్మ' చిన్నతనంలోనే మరణించడం వలన దైవంపట్ల నమ్మకం సన్నగిల్లిందని, రాయవెల్లూరులోని 'ఊరీస్' కాలేజీలో చదువుతుండగా 'ఢంకా' అనే పత్రికలో అచ్చయిన మొట్టమొదటి రచన 'దేవుళ్ళదంతా అన్యాయమే'ను నిదర్శనంగా చూపుతారు. వివేకానంద, ఠాగూర్, టాల్‌స్టాయ్,

వామపక్ష భావజాలం ఇవన్నీ వీరిపై ప్రభావం చూపాయి. 'పరివర్తన' నాటకంతో ప్రజానాట్య మండలితో పొత్తుపెట్టుకోవడం, స్వాతంత్ర్యానంతరం కమ్యూనిష్టు పార్టీ ప్రచారం కోసం నాటకాలు ప్రదర్శించడం ఆత్రేయకు ఆ భావజాలం పట్ల గల మొగ్గును తెలియజేసినా, చివరి వరకు నిత్యం "లక్ష్మీ నృసింహ కరావలంబ స్తోత్రాన్ని" పఠిస్తూ పూజ చేసేవారని తెలియజేస్తారు. ఇలా ఆత్రేయ జీవితాంతం ద్వైదీభావంలో వున్నారని, వారు వ్రాసిన భక్తిభావ ప్రధానాలైన చిత్రగీతాల ఆధారంగా రుజువుచేస్తారు, పైడిపాల.

ఈ సందర్భంలో "శేషశైలావాసా శ్రీవెంకటేశా... శయనించు మా అయ్య శ్రీచిద్విలాసా...!" వంటి పాటలను ప్రస్తావిస్తారు.

కేవలం రచన గురించే కాక, నేపథ్యగానం, పాత్ర ధారులు, పాటకు దారి తీసిన సన్నివేశం, నిర్మాణ సంస్థ, సంవత్సరం, తెరవెనుక కథలు ఇవన్నీ చెబుతారు. ఈ పాట 'రీతి గౌళి' రాగమని సంగీత విషయాలనూ కొన్నిసార్లు ప్రస్తావిస్తారు. ఈ సందర్భంగా వారు చేసిన చక్కని ఈ చర్చ చూడండి – పోతన 'కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ' అన్నప్పుడు భక్తి భావన తప్ప మరో దృష్టి యెలా కలగదో, ఆత్రేయ అంత సున్నితం గానూ–

ముద్దు సతులిద్దరిని యిరువైపుల చేర్చి
మురిపించి లాలించి ముచ్చటల దేల్చి
పట్టుపానుపుపైన పవ్వళించర స్వామి...

అన్నప్పుడు కూడా మధురభక్తి మాత్రమే స్ఫురిస్తుంది. ఆ మాటకొస్తే ఈ పాటలోని పదలాలిత్యం గమనిస్తే – అన్నమయ్య కీర్తనేమో అనిపిస్తుంది, అంటారు.

అలాగే, 'బ్రతుకే ఒక పండుగ' (1975) చిత్రంలో అంధురాలైన కథానాయిక పాత్ర కృష్ణుని ప్రార్థించే సన్నివేశంలో

"గొంతు గుండెకు దగ్గరున్నది – కళ్లుమాత్రం దూరమైనవి
చూడలేనివి పాడగలను – పాటలో నిను చూడగలను
నీ మేనివన్నె తెలియకున్న – లోని వెన్నను తెలుసుకున్నా" అన్నపుడు ఆత్రేయ పాత్రపరమైన అన్వయం ఎలా సాధించారో గుర్తుచేస్తారు.

సాయిబాబా చరిత్ర గురించి అవగాహన, మహిమపై నమ్మకం లేకపోయినా అందుకు సంబంధించిన పుస్తకాలను చదివి తోటపల్లి మధు, గురుచరణ్ అందించిన సమాచారం ఆధారంగా ఆత్రేయ ఆ పాటలను రాశారని, రాస్తూన్నపుడు ఆత్మీయులతో 'ఈ పాటలు నేను రాస్తున్నానంటే నాకే నమ్మకం చాలడం లేదు. అజ్ఞానినైన నాచేత ఆ బాబాయే ఈ గీతాలు రాయించు కుంటున్నాడేమో' అనేవారని "శ్రీ షిర్డిసాయిబాబా మహాత్మ్యం" పాటల సంగతులు చెబుతూ మనతో పంచుకుంటారు, పైడిపాల. 'భక్త తుకారాం' (1977) లో "ఉన్నావా! అసలున్నావా" పాటలో 'వ్యాజస్తుతి'ని వివరిస్తారు. చివరగా ఓ ముగింపునిస్తూ ఇలా అంటారు – **"ఏతావాతా – ఆత్రేయ దేవుణ్ని పూర్తిగా నమ్మనూలేదు, నమ్మకపోనూలేదు. అయితే తన నమ్మకంతో సంబంధం లేకుండా ఆయన అంకితభావంతో రచించిన దైవభక్తిగీతాలు యితర కవుల గొప్పపాటలకు తీసిపోని స్థాయిలో విజయవంతమయ్యాయి".**

ఇదీ ప్రతి అధ్యాయాన్నీ పైడిపాల నడిపించిన తీరు. పదహారు అధ్యాయాలను మనం ఇంతగా సమీక్షించుకుంటే అది మరో చిన్ని పుస్తకం అవుతుంది. కాబట్టి మిగిలిన అధ్యాయాలలో మేలైన విషయాలను (కొన్నింటిని) చెప్పుకుందాం:

- ఆత్రేయ వ్రాసిన అమ్మ పాటలలో "మాతృ వియోగం" స్పష్టంగా కనిపిస్తుంది. వారి అమ్మగారు సీతమ్మకు సరైన వైద్యం జరగకపోవడం, అది ఉద్దేశపూర్వకమనే వాదన వెనుక నిజానిజాలను తెలియజేస్తారు. ఆత్రేయ ఆత్మకథలో "అమ్మ" అనే భాగం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది.

- అంత్య ప్రాసలు, ముక్తపద గ్రస్తాలు, తలిరు వెన్నెల వంటి అచ్చతెలుగు పదాల ప్రయోగం, బూచాడు వంటి పాత్రోచిత ప్రయోగాలు (బూచాడమ్మా, బూచాడు బడిపంతులు) ఇవన్నీ మన దృష్టికి తెస్తారు. జెండా పండుగల్లో నేటికీ వినిపించే "భారత మాతకు జేజేలు" వంటి పలు పాటలు జన బాహుళ్యంలో పొందిన గౌరవాన్ని గుర్తు చేస్తారు.

- చూపులు అనే అంశంతో పాటనంతా నడిపిన "అబ్బాయి గారు అమ్మాయి గారు" సినిమాలో "తొలి చూపు దూసింది హృదయాన్ని" అనే పాటను

విశ్లేషిస్తూ పల్లవిలో రూపకాన్ని, చరణంలో ఉల్లేఖనూ; అక్కాచెల్లెలు సినిమాలో "చిటపట చినుకులతో' పాటలో అపహ్నుతి, ఏకావళిని చూపుతారీ తెలుగు మాష్టారు.

- నిజజీవితంలో ప్రేమ, పెళ్ళి రెండిటా విఫలమయ్యారు ఆత్రేయ. (తొలి గాయం పేరిట స్వయంగా ప్రచురించిన విఫల ప్రేమ గాథను, ఆత్రేయ మరణానంతరం ఓ వార పత్రికలో ప్రచురితమైన విషయాలను రచయిత మనముందుంచుతారు). సినిమాలో సందర్భాన్ని బట్టి ఆడవాళ్ళ అఘాయిత్యాలను, కాఠిన్యాన్ని ఎండగట్టడమే కాదు, స్త్రీకి అన్యాయం జరిగిన సందర్భాలకు అంతగానూ మానవతా దృక్పథంతో, సానుభూతితో స్పందించారు. తన కత్తికి రెండువైపులా పదునుందని నిరూపించారు. భగ్న ప్రేమికుని పాట వ్రాయాలన్నపుడు ఆత్రేయ ఆ పురుషపాత్రలో జీవించారు. ప్రేమ లేదని, ప్రేమించరాదని (అభినందన) పాటలే ఇందుకు ఉదాహరణ. "తలుపు మూసిన తల వాకిటనే పగలు రేయీ నిలుచున్నా, పిలిచి పిలిచి బదులే రాక అలసి అలసి వెళుతున్నా" అనే పాట వారి జీవితంలోని ఆవేదన నుండి పుట్టినదే అంటారు.
- ఇష్టం, ప్రేమ వంటి పాదాలను నేరుగా వాడకుండా 'అది', 'ఇది' అనడం ఆత్రేయ ప్రత్యేకత. ఈ విషయాన్ని చక్కని ఉదాహరణలతో రూఢిచేస్తారు, రచయిత. అలాగే 'ఉంది', 'లేదు' అనే రెండు పదాలతో నడిపించిన కంచుకోటలో పాటను గుర్తుచేస్తారు
- అరవైలలో ఖోస్లా కమిటీ నివేదిక తర్వాత సెన్సార్ వారు ముద్దులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, మొదటి ముద్దు పాట ఘనత(అపకీర్తి) ఆత్రేయకే దక్కిందంటారు.
- బాల సాహిత్యంలోని పాటలు, జానపద గీతాలు ఎంత నేర్పరితనంతో ఆత్రేయ యుగళగీతాలుగా తీర్చిదిద్దారో చక్కని ఉదాహరణలతో వివరిస్తారు. సినిమా పాటనే కాక, మూలమైన జానపదగీతాన్నీ అందిస్తారు, రచయిత. ఐతే, ఇదంతా భావ దారిద్ర్యంతో కాదు, సుపరిచితమైన వాటిని జనం అధికంగా ఆమోదిస్తారు అని మంచి ముగింపునిస్తారు.

- ప్రతి రోజూ మన మామూలు మాటల్లో సామెతల్లా, లోకోక్తులలా వాడుకునే పంక్తులు వ్రాసిన ఆత్రేయను ''సినీ వేమన'' అంటారు. ఉదా. "అనుకున్నామని జరుగవు అన్ని, అనుకోలేదని ఆగవు కొన్ని" వంటి వాక్యాలు చాలా విరివిగా వినిపిస్తాయని గుర్తుచేస్తారు.
- ఒకే సినిమాలో వేర్వేరు సందర్భాలలో (ఆనందం, విషాదం) ఒకే పాటను మార్చి వ్రాసిన పాటలకు ఆద్యులు సీనియర్ సముద్రాల అయినా, ఈ బొమ్మా బొరుసు పాటలు వినగానే ఆత్రేయే గుర్తొస్తారంటారు.

అన్నీ పొగుడుతూ, అంతా బావుంది అనడం; అందరూ ఆనందించే విషయాలే చెప్పడం రచయిత ఉద్దేశ్యంకాదు. తాను అసంతృప్తికి లోనైన పాటలు (పంక్తులు), కొందరు నొచ్చుకున్నా కొన్ని సున్నిత విషయాలు, రుజువులు ఈ పుస్తకానికి నిండుదనాన్ని తెచ్చాయి.

- అనంతర గీత రచయితల ప్రయోగాల్లో, పాటల్లో ఎక్కడెక్కడ ఆత్రేయ ప్రభావం, ముద్ర ఉన్నాయో; ఏ పాటకు ఏ ప్రేరణతో వ్రాసిందో సందర్భాన్నిబట్టి తెలియజేస్తారు. పల్నాటిసింహం సినిమాలో ''ఈ కుంకుమతో ఈ గాజులతో" పాట వెనుక "బడి పంతులు"లో "నీ నగుమోము నా కనులారా" పాట అనుసరణను చూపుతారు. అలాగే, ముందు తరం కవులను ఆత్రేయ ఎలా అనుసరించారో చెబుతూ "మంచు కురిసే వేళలో" పాట (అభినందన) వెనుక కృష్ణశాస్త్రి పాటల ఆనవాళ్ళను చూపుతారు.
- నిరీక్షణ సినిమాలో "ఆకాశం ఏనాటిదో" పాట గొప్పదనాన్ని మెచ్చు కుంటూనే భావం, బాణీ పూవూ, తావిలా జతపడి పరిమళించినా ఆ నాయికపాత్రకి ఇంతటి సాహిత్యం ఎక్కువ అనిపిస్తుంది అని ప్రకటిస్తారు.
- మూగ మనసులు సినిమాలో "ముద్ద బంతి పూవులో" పాట చివర్లో 'సేసలు' (అక్షతలు) పదం ఎంత మందికి అర్థమవుతుంది? అని ప్రశ్నిస్తారు.
- కథతో ఏమాత్రం సంబంధం లేకుండా హీరో డాన్స్ కోసం చొప్పించిన పాటల సంగతులు చెబుతారు.

- అడగక ఇచ్చిన ముద్దే ముద్దు పాట గురించి చెబుతూ పాట చివరలో "నువ్వు నేను ముద్దుకు ముద్దు" అనే చివరి పంక్తి సెన్సార్ తొలగించిందని, కానీ ఐదేళ్ళ తర్వాత వచ్చిన ముద్దంటే చేదా (ఆరుద్ర రచన) మాత్రం వారికి ముద్దుగానే తోచింది అంటారు.
- కొన్ని పాటలు ఆత్రేయ వ్రాసినా తర్వాత మార్పులు అవసరం అయినపుడు ఆయన అనుమతితో, ఇతర గీత రచయితలు మార్పులు చేసిన సంగతులు చెబుతారు. ఇతరులవి అని ప్రజలు అనుకున్న కొన్ని పాటలు ఆత్రేయవే అని సాధికారికంగా నిరూపిస్తారు.
- మొదటి దశలో అనువాదగీతాల మీద పట్టు లేదని, పాటపై పేరుని బట్టి తప్ప ఆత్రేయ రాశాడంటే నమ్మమని చెబుతారు. తరువాత తరువాత అద్భుతాలు చేసారంటారు. అక్కడక్కడా కొన్ని పోలికలు ఉన్నా అనువాద చిత్రాలలోని పాటలలో చేసిన స్వతంత్ర విన్యాసాలను చెబుతూ ఓచోట "కన్నదాసన్‌ని మక్కికి మక్కి అనువదిస్తాడనే అపవాదుకు అపవాదు" అంటారు. అపవాదుకు అపవాదు అనడం బావుంది. మరోచోట (చెంగావి రంగు చీర) పాట గురించి చెబుతూ అందమంతా చీరలో ఉందో లేదో తెలియదు గానీ ఆత్రేయ నేతలో ఉంది అంటారు. ఇలాంటి వాక్యాలు ఇది కేవలం సినిమా పాటల పుస్తకం కాదు అని మరోసారి గుర్తు చేస్తాయి.
- తన ఇంటర్వ్యూలలో ఆత్రేయ తన గురించి స్వయంగా చెప్పుకున్న విషయాలను మన దృష్టికి తెస్తూ అవన్నీ బలహీనతలుగా కాక వారి ఆత్మ సంస్కారానికి నిదర్శనంగా చూపుతారు.

ఆత్రేయ చమత్కారాలు:

కొన్ని అధ్యాయాలలో కొసమెరుపులుగా ఆత్రేయ చమత్కారాలను అందిస్తారు, రచయిత. తక్కువే అయినా ఇవి పుస్తకానికి అదనపు పరిమళాన్నిచ్చాయ్.

కారులోనూ, ఆటోలోనూ ఎప్పుడూ ఎడమప్రక్కనే కూర్చునేవారుట ఆత్రేయ. ఎవరైనా ఎందుకు అని అడిగితే నేను "లెఫ్టిస్ట్ ని" అనేవారుట.

వాళ్ళమ్మాయి పుట్టినరోజున ఆమె ఇంటికి వెళ్ళారుట. తండ్రివచ్చాడు అనే ఆనందంలో ఆమె ఆరోజు గుడికి వెళ్ళకుండా "నా దేవుడు నా ఇంటికి వచ్చాడు ఇంక గుడికి ఎందుకు నాన్నా!" అందిట. **ఏమ్మా నేనంత రాయిలా కనిపిస్తున్నానా?** అన్నార్ట, ఆత్రేయ.

సినిమా ఇంకా అమ్ముడు కాలేదని నిర్మాత చెబితే "నాయనా అమ్మలేని వాళ్ళు రెండు రకాలు. ఒకరు నాలా తల్లిలేనివారు, రెండు నీలా సినిమా "అమ్మలేని"వాళ్ళు. అందుకే మిమ్మల్ని "నిర్ మాత"లన్నారు, అని ఆత్రేయ ఓదార్చారుట.

***

స్వయంగా కవీ, గీత రచయితా అయిన "మల్లెమాల" వారి సినిమాలకు ఆత్రేయ చేత పాటలు రాయించడం ఆత్రేయ మాటలు, పాటలు పొందిన గౌరవం. అలాగే, "కొమ్మ కొమ్మకో సన్నాయి" పుస్తకంలో వేటూరి "పాటల చెట్టుకు ఒకటే సన్నాయి, అది ఆత్రేయ" అని వ్రాసిన ప్రశంసావాక్యాలు, సుప్రసిద్ధ రచయిత బుచ్చిబాబు 1967 నవత త్రైమాసిక పత్రికలో "కారులో షికారు కెళ్ళే " పాట పై వ్రాసిన 13 పుటల కావ్య ప్రశంస ఇవన్నీ మధ్య మధ్యలో ప్రస్తావిస్తారు. మనసుని ఊహల ఉయ్యాలగా, మాయల దయ్యంగా, నాటక రంగంగా, తెగిన గాలిపటంగా.. అస్థిరమైన వస్తుజాలంతో పోల్చడం ద్వారా ఆత్రేయను మనస్తత్వ శాస్త్రవేత్త అనవచ్చని తన అభిప్రాయాన్ని ప్రకటిస్తారు.

"స్వస్తి వాక్యంలో" చెప్పినట్టు ఎక్కడా రచనలో దురభిమానం చూపలే. నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని తెలియజేశారు. అందుబాటులోని మాధ్య మాలను అన్నీ వినియోగించుకుని, సమాచారాన్ని సేకరించి, విన్నవి, తెలిసినవి .. అన్నీ సమన్వయ పరచి సినీ/సాహిత్య అభిమానులకు చక్కని కాన్కను, ఆత్రేయకు ఘన నివాళిని అందించిన వీరి కృషి అభినందనీయం.

మొదట చెప్పాల్సిన మాటే చివర చెబుతున్నా. "ఆత్రేయ నాటకాలు– పూర్వాపరాలు" ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం; "తెలుగు సినిమా పాట చరిత్ర" పిహెచ్.డి., కోసం ఎన్నో గంటలు ఆత్రేయనుండి ప్రత్యక్షంగా ఎన్నెన్నో విషయాలను తెలుసుకున్న పైడిపాల వ్రాసిన ఈ పుస్తకంలో సమాచారం సమగ్రమైనది, సప్రమాణమైనది.

లోనారసి...

అవధానుల మణిబాబు

7 స్వావిష్కృత హృదయం 'నాన్న కుర్చీ'

నలభై నాలుగో ఏట ఓ కవితా సంపుటి; మరో పదిహేడేళ్ళకి ఓ దీర్ఘకవిత; అరవై ఆరేళ్ళకి రెండో కవితా సంపుటి – సాహిత్యానికి సమీపంగానే ఉంటూ, అన్ని సభల్లో కనిపిస్తూ, వినిపిస్తూ; ప్రత్యేక సంచికలు, సావనీర్లలలోనూ, తప్పని సరైనపుడు పత్రికల్లోనూ పలకరించే అనుభవజ్ఞుడైన ఓకవి నుండి ఇంత విరామంతో పుస్తకాలు వెలువడడం ఒకింత అరుదైన విషయం.

చెవి ఎక్కువ అదృష్టం చేసుకుంటే అది చేతిని నియంత్రిస్తుంది. ఊహ తెలిసినప్పటి నుండి నాన్న, పెదనాన్నల ప్రతి వాక్యాన్ని దోసిలితోపట్టి హృదయానికి పూసుకున్న భక్తీ, గౌరవం, అంతకు మించినదేదో సత్యనారాయణగారిని వ్రాయల్సినంతగా వ్రాయనీయకుండా చేసింది.

ఇంట్లో శుభకార్యం జరుగుతున్నపుడు మనం సంపాదించుకున్నవి అలా ఉంచి, వారసత్వంగా వచ్చిన వస్తువులు అపురూపంగా వాడుకున్నట్లు; ఏదో చెప్పాల్సిన ప్రతి సందర్భంలోనూ తాను రాసినవి దాచి, తాను దాచుకున్న పెదనాన్న వాక్యాన్నీ, నాన్న పద్యాన్నీ ఘన వారసత్వ సంపదగా వినమ్రంగా చాటుకునే వ్యక్తిత్వం మూర్తి గారిది. ఇన్నేళ్ళ విరామం తర్వాత, తనకు తానుగా ప్రాచుర్యం కలిగించుకోలేని జడత్వ గుణాన్ని కొంత అధిగమించి, స్వావిష్కృత హృదయాన్ని కవితామూర్తిగా "నాన్నకుర్చీ"పై ప్రతిష్ఠించారు, ఇలా.

మొదటి కవిత "సొంత సంతకం" లో రెండు వాక్యాలు ప్రత్యేకంగా తోచాయ్. **"నువ్వు నలిగి నలిగి ఒక కావ్యమైతే, వాడు దానికింద సంతకం చేసి కవి ఔతాడు"** నిజానికి సత్యనారాయణమూర్తి గారు గతంలో ఇలాంటి కవితే ఒకటి రాసిన గుర్తు. అందులో సారాంశం ఇది – కవిగారింట్లో దొంగపడతాడు. శాలువాలు, జ్ఞాపికలు తప్ప ఏమీ దొరకవు. చివరికి అమూల్య గ్రంథాలన్నీ చింపిపోతాడు. కవిత చివర్లో, దొంగ దొరికాడు గానీ పూర్వ కవుల కవిత్వాన్ని దొంగిలించిన కవి దొరకలేదని చిత్రంగా ముగిస్తారు, మూర్తిగారు. ముందుతరం వారివో, తమ తరం వారివో భావాలను చౌర్యం చేసే వారికి చెంపపెట్టు ఈ కవిత. మరో వాక్యం – **"అసంబద్ధ వాక్యాల కింద నీ సంతకం లేకుండా చూసుకోవాలి"** తాను రాసిన ప్రతీదీ అనితరసాధ్యమనో, అసాధారణమనో అనుకోకుండా నిరంతరం సంస్కరించుకుంటూ ఉత్తమసృజన దిగువన మాత్రమే తన సంతకం ఉండేలా చూసుకోవాలని సూచన. బహుశా, ఈ ఎరుకే వందలాది వీరి కవితలు వడపోసి, వడపోసి మనదాకా చేరకుండా ఆపిందేమో!

"నువ్వు తినే ప్రతి బియ్యపు గింజ మీద నీ పేరు కాదు, రైతు పేరు కూడా లిఖించబడి ఉంది చూడు" అని మొదలుపెట్టి; రైతంటే ఏమిటో చెప్పి, **"కాళ్ళన్నీ నెర్రెలు వారిన నేలలయ్యాయి"** అని నేలకు మారురూపుగా రైతుని నిలిపి **"వీళ్ళు ఇన్నాళ్ళు దారాలు తీస్తున్నది చంపబడ్డ ఆత్మలకి బరువైన దేహాలు వ్రేలాడదీసుకోడానికని నాకు తెలియదు"** ఇంత మాటన్నాక పెన్ను పక్కనపెట్టి చూపుడు వేలితో ఓ సారి కన్ను తుడుచుకుంటాం గానీ మనం మాత్రం ఏమంటాం?

“పొత్తిళ్ళలోంచి... భుజాల దాకా... ఎదిగిన బిడ్డను స్వయం ప్రతిపత్తి కోసం ఉద్యమిస్తున్న చిన్న రాజ్యం”తో పోల్చినపుడు; స్వాతంత్ర్యదినాన్ని **“గుండె రెండుగా చీలిన సందర్భాన్ని పండగ”** అన్నపుడు; ఉత్తరాలు గుచ్చిన ఊసను **“వసంతోత్సవాల దొంతర; ఆత్మీయుల గుండె పొరలు”** గా దర్శించినపుడు; వచనకవిత పట్ల వ్యామోహం పెరిగిపోతుంది. **“చిగురుకు రెండు వైపులా పగిలిన గింజ – రైతు తలపాగాలా”** అన్నపుడు అది కవి పట్ల వ్యామోహంగా మారిపోతుంది. ఇపుడా వ్యామోహంతో మళ్ళీ కవితలన్నీ చదివినపుడు ఇందాకటి పేజీలే మరింత ఆకర్షిస్తాయి, ప్రత్యేకమనిపిస్తాయి.

1) కొన్ని అంశాలు ఎపుడు పరిపూర్ణతను పొందుతాయో తెలుపుతూ ఓచోట **“పొత్తిళ్ళలో తల్లి ముఖం కేసి తదేకంగా చూస్తున్న శిశువును గీయి, అప్పుడది పరిపూర్ణ చిత్రమవుతుంది”** అంటారు ఎంత పరిపూర్ణమైన కవితో కదూ!

2) ఊరుమ్మడి బావుల ప్రస్తావన రాగానే, చప్టానిండా బిందెలతో, మాటల యుద్ధం చేసుకుంటున్న స్త్రీలనే మనం చూస్తాం. కానీ ఆ బావులు గృహిణుల /కన్యల భావవినిమయ వేదికలుగా, సమస్యల పరిష్కార కేంద్రాలుగా కనిపించాయ్, వీరికి.

3) **“నిన్న ఇక్కడ నేల లేదు, ఈ వేళ మొలకెత్తిన విత్తనం నేలని తెచ్చింది”** అన్నపుడు ధరిత్రిని హలం దున్నితే అప్పుడు అవుతుంది అది ఒక దేశం అన్న శేషేంద్ర కవిత చదివినప్పటి సంతృప్తి.

4) “సాలంకృత” కవితలో– మనవరాలి చెవికుట్టే వేడుకను వర్ణించి “నువ్వు సులువుగా పలకడం కోసమే, మధునాపంతుల సత్యనారాయణమూర్తి “తాత” అనే రెండక్షరాలకు కుదించుకుపోయాడు” అన్నారు కానీ, ఈ కవిత ద్వారా “కవి” అనే రెండక్షరాలకు సరిపడినంత విస్తృతమయ్యారు.

***

ఇక సంపుటికి శీర్షికగా నిలిచిన నాన్న కుర్చీ కవితలో **“తీరా ఆ కుర్చీ పూర్తిగా ఖాళీ అయ్యాక, నన్నందులో కూర్చోబెట్టడానికి తమ్ముళ్ళు సందేహపడటం లేదు, ఆ కుర్చీలో నేనెలా ఇమడగలను?”** అంటారు. నిజానికి, నాన్న గారి తర్వాత

అదే బడిలో, అదే కుర్చీలో కూర్చొని పాఠం చెప్పారు, మూర్తిగారు. ఇంట్లో నాన్న కుర్చీలో కూర్చొని సాహితీ సేద్యాన్ని, వైద్యాన్నీ కొనసాగిస్తున్నారు. కానీ "నేనెలా ఇమడగలను" అని సందేహమేమిటి? కృష్ణశాస్త్రి గారి "యుగయుగంబుల కలల్ పాడనా?" అనే వాక్యాన్ని విశ్లేషిస్తూ సోమసుందర్ "గురువు గారెప్పుడో పాడేశారు, కానీ అలా అడగడం కవిత్వ పరమైన నమ్రత" అన్నారు. అలాంటిదే మూర్తిగారి సందేహం కూడా.

***

ఓ సారెప్పుడో కవి–సామాజికస్పృహ గురించి మాట్లాడుకుంటున్నపుడు "నాకెందుకో వ్యవసాయ సంబంధ విషయాల్లో తప్ప పెద్ద పెద్ద కష్టాలు ఎదురవ్వలేదు, అందుకే ఎపుడైనా రైతు నేపథ్యంలో రాసిన వాటిలో తప్ప మిగిలిన చోట ఆవేదన పాలు తక్కువ. నేను వ్యక్తిగతంగా అనుభవంలో లేనివి కవిత్వంగా మలచలేను" అన్నారు మూర్తిగారు. కానీ వీరి మొదటి కవితా సంపుటిలో లేడీ కానిస్టేబుల్ ని "ఉదయాన్నే ఎడారి కూడలిలో పాతిన చెట్టు సాయంత్రం ముఖం వాల్చి ముప్పై రోజులకోసారి జీతపు రాళ్ళు కాస్తుంది" అన్నారు కదా! అంటే, వైయక్తిక అనుభవం కన్నా హృదయ సునిశితత్వం కవిచేత రాయిస్తుంది. ఇపుడిదంతా ఎందుకంటే, ఇలాంటి కవితేదో కనపడని లోటు ఈ పుస్తకం చదివినపుడు మిగిలిపోయింది.

***

"I took off petal after petal" అనే కవితలో Juan Ramn Jimnez (అనువాదం: ముకుంద రామారావు) అంటారు:

"నువ్వేదో గులాబీ అనుకుని
ఒక్కోరేకూ తుంచి
నీ ఆత్మని చూద్దామనుకున్నాను.
నాకది కనబడలేదు. అయినా, చుట్టూతా
సుదూర ప్రాంతాలు, సముద్రాలు
అనంతమనుకున్నవన్నీ
సుగంధంతో నిండిపోయి
జీవంతో తొణికిసలాడు తున్నాయి"

సరిగ్గా ఇలాగే! ఈ పుస్తకంలోని ఒక్కొక్క కవితనూ విశ్లేషిస్తూ చదువుకుంటే మూర్తిగారి ఆత్మ దొరుకుతుందని నేనేమీ హామీ ఇవ్వను గానీ, పుస్తకం పూర్తయ్యాక మన చుట్టూ ఉన్న ప్రపంచం మనతో సహా ఒకింత పరిమళభరితమవుతుందని చెప్పగలను.

చివరిగా ఒక మాట, ప్రవృత్తి రీత్యా సత్యనారాయణమూర్తిగారు ఆయుర్వేద వైద్యులే కావచ్చు. కానీ వారి కవిత మాత్రం ఎటువంటి అనుపానం లేకుండా నేరుగా చప్పరించదగ్గ తియ్యని హోమియోపతీ మాత్రే.

ఏప్రియల్-2018 "విశాఖ సంస్కృతి" లో ప్రచురితం.

8 ఎమ్మెస్ మాటల్లో ఓ మహనీయుని దర్శనం

"హరికథా భిక్షువు" పేరిట శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి జీవన విశేషాలను ఎమ్మెస్ సూర్యనారాయణ వ్రాసిన పుస్తకాన్ని చదివిన తరువాత ఓ చిత్రమైన సందేహం కలిగింది. కారణం ఈ పుస్తకాన్ని బీరువాలో ఏ అరలో దాచాలి? స్వీయ చరిత్రలు/ జీవిత చరిత్రలలోనా, తత్త్వ సంబంధమైన పుస్తకాలలోనా? సాహిత్యంలోనా? వ్యక్తిత్వ వికాస విభాగంలోనా? ఎందుకో ఎటూ తోచలేదు. ఐతే, నువ్వు మాట్లాడాలి అని మిత్రులు సూచించినపుడు మరో సారి చదివితే Scientific attitude (శాస్త్రీయ దృక్పథం) అనే పదం గుర్తొచ్చింది. ఎందుకు అంటే ఒకింత వివరణ అవసరం. ఓ ప్రతిపాదన చేసేటపుడు, ఓ ముగింపుకి వచ్చేటప్పుడు శాస్త్రం ఓ విధానాన్ని అనుసరిస్తుంది. ఉదాహరణకు ఆపిల్ కింద పడగానే న్యూటన్ భూమికి ఆకర్షణ శక్తి ఉంది అనే సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యలేదు.

ఎన్నో కాయలు, పళ్ళు, వస్తువులు వీటన్నిటినీ పడుతుండగా పరిశీలించాడు, పడేసి చూసాడు. అపుడు పైకి విసిరినది కింద పడుతుంది అని ప్రాథమికంగా అనుకుని; అది ఆ వస్తువు లక్షణం కాదు, భూమి లక్షణం అని నమ్మి భూమికి ఆకర్షణ శక్తి ఉంది అని సూత్రీకరించాడు. అంటే కొన్ని వస్తువుల ద్వారా సార్వజనీన సూత్రాన్ని ప్రతిపాదించడం, మరలా ఆ సూత్రం ఆధారంగా వస్తువుల లక్షణాలను అంచనా వేయడం శాస్త్రకారుల పని. ఇదిగో ఇలాంటి పనే మన ఎం.ఎస్. చేశారు. మరి పరిశీలించిన వస్తువులు ఏమిటి?

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు గారి జీవితాన్ని చదివారు.

చిన్ననాడు తాను ప్రత్యక్షంగా దర్శించిన శ్రీ బుగ్గా పాపయ్య శాస్త్రి గారి దినచర్యను

గుండవరపు లక్ష్మీనారాయణ గారి "నారాయణ దర్శనము".

శ్రీ తూమాటి దొణప్ప గారి "హరికథ ప్రయోగాంగ వివరణ".

శ్రీమతి డి.శారద "హరికథా ప్రక్రియ సామాజిక ప్రయోజనములు" గ్రంథంలో ఆమె వ్రాసిన అనుభవాలు... వాటన్నిటి ఆధారంగా ఒక ఆదర్శప్రాయుడైన హరి కథకుని జీవితం ఎలా ఉండిఉంటుందో ఒక చిత్రాన్ని గీసుకున్నాడు.

"లాయర్" పత్రికలో సమాచారం కొంత..

సాంబమూర్తి గారి జీవిత భాగస్వామి పదిలపరుచుకున్న కొన్ని జ్ఞాపకాలు..

పిల్లలు దాచుకున్న గుర్తులు.

సమకాలికుల అభిప్రాయాలు..

సన్మాన పత్రాలవంటి కొన్ని ఆకరాలు,......వీటన్నిటితో తన చిత్రానికి రక్త మాంసాలను నింపాడు.

ఊహాత్మక జీవిత చారిత్రక విశ్లేషణ సత్యంగా పరిణమించేంత శక్తిని కలిగి ఉంది. నిజమే. Genetics ఎంతగా అభివృద్ధి చెందిందో కదా! ఒక డి.ఎన్.ఎ తో

మొత్తం శరీర ధర్మాన్ని, స్వరూపాన్నీ అంచనా వేయగలం. మరి ఇన్ని ఆధారాలున్న ఎం.ఎస్ ప్రతిపాదనలు వాస్తవాలు కాకపోవు. అయినా, చెప్పి ఊరుకోలేదు.

మరింత బలం కోసం త్యాగరాజ కీర్తనలలో పంక్తులు; రవీంద్రుని గీతాంజలి; వెంకటాచలం గారి "భాసుడు"; పోతన పద్య పాదాలు; ధనంజయుని "దశ రూపకం"లోని విషయాలు; ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి; వాడ్రేవు చిన వీరభద్రుడు; వెన్నెలకంటి – అవసరమైనంత తీసుకుని; మోతాదుకు మించి శ్రీశ్రీని రంగరించి నా వెనుక ఇంత విషయం ఉంది అని చెప్పారు. మనం నమ్మమని కాదు, ఒకటి చెప్పాలనుకున్నపుడు ఎన్ని చదవాలో మనకు తెలియజెప్పాలని.

అందుకే ఋషి చేసిన ప్రయత్నం ఇది: ఋషులు తాము దర్శించిన స్వరూపాన్ని మనకోసం చెప్పినట్లుగా : అంటే చూడండి ధ్యాయే దాజాను బాహుం; అరుణాం, కరుణా; నల్లని వాడు పద్మ నయనమ్ముల వాడు... ఇలా ఓ రూపాన్ని (మూర్తిమత్వానికి సంబంధించినది – బాహ్య స్వరూపం కాదు) తాను దర్శించి మనకోసం ఈ పుస్తకాన్ని వ్రాసారు.

కేవలం సాంబయ్య గురించే కాక హరికథ పుట్టు పూర్వోత్తరాలు, నేపథ్యం, పరిణామక్రమం ఇతర రాష్ట్రాలలో సరూప ప్రక్రియలతో గల సంబంధం, ఈ రంగంలో సాంబమూర్తిగారికి పూర్వులు, సమకాలీనులు, వారసులు, వీరి బృందంలోని ఇతర సభ్యులు... వీరందరి ప్రస్తావన... ఇన్నిటిని మనకు అందజేశారు రచయిత. అందుకే గ్రంథానికి పెట్టిన పేరు సార్థకమైంది.

అయితే, కొందరు మిత్రులు కొన్ని చోట్ల పునరుక్తి కనిపించింది అని చెప్పారు. కొన్ని కొన్ని విశేషణాల వినియోగంలో అభ్యంతరం చూపారు. శ్రీశ్రీ కవితా పాదాలను పదేపదే ప్రస్తావించారన్నారు. ఈ విషయంలో నా అవగాహనా స్థాయికి ఏమనిపించిందో చెప్పాల్సిన బాధ్యత ఉంది. ముందుగా అనుకున్నట్లు ఓ భక్తుడో సాధకుడో తాను ఉపాసించిన శక్తిని దర్శించినపుడు సంభ్రమానికి గురౌతాడు. ఆ సత్యాన్ని ఇతరులకు చెప్పాలి. ఎలా? అది నిజమని తనకు తెల్సుకానీ, ఎవరికైనా చెప్పబోతే నమ్మరేమోననే సంశయంతో ఒకింత ఎక్కువగా ఆ విషయాన్ని చెబుతాడు. అలాంటి ఒకింత ఎక్కువగా చెప్పడం ఒకింత ఎక్కువగా కనిపిస్తుంది ఈ గ్రంథంలో.

ఇది పారవశ్య స్థితిలో జరిగే పొరపాటుగానో, తన్మయ స్థితిలో తప్పిదంగానో మనం భావించాలి గానీ దోషంగా కాదు. ఐతే ఈ విషయంలో (శ్రీశ్రీ కవితా పదాలనుపదే పదే ప్రస్తావించడం)లో నాకూ కొన్ని అభ్యంతరాలున్నాయ్. రచయితకు శ్రీశ్రీ కవిత్వం జీవితంలో ఎన్నో మార్లు ప్రేరణగా నిలిచిందని, ఈ పుస్తక రచనలో కూడా ప్రతి అధ్యాయంలో చాలా సార్లు కలం ముందుకు వెళ్ళనపుడు శ్రీశ్రీ కవిత్వం కదిలించిందని చెప్పారు. పైగా జీవితకాలాన్ని పరిశీలిస్తే సాంబమూర్తిగారు శ్రీశ్రీ కంటే 4 ఏళ్ళు ముందు పుట్టి, 4 ఏళ్ల తరువాత వెళ్ళిపోయారు. కాబట్టి సమకాలీనుడైన ఓ మహాకవి ఈ గ్రంథంలో ప్రస్తావనకు రావడం అంత నేరమేమీ కాదేమో! (శ్రీశ్రీ (1910–1983); సాంబమూర్తి (1906–1987))

ఈ పుస్తకం ప్రారంభమే ఆశ్చర్యపరుస్తుంది. కథానాయకుడి మరణంతో కథ ప్రారంభం కావడం అరుదు. “గొల్లపూడి” మారుతీరావుగారి “సాయంకాలమైంది” లో సుభద్రాచార్యులు మరణంతో కథ మొదలవుతుంది. కానీ ఇటువంటి జీవిత చరిత్రల విషయంలో ఇది ఊహించలేం.

ఓ చోట హరికథకులకు ఆదిభట్లవారు పేర్కొనిన 34 లక్షణాల జాబితానిచ్చి ఎం.ఎస్. అన్నారు **“పై లక్షణాలన్నీ మన సాంబమూర్తికి ఆత్మగా ఉన్నాయి, అవన్నీ పరమాత్మ గుణగానం కోసం అంకితమయ్యాయి”.**

చివరగా, ఎం.ఎస్. ఓ చోట రాశారు – “అంకిత భావం, సారవంతమైన కళాభినివేశం, ఆర్థికాంశాలకు అతీతమైన సాధుజీవనం కలిగినపుడు మాత్రమే కళాకారుడు విముక్తి పొందుతాడు. అటువంటి విముక్తుడు సాంబమూర్తి” అని. ఒక్క మాట మాత్రం చెప్పగలను, ఇవి శ్రీ ఎమ్మెస్ సూర్యనారాయణకీ అతికినట్లు సరిపోతాయ్.

రాజోలులో జరిగిన పుస్తక పరిచయ సభలో తేది: 16.05.2018న ప్రసంగం.

9 వాళ్ళిద్దరూ ఆయన గురించి...

మన చుట్టూ ఉన్న సమూహంలో ఒక నూతన ఆవిష్కరణ జరిగినపుడు తగినంతగా స్పందించడం, గుర్తించడం, ప్రోత్సహించడం, అభినందించడం, అవసరమైతే బాసటగా నిలవడం, అది సమాజోపయోగకరమైనపుడు ఒకింత కృతజ్ఞత తెలియజేయడం – ఇవన్నీ ఇపుడు అంతరించిపోతున్న ఆవశ్యక లక్షణాలు.

ఐతే, ఇవన్నీ మరచిపోకుండా కొనసాగించే వ్యక్తులూ మనకు అపుడపుడూ ఎదురౌతారు. అలాంటివారిలో మాకినీడి సూర్యభాస్కర్ ఒకరు. సాహిత్యప్రక్రియ ఏదైనా తనవద్దకు వచ్చిన, తనకు నచ్చిన పుస్తకంపై ఓ వ్యాసాన్ని వ్రాయడం; కొన్నిటిపై పుస్తకాలనే తేవడం వీరి వ్యసనం. గనారా, రాంషా, ఆర్టిస్ట్ మోహన్, దామెర్ల రామారావు, కె.బి. కృష్ణ ..... ఇలా వీరందరి కృషిపై మాకినీడి పుస్తకాలు ప్రచురించారీమధ్య.

సూర్య భాస్కర్ కవితా సంపుటి " కలల పెదవుల నవ్వుల్లోకి" పై శ్రీహస్త "మనసున్న కవి మాకినీడి" అనే పుస్తకాన్ని వ్రాస్తే; "అనేకులు" పై కవి, చిత్రకారుడు ఆత్మకూరి రామకృష్ణ "అనేకులుగా మాకినీడి" అనే పుస్తకాన్ని తెచ్చారు. ఇలా ఒక కవి సాహిత్యంపై సమకాలీన సాహిత్యకారులు నిరపేక్షంగా పుస్తకాలు తేవడం మంచి పరిణామం. ఇక్కడ నిరపేక్షంగా అనే మాటను పూర్తి ఎరుకతోనే వాడుతున్నాను.

నిజానికి సూర్యభాస్కర్ కవిత్వం అంత సంక్లిష్టమైనది కాదు. ఐతే కవిత్వానికీ, విమర్శకీ కూడా సెకండ్ ఒపీనియన్ అవసరం. అంతవరకూ మనం చూడని మరో కోణంలోంచి మరెవరో వేలుపెట్టి చూపినపుడు కొత్తదృశ్యాలు ఆవిష్కృతమౌతాయి. ఓ కవితా సంపుటి, దానిపై విమర్శ పక్కపక్కనే ఉంచి చదవడం భలే ఉంటుంది. లెక్కల టెక్ట్స్ తో బాటు గైడ్ పక్కన పెట్టుకున్నట్టు. అలా ఆలోచిస్తే ఈ రెండు జతలు (రెండు కవితా సంపుటులు రెండు విశ్లేషణలు) పరస్పర సంపూరకాలు.

"కలల పెదవుల నవ్వుల్లోకి" కవితా సంపుటిపై శ్రీ హస్త:

ఒక పుస్తకం చదివిన వెంటనే అది మరో పుస్తక రచనకు దారి తీసింది అంటే అందులో రెండు అంశాలుంటాయి. ఒకటి సున్నితమైనది, మరొకటి బరువైనది. మొదటిది శ్రీహస్త హృదయం, బరువైనది మాకినీడి కవిత్వం . మోయలేనంత బరువున్నపుడు కొంత మరొకరి నెత్తిన పెడతాం. అలా బరువెక్కిన అనుభూతిని కొంత పదాలుగా కూర్చి, పుస్తకంగా మార్చి మనతో పంచుకుని బరువు దించుకునే ప్రయత్నమిది.

పుస్తకానికి పేరు "మనసున్న కవి మాకినీడి". నిజానికి మనసులేనివాడు కవి అవుతాడా? మరెందుకా పేరు? బహుశా ఒకే మూర్తికి సంబంధించిన రెండు పదాలను సూర్యభాస్కర్ పేరుగా పెట్టుకున్నారు(పెట్టారు) అందుకేనేమో! అనుకున్నాను.

ఐతే, శ్రీహస్త నిర్వచనం వేరు "హృదయంలో కరుణ, బుద్ధిలోని విచక్షణ సమన్వయం చేస్తే వచ్చే స్పందనే మనసు" అంటారు. అదిగో, అలాంటి మనసున్న కవి మాకినీడి అని వీరి ఉద్దేశ్యం.

సాహిత్య రంగంలో కృషి చేస్తున్న చాలా మందికి హృదయంలో కరుణకు ఎక్కడా లోటుండదు. కానీ బుద్ధిలోని విచక్షణ దగ్గరే పేచీ అంతా. జీవితానికి

సంబంధించిన సాధారణ విషయాలను వొదిలేద్దాం. కవిత్వానికి చెందిన విచక్షణ గురించి మాట్లాడితే ఎక్కడ ఏ పదాన్ని వాడాలి? వాక్యాన్ని ఎక్కడ ఆపాలి? ఏది కప్పి ఉంచాలి? ఏది విస్తరించాలి? ఏ పర్యాయ పదాన్ని ఏ సందర్భంలో ఉపయోగించాలి? నినాదం, ప్రకటన, వార్త, వ్యాసం వీటన్నిటికీ కవితా వాక్యానికి ఉన్న తేడా ఏమిటి? అనే అంశాలలో విచక్షణ కలిగినవాడే కాస్త కవిత్వం తెలిసిన వాడి చేతే కవి అనిపించుకుంటాడు.

అలాంటి కవిని మాకినీడిలోనూ శ్రీహస్త చూశారు. ఒక దశాబ్ద కాలపు కవిత్వం 115 కవితల సంకలనంగా వచ్చిన "కలల పెదవుల నవ్వుల్లోకి" లో ఆ మనసు ఎక్కడెక్కడ ఉందో తాను దీపధారిగా ఉండి మనకు చూపారు. మనకు తెలిసినా సరే, అమ్మమ్మ అన్నంపెడుతూ ఎలా కలుపుకోవాలో, ఏది నంచుకోవాలో చెప్పినట్లు వాక్యాన్ని ఎలా చూడాలో అందమంతా కవి ఏ పదంలో దాచాడో చెప్పి మురిసిపోయారు.

ఓ కవితలో మాకినీడి అన్నట్టు, పుస్తకం చదివిన వెంటనే బహుశా, శ్రీహస్త హృదయం పగిలిన బూరుక్కాయ అయింది. దూది పింజలు ఎగిరినట్లు అనేక భావాలు, అనుభూతులు ఎగిరిపోతుంటే వాటన్నిటినీ అందిపుచ్చుకుని ఒద్దికగా అక్షరబద్ధం చేశారు.

కేవలం కవిత్వాన్నే కాకుండా ఇతరత్రా సమాచారాన్ని అందించారు. మాకినీడిపై పరిశోధనలు చేస్తున్న పరిశోధకుల వివరాలు అందించారు. వీరి సహచర్య ప్రభావంతో కవులైన వారి గురించీ తెలియజేశారు. మొక్కజొన్న గింజల్లా పొత్తుతో ఉన్నట్లే దేనికవి విడివిడిగా అనిపిస్తాయి – కవిత్వం, విశ్లేషణ.

ఈ పుస్తకంలో ఎంతో నచ్చిన కవిత **"కింద ఒలికిపోయిన తెల్లని పిండిని కొంచెం కొంచెం ఎత్తుతూ పదిహేను సార్లనుకుంటా డబ్బాలో వేసి ఒబ్బిడి చేసి మూటపెట్టేసాడా అబ్బాయి"** తెల్లని పిండి – వెన్నెల, పదిహేను సార్లు కృష్ణపక్షం , మనందరికీ తెలిసిందే. "అమావాస్యను అందంగా చూపడానికి కవి తెల్లని పిండిని కొంచెం కొంచెం ఎత్తుతూ కవిత్వపు వెన్నెల కాశారు" అనడంలో శ్రీహస్త విమర్శనా హృదయం దాగుంది.

"నీడ చచ్చిపోతే" అనే కవితను వివరించి దానిని అద్దేపల్లి వారి "నువ్వు నిటారుగా ఉన్నంత సేపూ నీ నీడ వంకరగా పడ్డా భయపడకు" వాక్యాన్ని గుర్తు చేసుకోవడం ద్వారా తాను కేవలం స్పందించటం లేదు మంచి అధ్యయనం చేసి వ్రాస్తున్నాను అని చెప్పకనే చెబుతారు. అనిపించినదే వ్రాయడంవలన సహజంగా ఉంది. ముఖ్యంగా కవిని డామినేట్ చేద్దామనే ప్రయత్నం లేకపోవడం ఇందులో ఉంది.

"వస్తు వైవిధ్యం మస్తుగా ఉన్న కవిత" వంటి శీర్షికలు చమత్కారంగా అనిపిస్తాయ్. చివరలో దాదాపు అన్ని కవితల శీర్షికలతో సుదీర్ఘ సమాసంలో (18 కామాలతో) ఒకే వాక్యంగా వ్రాయడం – ఏక పాత్రాభినయంలో సంభాషణలా అనిపించింది.

జీవితంలోని అనేక దశలను కవితలుగా ఉన్న ఈ పుస్తకాన్ని మాకినీడి జీవన కావ్యంగా భావించడం, అష్టాదశ వర్ణనలూ సకృత్తుగా అమరి ఉన్నాయనడం మంచి కితాబు.

రెండవ ప్రచురణలో ఈ పుస్తకంపై "ఆత్మకూరి రామకృష్ణ"గారి స్పందనలో అన్న మాటల్లో మూడు విషయాలు మనం చెప్పుకోవాలి i) మరో తరగతి పాఠకునికి ఈ కవితా సంపుటి చేరువ అవుతుంది. ii) శ్రీహస్త ఆత్మసంతృప్తి, పరవశం కనిపిస్తాయ్. iii) శ్రీహస్త గొప్ప పాఠకుడు అనిపిస్తారు. ఇదిగో రామకృష్ణగారి ఈ మాటలతో ఆపి, మరో పుస్తకాన్ని గురించి ఆయనేమన్నారో చూద్దాం:

"అనేకులుగా" సంపుటిపై ఆత్మకూరి రామకృష్ణ:

విశ్లేషణలోకి వెళ్ళేముందు అందుకు మూలమైన కవిత్వాన్ని గురించి కొంత పరిచయం అవసరం. మాకినీడి 71వ ప్రచురిత గ్రంథమిది. ముద్రణకు సిద్ధంగా ఉన్నవి మరో ఇరవై. ఇంత అవకాశం ఈతరంలో ఎలా కుదిరింది? "అన్ని పనులూ ఆమే చూసుకుంటుంది. స్కూలు, సాహిత్యం తప్ప ఇతరత్రా బాధ్యతలేవీ పెద్దగా లేవు" అని ఆయనే చెప్పారు ఓసారి. అందుకే **"నాలోని నీకు... నన్ను తామరాకు చేసినందుకు!"** అంటూ వారి అర్ధాంగికి ఈ పుస్తకాన్ని అంకితమిస్తారు. అంటే బాధ్యతల నీటిబొట్లు అంటకుండా వీరిని తామరాకుగా ఉంచిన ఉపరితలం ఆమె.

ఈ కవితా సంపుటిలో కవితలు 53. "అనేకులుగా" అని ఓ కవితకు ఉంచిన శీర్షికే పుస్తకానికీ శీర్షికయింది. కవి మరణానంతరం ఒకడిగా కాక అనేకులుగా శాశ్వతత్వాన్ని పొందుతాడని, అతడు వ్రాసిన వాక్యాలలో ఒక్కొక్కరికీ ఒక్కో విధంగాతోస్తూ అతడు బహురూపాలలో దర్శనమిస్తాడని ఈ కవిత సారంశం. "ధర్మ తత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని యధ్యాత్మ విదులు వేదాంతమనియు" అన్న నన్నయ పద్యం; "జయన్తితే సుకృతినో" శ్లోకం –వీటిలోని భావన ఈ కవితకు అంతస్సూత్రం.

ఇక ఒకటి రెండు కవితల విషయానికి వస్తే, 'చింతేల?' కవితలో **"తప్పానని చింతేల? తప్పాలి; తప్పే తీరాలి! అపుడే కొత్త దారులు కొలుస్తావు"** అంటారు. కొత్త దారులలో నడుస్తావు అని కాకుండా కొలుస్తావు అనడం బావుంది. నిజానికి కొత్తదారి ఏర్పడాలంటే మొదట కొండల, గుట్టల మార్గాన్ని కొలవడంతోనే మొదలవుతుంది.

మరో కవితలో **"జీవితమంత మరణయాతన పడితేనేగానీ మరణం గెలవదు నీపై! ఒక్కసారి గెలిచాక, నిన్నొదిలేస్తుంది ఆపై!"** అని, కొనసాగింపుగా ఇదంతా **"దేహ పంజరపు పాంచభౌతికాలను విశ్వైక పంచభూతాలలో కలపాలని, నిర్వాణ గగనంలో నిన్ను నిలపాలని"** అంటారు. కవిత చివరిపదాన్ని "జీవితమంతా రణం" అనే అత్యంత తేలికైన మాటలతో మొదలుపెట్టి **"మరణయాతన పడుతూ మరణిస్తుంది మరణం"** అని బరువుగా ముగిస్తారు. "సుద్దుల మూటలు" కవితలో స్నేహితుల పిల్లల మాటలు, "కనబడని శిల్పం" కవితలో ప్రజాకవి అద్దేపల్లి వారిపై నే వ్రాసిన సంస్మరణ వ్యాసం ప్రేరణగా పేర్కొనడం మాకినీడి సహృదయత.

ఇపుడు రామకృష్ణగారి సుదీర్ఘ సమీక్షలోకి వద్దాం. సాధారణ పాఠకుడిగా ఈ సంపుటిని వీరు చూడలేదు. ఒక పువ్వుని చూడగానే కొందరు సౌందర్యాన్ని ఆనందిస్తారు, సుగంధాన్ని ఆఘ్రాణిస్తారు, కోమలత్వాన్ని అనుభూతి చెందుతారు, కోసి అలంకరించుకుంటారు. మరికొద్ది మంది దానిని పూజాపుష్పంగా కళ్ళకద్దుకుంటారు. ఇదిగో, ఈ రెండవ తరహావారు రామకృష్ణ. అందుకే "అనేకులుగా" కవితా సంపుటిని సాధారణ సుమంగాకాక అష్టదళ పద్మంగా భావించారు. ఒక్కో రేకునూ ప్రత్యేకంగా తూచి, పరిశీలించి వాటి భౌతిక, రసాయనిక ఇతర ధర్మాలను పొందుపరిచి మనకో సమగ్రనివేదికను అందించారు.

ఈ 53 కవితలనూ ఎనిమిది భాగాలుగా విభజించి ఆయా భాగాలలోని అభివ్యక్తులను సామాజికత, సామ్రాజ్యవాద వ్యతిరేకత, అనుభూతి, తాత్త్వికత, జీవన తాత్త్వికత, మానవత అనే ఆరు శీర్షికలతో చర్చించి; "మాకినీడి కవన మార్గం", "అనేకులుగా మాకినీడి ఉవాచ" అనే చివరి రెండు అధ్యాయాలలో మరిన్ని అంశాలను స్పృశించారు. తాత్త్వికత, జీవన తాత్త్వికత అనే పలుచని పొరతో విభజింపబడ్డ రెండు శీర్షికలను నిర్వహించడంలో రామకృష్ణగారి విచక్షణ అభినందనీయం. ఐతే కొన్ని ఉదాహరణలు వేరొక శీర్షికకి మరింత మంచి ఉదాహరణలుగా నిలుస్తాయేమో అనిపించకపోదు. కానీ కవిత చదివిన వెంటనే అది అందరికీ ఒకే ప్రతిస్పందన కలిగించాలని లేదు కదా! అంతే కాదు, కవిత వ్రాసేటపుడు ఇలాంటి శీర్షికలను దృష్టిలో పెట్టుకుని కవి వ్రాయడు. అందుకే సామ్రాజ్య వాద వ్యతిరేక కవితలో అనుభూతికి, సామాజికతకు, జీవన తాత్త్వికతకు అవకాశం లేదని చెప్పలేం. అలా అని అన్ని చోట్లా పేర్కొనలేము కదా! ఏడవ అధ్యాయంలో కొత్త కవులకు ఈ పుస్తకం ద్వారా ఏ సూచనలు లభిస్తాయి అనేది వివరిస్తూ ఓ ఎనిమిది కవితల జాబితాను అందిస్తారు.

డా. తూములూరి రాజేంద్ర ప్రసాద్ ముందుమాట, మాకినీడి కృతజ్ఞత, చివరి అట్టపై రచయిత అందించిన సంక్షిప్త సమాచారం పుస్తకానికి అవసరమే కానీ, రచయిత నామాట పేరుతో రెండు పేజీలు, కొనసాగింపుగా ప్రవేశికలాంటి మరో మూడు పేజీలు - ఇవి పాఠకుడిని అసలులోకి వెళ్ళకుండా కాస్త అడ్డుపడుతున్నట్లు అనిపిస్తాయ్ (శ్రీహస్త పుస్తకంలోనూ ఈ ఇబ్బంది ఉంది). పుస్తకమంతా ఒకే కవితా సంపుటి గురించే కాబట్టి ఒకే విషయాన్నీ పలుమార్లు ప్రస్తావిస్తే ఆసక్తి పలచబడుతుంది.

పుస్తకంలో అభిమానం స్థాయి దాటి కొన్ని చోట్ల ఆరాధన స్పష్టంగా కనబడుతుంది కవి పట్లా, కవిత్వం పట్లా. తప్పదుమరి, ఇది ఆత్మ'కూరి'వ్రాసింది.

చివరగా ఒకమాట. ఇంతటి శ్రమ, కాలం,పరిశోధన వీటన్నిటితో ఇద్దరూ వారివారి పుస్తకాలను ప్రచురించుకోకుండా సమకాలీన కవికి గొప్పకానుకను అందజేసినందుకు ఎంతైనా అభినందనీయులు.

లోనారసి...

10 నిలువెత్తు గురజాడ

ఆకాశమంత విశాలమైన, ఉన్నతమైన కృషిని ఓ అరవై పేజీల పుస్తకంలో ఇమడ్చటం సాహసమే కదూ! అందులోనూ ఇటీవలే గురజాడ 150వ జయంతిని జరిపి సాహితీ ప్రముఖుల వ్యాసాలతో అక్షరాక్షర విశ్లేషణ, పద పదార్థ విమర్శ జరిగిన తరువాత గురజాడపై ఓ పుస్తకం వ్రాయడానికి ఒకింత గుండెనిబ్బరం కావాలి మరి. ఇంతటి సాహసానికి సిద్ధపడడం వెనుక అపారమైన గ్రంథరాశి, అనుభవం, అధ్యాపనం, ఎక్కడ ఏ సాహిత్య సభ జరిగినా హాజరై సాహితీ వేత్తలతో నిత్య సమాలోచన – ఇవన్నీ డా. కాండూరి సీతారామ చంద్రమూర్తికి అండగా నిలిచాయ్.

కవిగా, భాషా శాస్త్రకారునిగా, చరిత్రకారునిగా, వ్యాకరణకర్తగా.. ఇలా బహుముఖాల గురజాడను దర్శింపజేస్తూ ఉపోద్ఘాతము సాగుతుంది. ఈ చిన్న పుస్తకంలో తాను ఏఏ అంశాలను సమగ్రంగా చర్చించదలచుకున్నారో వాటికి భూమికను ఏర్పరచుకుంటారు. సినారె "ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు"లో యుగకర్తగా గురజాడను అభివర్ణిస్తూ యాభై పేజీల వ్యాసంలో తాను చర్చించబోయే అంశాలన్నిటికీ మొదటి పేరాలోనే పరిచయం కల్పిస్తారు. ఇదే నమునాను మూర్తిగారూ కొనసాగించారు. మూర్తి గారి వ్యాసాలలోకి వెళ్ళేముందు సినారె మాటలు మనకు గురజాడవారి కృషిని పునరావలోకనం చేస్తాయనిపించింది. అందుకే వాటిని ఒకసారి గుర్తుచేసుకుందాం "గురజాడ అప్పారావు గారి జననము ఆంధ్ర సాహిత్య లోకమునకరుణోదయము. పిల్లవసుచరిత్రల పెంజీకట్లు ముసురుకొన్న రోజులలో దేశి కవితారశ్మిని ప్రసరించిన కవి భాస్కరుడాతడు. సాహిత్యము ఏ కొందరి సొత్తో యనుకున్న కాలములో అది ప్రజల సొమ్మని ఉదారముగా పంచిపెట్టిన సామ్యశీలి ఆయన. కందుకూరి సాంఘిక విప్లవమును, గిడుగు భాషావిప్లవమును తనలో సమన్వయించుకొని, సరిక్రొత్త సాహిత్య విప్లవము లేవనెత్తిన నవయుగ వైతాళికుడాయన. ఆయన చేతి చలువతో, అస్పృశ్యముగా పడియున్న వాడుకభాష అందలమెక్కినది. మెత్తని తెలుగు పలుకు కత్తివాదర వలె మెరసినది. వీథి మానిసికి వేదిక లభించినది. ఆంధ్ర భారతి అంతకు ముందటి అలంకార భారములను దుల్చివేసి ముచ్చటగా ముత్యాలసరాల నలంకరించుకున్నది. నాటకము, గేయము, వ్యాసము, కథానిక, ఆయన వాఙ్మహిమతో ఎన్నడులేని జవమును, జీవమును పుంజుకొన్నవి."

ఇపుడు మూర్తిగారి మాటలలో గురజాడను చూద్దాం.

1. మొదటి వ్యాసం "నిలువెత్తు గురజాడ"లో రచనలన్నిటా సంభాషణలలో, సంఘటనల ద్వారా, విశ్లేషణ ద్వారా అంతఃసూత్రంగా హేతువాదాన్ని పాఠకుల మెదళ్లలోనికి గురజాడ ఎక్కించాడంటారు.

పద్య రచనలో నేటికీ కృతక గ్రాంథిక భాషనే వాడడమనే చాదస్తాన్ని మనవాళ్ళు విడిచి పెట్టలేదంటారు. సామాన్య సంభాషణల్లో (దైనందిన) భాషకీ, బ్రతుక్కీ ముడితెలీని పేలవ కారణాలతో చాలా అనిష్టార్థాలను అలవాటుగా పలికేస్తున్నారని బాధ పడతారు.

సాహిత్యానికి, సమాజానికీ దూరం పెరిగి సాహిత్యం అతిశీతల గదులకు పరిమితమవుతున్న స్థితినీ, జానపద కళలు మరీ పరిమితం అవడాన్ని గుర్తుచేస్తారు. "గురజాడ ఆలోచనల అధ్యయనం చేసేవారికి మార్గం అంత సులువు కాదన్న" అవసరాల సూర్యారావు మాటలు ఇక్కడ గుర్తు చేసుకుంటారు. వివాహ వ్యవస్థ గురించి, వంట చెయ్యడం నిషేధించాలి వంటి statementsని సరిగా అర్థం చేసుకోకపోతే అవి వ్యతిరేకమైన ఆలోచనలు కలుగజేస్తాయని; అందుకే సమాజానికి గురజాడని చదవడం సరైన రీతిలో నేర్పితే యువతరం సమాజ సంస్కరణకి సిద్ధమౌతుంది అంటారు.

అనేకానేక వ్యాపకాల మధ్య గురజాడ తెలుగులో కవిత్వంపైన తక్కువ దృష్టి పెట్టారంటారు.

మద్రాస్ ప్రభుత్వ తెలుగు అనువాదకులు శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తి, శ్రీనివాస అయ్యంగార్, JA ఈట్స్, రైట్ ఆనరబుల్ శర్మ గారు, గిడుగు రామమూర్తి వీరంతా గురజాడ కృషిని ఎలా శ్లాఘించినదీ తెలియజేశారు.

2. రెండవ వ్యాసం "ఆధునిక మహిళ మానవ చరిత్రను తిరగరాస్తుంది గురజాడ ఉద్దేశ్యం ఒక పరిశీలన" సమగ్రమైనది. ఒంగోలు మునిసుబ్రహ్మణ్యంగారికి గురజాడ వ్రాసిన లేఖలోని "modern woman will rewrite History" అనే వాక్యం చుట్టూ తిరుగుతుంది, ఈ వివరణ.

శెట్టి ఈశ్వరరావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మల అనువాదాలు గురజాడ వాక్యాన్ని పూర్తిగా అందుకోలేదని rewrite అంటే writing again in a better way or differently అనే నైఘంటికార్థాన్ని అన్వయించుకోవాలని వ్యాసకర్త అభిప్రాయం. ఆధునిక మహిళ స్త్రీ దృక్కోణం నుంచి చరిత్రను వ్రాస్తుందని గురజాడ అభిప్రాయం కావొచ్చు అంటారు. తన ప్రతిపాదనను బలపరచే క్రమంలో కన్యాశుల్కంలోని వివిధ సంభాషణలు, ఇతర కథలలోని పాత్రల ద్వారా పలికించిన మాటలను ఉదాహరణలుగా చూపుతారు.

చలసాని ప్రసాద్, కాత్యాయనీ విద్మహే, టి. కృష్ణాబాయి మొదలైన సాహితీవేత్తల అభిప్రాయాలను పంచుకుంటారు.

3. పాత్రోచిత భాష మాండలిక భాష గురజాడ మార్గదర్శనం – ఈ వ్యాస నిర్మాణంలో వీరి పరిశోధన, కృషి కనిపిస్తాయ్. మాట్లాడినట్టే వ్రాయవచ్చన్న విషయాన్ని వందేళ్ళక్రితమే గురజాడ వ్రాసి చూపారంటారు.

అసిరిగాడు "దెయ్యానికెట్టింది తింతన్నావయ్యా!" అనే వాక్యాన్ని, దాని వెనుక మాండలిక నేపథ్యాన్ని చాలా సమగ్రంగా వివరిస్తారు. గిరీశం భాష సందర్భాన్నిబట్టి మారడం – అంటే మధురవాణి, వెంకటేశం, సౌజన్యారావు పంతులు, అగ్నిహోత్రావధానులు ... వేర్వేరు పాత్రలతో వేర్వేరుగా ఉండడాన్ని సోదాహరణంగా చెబుతారు.

కరకటశాస్త్రి మాటలలో తనది గుంటూరు అని చెప్పినా ఆ యాస అతని మాటలలో కనిపించడం లేదంటారు.

అగ్నిహోత్రావధానులు, వెంకమ్మ ఒకేలాంటి భాషను వాడడం ద్వారా సంస్కృత నాటక సంప్రదాయాన్ని గురజాడ తిరస్కరించారంటారు.

పాత్రోచితంగా గ్రామ్యాన్ని అంగీకరించని కాలంలో నాటకంలో మొత్తంగా మాండలిక భాషని ప్రవేశపెట్టడం గురజాడ చేసిన అద్భుత మార్గదర్శనమనీ; హాస్యానికి తోడుగా ఈ మాండలిక భాష కన్యాశుల్కాన్ని నేటికీ సజీవంగా నిలబెట్టింది అంటారు.

ఐతే, ఈ వ్యాసమంతా కేవలం కన్యాశుల్కానికే పరిమితమైంది. కొన సాగింపుగా ఇదే విషయాన్ని ఐదవ వ్యాసం **"గురజాడ క్రాంతదర్శిత – మాండలికభాషా ప్రభావం"**లో చర్చించారు. ఈ అధ్యాయంలోనూ కన్యాశుల్కం చోటు చేసుకుంటుంది. ఈ రెండిటినీ కలిపి మరింత ప్రణాళికాబద్ధంగా వ్యాసనిర్మాణం జరిగితే మరింత పఠనీయత పొందేది.

4. గురజాడ చూపు పట్టుకున్నారా – ఈ చిన్న వ్యాసంలో "అందరికీ అర్థమయ్యేలా కవిత్వం" అన్న గురజాడ సూచనలను ఆధునిక కవులు, కవిత్వం అనుసరించలేదని వాపోతారు. విస్తృతమైన చర్చకు అవకాశం ఉన్న ఇటువంటి శీర్షికను ఇంత చిన్నగా ముగిస్తే ఎలా? పైగా, ఇది పత్రిక కోసం స్థలాభావం, ఇతరత్రా నియంత్రణలు లేకుండా తనకు తానుగా అచ్చువేసుకుంటున్న పుస్తకం. కాబట్టి పాఠకులను అసంతృప్తి పరచడం తగదు.

5. గురజాడ హేతువాద వారసత్వం ఇది సమగ్రమైనది. కవిగా, కథకుడిగా, నాటకకర్తగా, గురజాడ ఎలా హేతువాదాన్ని ప్రచారం చేశారో వివరిస్తారు. కన్యాశుల్కం, మీ పేరేమిటి?, మతము-విమతము, డామను పితియను, కన్యక, డైరీలు వీటన్నిటిలో పై ప్రతిపాదనకు సరిపడే సందర్భాలను మన దృష్టికి తెస్తారు. అనంతర కాలంలో ఈ భావజాలాన్ని ఎవరెవరు కొనసాగించారో, అనుసరించారో తెలియజేస్తారు.

6. మరో వ్యాసంలో గురజాడ సమకాలికులైన **మహావీర్ ప్రసాద్ ద్వివేదీ**ని పరిచయం చేస్తూ ప్రాంతీయ భాష అభివృద్ధికి, ఢిల్లీలో ఆధునిక హిందీభాషని సాహిత్యంలో ప్రవేశపెట్టడానికి, హిందీ సాహిత్యంలో గద్యవికాసానికి, ఖడీబోలి, ఆధునిక హిందీ భాష నిర్మాణ కర్తగా వారి కృషిని వివరిస్తారు.

7. గురజాడ వారసునిగా కృష్ణశాస్త్రి చివరి వ్యాసం, చాలా ప్రాధ్యాన్యత గలది. గురజాడ, కృష్ణశాస్త్రి ఇరువురి సాహిత్యాలని తులనాత్మకంగా అధ్యయనం చేస్తూ సాగుతుందీ వ్యాసం. కృష్ణపక్షంలో శాస్త్రిగారు వ్రాసిన ముత్యాల సరాలు వెర్రిపాట, మహాకవి గురజాడ అప్పారావు, చిన్ని పూవే వాడెనా, చుక్కలు.. ఇవన్నీ గుర్తుచేస్తూ ఎదురెదురుగా ఇరువురి వాక్యాలనూ చూపుతూ సారూప్యతను, వైవిధ్యాన్నీ రెండింటినీ వివరిస్తారు. పద్యలక్షణమైన ప్రాస పాటించడం ఇరువురిలోనూ కనిపిస్తుందని; హేతువాదాన్ని అనుసరించారని; అంటరానితనాన్ని నిరసించారని; పరమత సహనాన్ని ప్రబోధించారని వివరిస్తారు.

మానవుడే మహనీయుడు అనే భ్రాంతిలో ఇద్దరూలేరని మనిషిలోని సహజ ప్రవృత్తులు ఇరువురికీ తెలుసంటారు.

***

ఐతే, వ్యాసాలన్నీ విడివిడిగా వ్రాయడంవలన కొన్ని విషయాల పునరుక్తి జరిగింది. సంపుటిగా ప్రచురించే ముందు వాటిని సరిచేస్తే పాఠకుడికి మరింత సౌకర్యంగా ఉండేది. ఈ విషయాన్నే వారితో అంటే “నిజానికి ఇవి వ్యాసాలు కాదండి, వివిధ సందర్భాలలో సమర్పించిన సెమినార్ పేపర్స్. సమయాన్ని, సందర్భాన్ని బట్టి కొన్ని సంక్షిప్తంగా, మరికొన్ని దీర్ఘంగా సాగాయ్. మరికొన్ని సార్లు కాపీలు

నాదగ్గర లేక మరల గుర్తు చేసుకుని వ్రాయడంలో చాలా విషయాలు గుర్తురాలేదు" అన్నారు. ఈ పరిమితులన్నీ మనకూ అనుభవమైనవే.

డా. వేదగిరి రాంబాబుగారి కోరికపై "గురుతు జాడలు" పేరిట మూర్తిగారు 8 ముత్యాల సరాలు వ్రాశారు. వ్యాసాలతో పాటు అవీ ఈ పుస్తకంలో మనకి లభిస్తాయ్. "అద్దంలో సూరీడు" పేరిట ఆచార్య మేడిపల్లి రవికుమార్ వ్రాసిన ముందుమాట ఈ పుస్తకం ఎత్తు మరిన్ని అడుగులు పెంచింది.

నలుగురు కూచుని ఒక తరి తలవాల్సిన పుస్తకం ఈ "నిలువెత్తు గురజాడ".

11 కథా పుష్కరిణి

చతుర్విధ పురుషార్థాలుగా చెప్పబడే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు నాలుగింటికి సంబంధించిన కథలను నాలుగు సంపుటాలుగా సంకలనం చేసి వ్రాసిన గ్రంథం కథా పుష్కరిణి. ఇది అనువాద రచన. తిరుమల తిరుపతి దేవస్థానం వారి కోరికపై శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు వ్రాసిన నాలుగు భాగాల గ్రంథంలో మొదటి భాగం (TTD Religious Publications Series) 1984లో ప్రచురితమైంది.

కథల నేపథ్యం:

హరిహరరాయలుచే విజయ నగర సామ్రాజ్యాన్ని స్థాపింపజేసిన శ్రీ మాధవ విద్యారణ్యస్వామి సోదరులు శ్రీ సాయణాచార్యులు గొప్ప పండితులు. వైదిక మార్గ స్థాపనాచార్యులు. వేదభాష్యాలే కాక అనేక శాస్త్రాలకు సంబంధించి పలు రచనలు చేశారు. యజ్ఞతంత్ర సుధానిధి, సుభాషిత సుధానిధి, ప్రాయశ్చిత్త సుధానిధి, అలంకార సుధానిధి, ఆయుర్వేద సుధానిధి, పురుషార్థ సుధానిధి, ధాతువృత్తి మొదలైనవి వారి రచనలలో ప్రముఖమైనవి. వాటిలో ఒక మహోత్కృష్ట గ్రంథం "పురుషార్థ సుధానిధి".

ఈ గ్రంథంలో పురాణాలు, ఉప పురాణాల నుంచి ధర్మ, అర్థ, కామ, మోక్షాలను గురించి ఆఖ్యానాలను స్వీకరించి కథలుగా మనముందుంచారు. ఆ కథల అనువాదమే "కథా పుష్కరిణి". సత్యనారాయణ శాస్త్రిగారు "కథా ముఖము" పేరిట సాయణుల కుటుంబ నేపథ్యము, గురువుల వివరాలు సంక్షిప్తముగా అందిస్తారు.

స్థాలీపులాక న్యాయంగా ఒక్క కథ గురించి మాత్రం చెప్పుకుందాం.

సోదర ధర్మ ప్రశంస : ఇది స్కాంద పురాణ అంతర్గతమైన సన్నివేశం.

తపోధనులైన ఇద్దరు అన్నదమ్ములు శంఖుడు, లిఖితుల కథ ఇది. అయాచిత వ్రతం (కోరకుండా లభించిన ఆకో, అలమో, పువ్వో, పండో మాత్రమే తిని జీవించడం) కొనసాగిస్తూ జీవిస్తున్న వారు ఈ ఇద్దరు. విధివశాత్తు ఓనాడు చిన్నవాడైన లిఖితునికి ఆకలేసి వ్రతభంగానికి సిద్ధపడి చెట్టెక్కి పండ్లను తినడం; నియమ ఉల్లంఘన చేసిన తమ్ముడిని అన్నగారు నిందించడం; శిక్షను అనుభవించి రమ్మని రాజైన "ధర్మధ్వజుని" వద్దకు పంపడం; కారణం తెలియక, అంతటి తపశ్శాలి తన వద్దకు వచ్చినందుకు రాజు లిఖితుని పూజింపబోవడం, ధర్మహానికి పాల్పడిన తనకు గౌరవాన్ని అందుకునే అర్హతలేదని లిఖితుడు నిరాకరించడం; తప్పుకు తగిన శిక్షగా అతడి రెండు చేతులను ఖండించాలని రాజు తీర్పునివ్వటం; శిక్షను అనుభవించి తిరిగివచ్చిన సోదరుని మహానదిలో స్నానం చేసి రమ్మని శంఖుడు సూచించడం; నదిలో మునిగిన వెంటనే అతడి బాహువులు తిరిగి రావడం ఇదీ కథ. నాటినుండి ఆ నది "బాహుదా"నదిగా పిలువబడుతున్నదిట.

ఇది సోదర ప్రేమకు గొప్ప ఉదాహరణగా నిలిచే కథ. అంతులేని వాత్సల్యమున్నా సోదరుని చిన్న దోషాన్ని సైతం విస్మరించక పోవడం; లిఖితుడు అన్నగారి మాటను గౌరవించి శిక్షకు సిద్ధంకావడం, శిక్షను నిర్ణయించడానికి తనకు ధర్మాధర్మ విచక్షణ ఉన్నా అది రాజు కర్తవ్యం కావున అతని వద్దకే పంపడం; శిక్ష అనుభవించే వరకూ గౌరవాన్ని పొందే అర్హత లేదని లిఖితుడు చెప్పడం, శంఖుడు తన తపశ్శక్తిని ధారపోసి సోదరునికి చేతులు వచ్చేలాచేయడం – కథలో మనం గమనించాల్సిన గొప్ప విషయాలు. ఎవరికి నిర్దేశింపబడిన ధర్మాన్ని వారు పరిధి దాటకుండా నిర్వర్తించడం ఈ కథలో గమనించాల్సిన సత్యం.

ఈ సందర్భంలో వాక్య నిర్మాణంలో శాస్త్రిగారి విన్యాసం చూడండి **"తమ్ముడి మీద ప్రేమతో దోషాన్ని ఉపేక్షిస్తే నేను నింద్యున్ని కావడం, వాడు దండ్యుడు కావడం తప్పదు"** అంటారు.

రచయిత సద్భ్రాత లక్షణాలను చెబుతూ

స ఏవ ఖలు సద్భ్రాతా
భ్రాతు ర్యత్పాత ముల్బణమ్
ప్రసమయ్య హితే మార్గే
స్థాప యత్యేవ తం పునః

తన సోదరుడు పాపం చేసినపుడు దానిని శమింపజేసి వాడిని హిత మార్గంలో పెట్టేవాడే సద్భ్రాత అనిపించుకుంటాడు అంటారు.

ఇలా ఎన్ని కథలో ....

కామ దూషణం కథలో "కీచకుని" ఉపాఖ్యానాన్ని; కోపదూషణం కథలో అంబరీషుడు దుర్వాసుడు; మోహ దూషణం కథలో "పరీక్షిత్తు సమీక ముని శృంగి"; మదనింద కథలో నహుషుడు ; అహంకార దూషణంలో – పృథివి కాశ్యపునితో అహంకారంతో ప్రవర్తించిన కారణంగా పాతాళానికి పోవడం ... ఈ కథలన్నీ చెబుతారు.

కన్యా దూషణ దోషం వంటి కథలలో సందర్భాన్ని అనుసరించి స్తోత్ర పాఠాలు కనిపిస్తాయ్. మరికొన్ని చోట్ల పద్యాలనూ చేర్చారు.

ఉదా.. అంబరీషుడు హరి చక్రాన్ని స్తుతించే సందర్భంలోనిదీ పద్యం.

ఏ నమస్కరింతు నింద్ర శాత్ర వధూమ
కేతువునకు ధర్మ సేతువునకు
విమల రూపమునకు విశ్వ దీపమునకు
జక్రమునకు గుప్త శక్రమునకు

చివరగా ఒకమాట, ఇవి సంస్కృతం నుండి తెలుగు చేసిన కథలు అని చెప్పినా నేటి తరానికి ఈ తెలుగు అందనంత ఎత్తులోనే ఉంది. చాలా పదాలు,

వాక్యాలు మనకు తెలుగు కథ చదువుతున్నట్లుగా అనిపించవు. లోపం మనలోనే ఉంది. ఏదో సినిమాలో హాస్య పాత్ర అంటుంది – పాలలో నీళ్ళు కలుపుతున్నాం అంటారు గానీ అచ్చంగా అలాగే తాగితే అరాయించుకునే శక్తి వీళ్ళకి ఉందా? అని. అలా భాషను సరళ తరం చేసుకుంటూ చేసుకుంటూ మూలాన్ని అర్థం చేసుకోలేని స్థితిలోకి వచ్చింది మాతరం.

నానా ద్రుమ లతాకులం; బిసు తంతువు; చ్యుత భూషణుడు; ప్రచ్యుత మదుడూ ఇలాంటి పదబంధాలు అడుగడుగునా ఎదురౌతాయి.

ఇక కొన్ని చోట్ల పేరాలకు పేరాలు ఇదే శైలిలో సాగుతాయి. వింధ్య వర్ణనలో ఒకచోట సుధా ఫల సమారంభి రంభా పరివసితమై, తాల తమాల హింతాల సాల శాలియై, సురంగ నారంగ రంగ మంటపోచ్చిత్రమై, వానీర జంబీర బీజపూర ప్రపూరితమై వింధ్య గిరి మహా మనోహరంగా ఉంది. సదా ఫల సదా పుష్పవల్లీ నిచయ శోభితంగా కనుల పండువ చేస్తోంది. లవలీ లవలీలలతో లాస్య లీలాలయాన్ని తలపింపజేస్తూ ఉంది.

పెద్దనగారి హిమాలయ వర్ణన; నంది తిమ్మనగారి మేరు పర్వత వర్ణన, పోతన గారి త్రికూట పర్వత వర్ణన వీటికి తీసిపోదు పై వర్ణన.

ఉత్తమమైన మూర్తిమత్వ లక్షణాలు ఇవీ అని చెప్పడానికి నమూనాలుగ స్వీకరించిన అనేక పాత్రలు, ఏది మంచి? ఏది చెడు అని విభజన చేసుకునే విచక్షణను కలుగ చేసే సన్నివేశాలతో ఈ కథలు మనలో మంచి తాలూకు మోతాదుని పెంచుతాయ్ అనడంలో ఏమాత్రం సందేహం లేదు. TTD వారి సంకల్పానికి సత్యనారాయణశాస్త్రి గారి పాండితి తోడై సాయణాచార్యుల పురుషార్థ సుధానిధి తెలుగు సాహిత్యంలో భాగమైంది.

(కేంద్ర సాహిత్య అకాడమీ వారు పల్లిపాలెంలో తేది:05.03.2020 న నిర్వహించిన మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి శతజయంతి సభలో ప్రసంగం)

12 తెరవాల్సిన "మూడో కన్ను"

ఓ దశాబ్దకాలం క్రితం మొదటిసారి పరిచయమైనపుడు శ్రీ చలపాక ప్రకాష్ "చూపు" కవితా సంపుటినిచ్చారు. ప్రపంచీకరణ వ్యతిరేకత, అప్పుడప్పుడే విస్తరిస్తున్న ఇంటర్నెట్, మొబైల్; అప్పటికే జీవితంలో అంతర్భాగమైన టెలివిజన్, సమాజంలో అమలులో ఉండి అధిక శాతం ప్రజలకు ఆమోద యోగ్యం, అవసరము అయినా కవికి మాత్రం హానికరమనిపించే అంశాలు, తాను బందీగా ఉన్న ఓ అదృశ్యమైన వలను ఛేదించుకునే ప్రయత్నంలో ఎదురైన అవరోధాలు, అనేకానేక సామాజిక రుగ్మతలు, యుగయుగాల సమస్యలు ... వీటన్నిటిపై వ్రాసుకున్న కవితల సముదాయమది.

మధ్యలో మరో కవితా సంపుటి " కవినై., కవితనై..." మరలా ఇపుడు "మూడో కన్ను". జీవితం ప్రోది చేసుకున్న దశాబ్దాల అనుభవాలు, రాష్ట్ర విభజన తర్వాత రాజకీయ వ్యవస్థలలో మార్పు; వ్యక్తిగత రచనా ప్రయాణంలో నానీలు, చ.ప్ర.లు, ప్రేమ కథలు, నవలలు, జోక్స్, కార్టూన్లు; పత్రికా సంపాదకత్వం, వివిధ సంస్థలలో బాధ్యతలు – తీరికలేని ఇన్ని వ్యాపకాలు, ప్రభావాలతో పరిణామం పొందిన ఆ వచన కవితా సంపుటి "మూడో కన్ను".

పై పుస్తకంలోకి వెళ్లేముందు మరో ముఖ్యమైన కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించాలి, అది ఇటీవల ముద్రితమైన "అత్యాధునిక కవితా ప్రక్రియ నానీ" అనే ప్రకాష్ పరిశోధనా గ్రంథం. సాధారణంగా అమితంగా ఆరాధించే విషయాన్నే పరిశోధనకు ఎంచుకుంటాం. మరి అంతగా నచ్చిన అంశాన్ని గురించి రాసేటపుడు దానిపై వెల్లువెత్తిన విమర్శలను రేఖామాత్రంగానే స్పృశిస్తాడు, లేదా వాటన్నిటినీ సంక్షిప్తీకరిస్తాడు. కానీ ప్రకాష్ వారి గ్రంథంలో నానీలపై సుప్రసిద్ధ కవులు, విమర్శకులు చేసిన అనేక ఘాటైన విమర్శలను యథాతథంగా తన గ్రంథంలో పొందుపరచడం ఒక సాహసం. అంతటితో ఆగిపోకుండా ఆ విమర్శలు ఎందుకు వాస్తవాలు కాదో సోదాహరణంగా చెబుతూ తాను నమ్మిన విషయాలపై మనమూ కాదనలేనంతగా నమ్మిక కలిగిస్తారు. ఇదిగో, ఇలా కన్విన్స్ చేయగల ఓర్పు, నేర్పు గల సాహిత్యకారుడు చలపాక. వేలాది నానీలను, వాటి మంచి చెడులను, ఏఏ అంశాలు విమర్శకు గురయ్యాయి? ఏవి ఎదురొడ్డి నిలిచాయి? ఏవి పాఠకుల హృదయాల్లో నానీలను నిలిపాయి?. పరి పరి విమర్శించిన తరువాత ఈ "మూడో కన్ను" కోసం తన కవితలను ఎంపిక చేసే క్రమంలో ఆ లాక్టోమీటర్ (క్షీర నీర వేర్పాటులో) వాడి ఉంటారు.

అన్నట్టు, పుస్తకం పేరు వినగానే ముందుగా శ్రీ శివారెడ్డి ఆశారాజుగారి "నేపథ్యం" కవితా సంపుటికి రాసిన ముందుమాట గుర్తొచ్చింది. "అందరం బతికేది బతుకే అయినా, అనుభవం సుసంపన్నం కావాలంటే, జీవితం సజీవం కావాలంటే, అర్థవంతం కావాలంటే, సుఖాల్నీ, దు:ఖాల్నీ, కష్టాల్నీ, నష్టాల్నీ అన్నిటినీ ఒక తూకంలో స్వీకరించాలంటే, కవిత్వం అనే మూడో కన్ను అవసరమవుతుంది" అంటారందులో శివారెడ్డి. అచ్చంగా ఇలాగే, అన్నిటినీ సమతూకంలో స్వీకరించడం, నిర్వహించడం

ప్రకాష్ కవిత్వంలో కనిపిస్తుంది.

"వాదాన్నెప్పుడూ నమ్మకు, అది ఒక వైపు నుండే సరైన దారిని చూపిస్తూ నీలోని మానవత్వమున్న మనిషిని, మనస్సునీ చంపేస్తుంది" అని నమ్మే ప్రకాష్ గిరి గీసి తన కవితను కొన్ని మార్గాలకే పరిమితం చేయలేదు. "చూపు" లో చెప్పిన ఈ మాటలకు "మూడో కన్ను"లోనూ కట్టుబడిఉన్నారు.

"బిక్కమొహం" కవిత "ఆ రోడ్డున పూలవర్షం కురిసింది" అనే వాక్యంతో మొదలవుతుంది. చదివిన వెంటనే మన మనసులో ఏవో దృశ్యాలు కదలాడుతాయి. ఇంతలోనే, మనం అప్పుడే గీసుకుని రంగులేసుకుంటున్న బొమ్మను చెరిపేస్తూ కవి అంటాడు – **"బహుశా... ఎవరో నేలతల్లిని చేరుకునేందుకు ప్రయాణం కట్టినట్టున్నారు"** అని. మామూలు మాటలతో కవిత ఇంకొంచం ముందుకు నడిచాక **"నా జ్ఞాపకశక్తి వాళ్లతోనే వెళ్ళిపోతే బావుండు"** నంటాడు. ఐతే అది అంత సులభమా? Its hard to forget someone who gave you so much to remember. వ్యక్తిలేడన్న విషయాన్ని మర్చిపోవాలనుకుంటాం కానీ, అతడి తాలూకు జ్ఞాపకాలన్నిటినీ కాదు. ఈ సంఘర్షణలో కవి అంటాడు **"జ్ఞాపకం మధుర క్షణాల్ని మోసే వరమో? మనస్సుని మెలిపెట్టే శాపమో?".** ఇపుడు కవిత గమనాన్ని పరిశీలించండి. ముగింపులో తాత్త్వికతను మొదటి పాదంలో ఊహించగలమా!

మరో కవితలో ఏ అవసరాలూ పూర్తిగా తీరని మన బతుకులను వర్ణిస్తూ **"కుళాయి మూతి, కుండ కడుపు ఆకలిని ఎంత సేపటికి తీర్చేను?"** అని వాపోతాడు.

సాధారణంగా కవులు ఏదో సందర్భంలో తన వృత్తి సంబంధిత సాంకేతిక పదజాలాన్ని, అనుభవాల్ని వారి కవితల్లో జోడిస్తారు. ఇది ఈనాటిది కాదు. "ఆముక్తమాల్యద" లో యామునాచార్యుడు తన కుమారునికి బోధించిన రాజనీతిలో కృష్ణదేవరాయల సొంత గొంతుక వినిపిస్తుంది; ఆధునిక వచన కవుల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు అధికం కావున బోధన నేపథ్యంలో ఇటీవల కాలంలో చక్కని కవితలు ఎన్నో వచ్చాయ్. వృత్తి రీత్యా స్వర్ణకారులైన శ్రీ ప్రకాష్ "గుండెలోని గాయాల్ని ద్రావకపు పొగలుతోనూ, ఒదిగిపోగల తత్వాన్ని పాదరసంతోనూ, మంచి చెడులను తడిమి చూడగల నైపుణ్యాన్ని గీటురాయితోనూ" వర్ణిస్తారు అనంతుడు కవితలో. అందంగా కుదిరిన అన్వయం ఈ కవితకు అదనపు ఆభరణం.

ఏం చెప్పామన్న దానితో పాటు ఎక్కడ నుండి చెప్పావన్నది కూడా ముఖ్యం. **"జనంలో కలిసి ఎన్ని చెప్పినా విననివాడు; వేదికపై నిల్చొని చెబితే తలాడించాల్సినదే"** అంటాడు కవి. సాధారణ పదాలతోనే ఉన్నా చాలా శక్తివంతమైన సందేశమిచ్చే వాక్యమిది. కవి ఉద్దేశ్యం ఏదైనా, వేదికపైన ఉన్నవాడు ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలో, మైకుముందున్న ఆ కాసిన్ని నిమిషాల్లో ఎంతటి ప్రభావాన్ని కలిగించవచ్చో గుర్తెరిగి మసలుకొమ్మని చెప్పినట్లుంటుంది.

మరో మూడు కవితల గురించి మాట్లాడుకుందాం: "సక్రమ దారికోసం" కవితలో "నేనెటు వెళుతున్నాను" ప్రశ్నించుకుంటాడు కవి. తరతరాలుగా కవులు ఏ ఏ దారులలో నడిచారో జాబితాగా చెబుతూ తనను మూల్యాంకన చేసుకుంటాడు. మరో కవితలో "నాకో విమర్శకుడు కావాలి" అని అడుగుతారు. అతడు (విమర్శకుడు) ఇసుకో, ఇటుకో ఇచ్చి నూతన సృష్టికి చేయూతనిచ్చేవాడు, మార్గంలో నవశక్తి జోళ్ళను కానుకగా ఇచ్చి తన పాదాలకు రక్షగా నిలిచేవాడు కావాలంటారు, కవులు ఎలాంటి విమర్శకోసం ఎదురుచూస్తారో తెలియజేస్తూ.

పెరిగిన సాంకేతిక విజ్ఞానం, సాంఘిక మాధ్యమాల వలన వేలాదిమందితో పరోక్షంగా మనం భావవినిమయం పొందుతున్నాం. ఆలోచనలు కలబోసుకొంటున్నాం. కానీ, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్నే పట్టించుకునే తీరిక లేనంతగా మన పరిధిని విస్తృతం చేసుకున్నాం. ఒప్పుకోడానికి ఒకింత మొహమాట పడతాం గానీ, ఒక దశలో మనకి మనమే దొరకనంత బిజీ ఐపోయామేమో!. ఇదంతా స్వయంకృతమే. అందుకే "విశాల పరచుకున్న కొంగ్రొత్త ప్రపంచంలో గుర్తు పట్టలేని ఆనవాళ్ళతో మనం బతుకుతున్నాం" అంటాడు కవి.

ప్రపంచంలో ప్లాస్టిక్ శాతం పెరిగిపోవడం కాదు, ప్లాస్టిక్ నిండిన ప్రపంచంలో మనం బతుకుతున్నాం. Today we use plastic - a material designed to last forever - for products designed to last minutes. ప్రత్యేక ప్రయోజనం కోసం సృష్టింపబడిన ప్లాస్టిక్ ఇపుడు సృష్టికే ప్రతిబంధకమైంది. అందుకే కవి అంటాడు "ప్లాస్టిక్ సమస్త వస్తువులను తనతో కప్పి పాతరేస్తోంది" అని.

కవులు, రచయితల "పోలవరం" సందర్శనం తర్వాత ఆ అనుభవాన్ని ఓ కవితగా

రాసారు. సాధారణంగా ఇలాంటి విహారాల తర్వాత ఒక సుదీర్ఘ వ్యాసంగా తన భావాలను మలిచే ప్రయత్నం కాకుండా ఆ సందర్భాన్ని కవిత చేయడం విశేషం.

మొత్తంగా చూస్తే, చాలా కవితలు – ఆకాశవాణిలో వినిపించినవి, పత్రికల్లో కనిపించినవి, వివిధ పోటీలలో బహుమతులు పొందినవి. మరికొన్ని ప్రత్యేక సందర్భాలకోసం రాసినవి. ఇలాంటపుడు తయారైన కవితలకు నిడివి, భాష, భావన, అంశం విషయంలో పరిధులుండడం వలన, కవి స్వేచ్ఛను కొంతవరకూ నియంత్రిస్తాయి.

మినీ సాహిత్యరూపాలకు అందాన్నిచ్చే ఒక మెరుపు/ పంచ్ కొన్ని సందర్భాలలో వచన కవితకు సరిగా అతుకుపడదు. అంతగా అవసరపడని ప్రాసలు, పదాల విరుపులు రచయిత శబ్దశక్తిని తెలియజేస్తాయి కానీ, పాఠకుడి చుట్టూఉన్న గంభీరమైన వాతావరణాన్ని కొంత విచలనం కలిగించే ప్రమాదం లేకపోలేదు.

విభిన్న సాహిత్య ప్రక్రియలలో నిరంతరాయ కృషి చేస్తున్న శ్రీ ప్రకాష్ తన మూడో కన్నుతో దర్శించిన ప్రపంచాన్ని మనసు పెట్టి మాటలుగా మార్చి మనముందుంచారు. వారు మరిన్ని విజయాలనందుకోవాలని మరింత విలువైన సాహిత్యాన్ని అందించాలని ఆశించడం చిన్న కోరికే.

విశాఖ సంస్కృతి ఫిబ్రవరి 2019లో ప్రచురితం.

13 గుండె తడి - కంటి చెమ్మ

2009 లో డా. అద్దేపల్లి రామ్మోహనరావుగారి "విలోకనం" గ్రంథంలో "అరేబియా సాగరతీరంలో కవితా సంచలనం" అనే వ్యాసంలో "నా దేశంలో సమానత్వం, అద్దంలో చందమామ తత్త్వం" అనే వాక్యం, దానిపై అద్దేపల్లి విశ్లేషణ చదివినపుడు శ్రీ సంగెవేని రవీంద్ర పేరుతో మొదటి పరిచయం. ఆ తరువాత సాహిత్య పత్రికలలో, సామాజిక మాధ్యమాలలో వీరి కవితలు కొన్ని చదివాను. ఐతే, అనేక భావాల 'కూడలి' నుండి బయలుదేరి ఆయన వేలుపెట్టి చూపిన దిశలలో కాసేపు ప్రయాణించి మరలా అదే కూడలివద్ద నిలబడి పయనాన్ని అవలోకించుకునే అవకాశం ఈ "చౌరస్తాలో సముద్రం" తో కలిగింది.

"మనిషికి ఒకే ఒక్క జన్మ ఉన్నట్టు ఒక్క ఊరే ఉంటే బాగుండు. పుట్టిన మట్టిలోనే ఇంకిపోతే బాగుండు" – "నిర్లక్ష్యపు నీడలో" కవితలోని ఈ వాక్యం మొత్తం కవితాసంపుటి అంతస్సూత్రంగా అనిపిస్తుంది. I not only lived physically away from my native land, but the values and critical judgments of those closest to me became stranger and stranger అంటాడు "Juan Goytisolo". వలసపోవడం, తనదైన నేలకు తాను ఒక అతిథి కావడం మనిషిని అందునా కవిని ఎంత ప్రభావితం చేస్తుందో...; ఆ వేదన ఎన్ని కవితలకు మాతృక అవుతుందో... అయితే, అంతగా పెనవేసుకున్న బంధాన్ని వీడి కవి ఎందుకు వలస పోయాడు? " మేఘాల్లేని ఊరు తరిమి కొడితే నాది కాని మట్టికి వలసయ్యాను" కారణం కరువని ఎంత కవితాత్మకంగా చెప్పారో! ఈ సందర్భంలో ఒకసారి కవి గత గ్రంథాలను పరిశీలిస్తే, "వర్లీ" పేరిట వలస నానీలు; "వలస పత్రం" కవితా సంపుటం కనిపిస్తాయ్; ఈ ఆవేదన ఇప్పటిది కాదని, ఇంతటితో తీరేది కాదని తెలియజేస్తాయ్. ముంబాయ్కర్‌లాంటి మరికొన్ని కవితల నేపథ్యమూ ఇదే. శ్వాసనిండా తన ఊరి పరిమళాన్ని, కళ్ళనిండా ఊరి పొలిమేరలను నింపుకున్నాక ఎంత చెప్పినా, దుఃఖిత హృదయం మరెన్నో పంచుకోమంటుంది.

"అక్కడొకప్పుడు ఓ మిల్లుండేది... దాని ఒంటి నిండా అన్నముండేది. ఏం జరిగిందో ఏమో రాత్రికి రాత్రే మిల్లు మాయమై కరెన్సీకంపలు అడ్డుగోడల్లా మొలిచాయి" అంటారు, "అద్దం వెనుక" కవితలో. మిల్లు ఎన్ని వేల కుటుంబాల ఆకలి తీర్చేదో అనడానికి దాని ఒంటినిండా అన్నం ఉండేది అనడం ఎంత గొప్ప అభివ్యక్తో కదా. ఈ మధ్యే కవి మిత్రుడు 'కలిదిండి వర్మ' రైతు గురించి చెబుతూ అతను నడుస్తుంటే వీధంతా అన్నం ఉడుకుతున్న వాసన అంటారు. మళ్ళీ అంత పరవశం కలిగించిన మాట ఇది.

సాధారణంగా ఒక విషయాన్ని ఉన్నతంగా చూపాలనుకున్నపుడు అంతకంటే గొప్పదైన విషయంతో పోల్చిచెబుతాం. గాయపడ్డ ఉదయం కవితలో కవి అంటారు "కవిత్వం లాగే ఉదయాలకు చెదలు పట్టవు". అంటే శాశ్వతమైన ఉదయానికి చెదపట్టదు అని చెప్పడానికి కవి కవిత్వాన్ని పోలికగా ఎన్నుకున్నాడంటే; ఉదయం కంటే కవితనే ఎక్కువ నమ్ముతున్నాడన్నమాట, కవిత్వంలో నిబద్ధత అంటే ఇదే.

మన మధ్య ఉండాల్సిన వారెవరో విడిచి వెళ్లి పోయినపుడు కాసేపు మౌనం పాటిస్తాం. కానీ ఇపుడు సందర్భం వేరు. ఖచ్చితంగా ఉండాల్సినవేవో కవికి కనిపించడం లేదు "మనకు దేహాలున్నాయి, దేహాలను కప్పే రేమాండ్స్ గ్వాలియర్స్ ఉన్నాయి, దేహాల్లో ఉండే ఉష్ణ రక్త కాసారాలకే కరువొచ్చింది. గుండె తడే కాదు, కంటి చెమ్మను కూడా మరిచిపోయిన మనం..." అందుకే, అన్నీ మూసుకుని కాసేపు మౌనం పాటిద్దాం అంటాడు. "ఆత్మలు చచ్చిన ఈ సమాజంలో ఆత్మ హత్యలుంటాయా? హత్యలు తప్ప?" అని తన వేదనను ప్రశ్నగా వ్యక్తం చేస్తారు "రోహిత్, ఓ రోహిత్ కవితలో". ఇలాంటి వాక్యాలు మనమింకా గుండె తడిని, కంటి చెమ్మని మరిచిపోలేదని గుర్తు చేస్తాయ్.

ప్రతిరోజూ మరో రేపటి కోసం తాపత్రయపడుతూ నేటిని కోల్పోతూ ఉంటాం. ఓసారి వెనక్కి తిరిగిచూసుకుంటే విఫలయత్నాల మధ్య పనిగట్టుకు వెతికితే ఒకటి రెండు విజయాలు కనిపిస్తాయ్. అందుకే తన "నోస్టాల్జియా" కవితలో "బతుకు బాటలో .. వేటలో..పొందిన వాటి కంటే పోగొట్టుకున్నవే ఎక్కువ" అంటాడు కవి.

"ఇదో దాహమే" కవితలో "చదవాలి, ఏదో ఒకటి. అక్షరాలనో... అనుభవాలనో..." అంటారు శ్రీ సంగెవేని. అలా అక్షరాలను, అనుభవాలను చదువుకుంటూ, అక్షరాల వెనుక అనుభవాలను వెతుకుతూ; అనుభవాలను అక్షరాలుగా మలచుకుంటూ వీరు సాగిపోతున్నారు.

ఇక, సంపుటికి శీర్షికైన కవిత విషయానికి వస్తే, "నగర జీవితానికి నగ్న నిర్వచనం చౌరస్తా" అంటారు. ఐతే ఆ నిర్వచనం రెండు మూడు వాక్యాలకు పరిమితం కాలేదు. ఈ ప్రయత్నంలో కవికి అంతవరకూ తాను చూసిన నగరపు చౌరస్తా అనేకానేక సంకుచిత పరిధులు దాటి ఓ విశాల సముద్రమైంది.

తాను వలసపోయిన భూమిలో తన స్థితి గురించి చెబుతూ " ఇంత చేసినా ఏ పుటలోనూ నా చరిత్ర లేదు; ఏ చరిత్రలో నేను అక్షరాన్ని కాదు" అని వాపోతారు. ఐతే, తెలుగేతర రాష్ట్రాలలో సాహిత్య కృషీవలత్వం నెరపుతున్న తెలుగువారి చరిత్రలో తగినన్ని పేజీలు ఇప్పటికే కేటాయించుకున్న వీరి మరో ప్రయత్నాన్నీ ఈ సందర్భంలో మనం తలచుకోవాలి. అమ్చీ ముంబాయ్ (Brief history of Telugus); శూన్యంనుండి

(తెలుగు ప్రముఖుల చరిత్ర) అని రెండు పుస్తకాలలో పరాయి నేలపై ప్రభావం చూపిన తెలుగువారి కృషికి శాశ్వతత్వం కలిగించే అభినందనీయమైన కృషి చేశారు.

"ఎందుకు?", " నాకెందుకు?" అనే రెండు పదాలతో ఒక గొప్ప చర్చకు తెర తీస్తారు, మరో కవితలో. Bernard Baruch అంటాడు "Millions saw the apple fall, but Newton was the one who asked why" అని. అందుకే కవి "ఎందుకు అనేది విశ్వ రహస్యాలను ఛేదించే అక్షర గాండీవం, నాకెందుకు అనుకోవడం పరమపద సోపానంలో పామునోటి వైనం" అంటాడు. ఇక్కడ పరమపద సోపాన పటం అనలేదు. పరమపద 'సోపానం'లో అన్నాడు. అంటే, నాకెందుకు అనుకోవడం – గెలుపు అత్యంత సమీపంలో ఉన్నపుడు పాము నోటపడడం, చివరి మెట్టునుండి జారిపడడం.

ఒక మాట మాత్రం చెప్పాలి. తనదైన భావన, తనదైన అభివ్యక్తి ఉన్నా, కొన్నిసార్లు ప్రజల నాలుకలపై నర్తిస్తున్న పూర్వ కవుల పద ప్రయోగాలు కవితలో కనపడడం వలన, కవిత చదువుతున్న పాఠకుడికి ఆ ఒకటి రెండు నిమిషాలు రవీంద్ర బదులు ముందుతరం కవీంద్రులు గుర్తొస్తారు. ఉదా. "తూకం వేస్తే వాడు పిడికెడు మట్టె", "దేహం–దాహం" – ఇది కవి కావాలని తెలిసి చేసిన పనే అయితే ఇబ్బంది లేదు, సుమా!

పుస్తకానికి విలువైన ముందుమాట నిచ్చిన "అత్తిలి అనంతరాం" అభినందనీయులు. ఒక ఆత్మీయ మిత్రుని గురించి ఏవో రెండు విషయాలు పంచుకుంటున్నట్టు కనిపించినా కవి పరిణామాన్ని, అధ్యయన పరిమాణాన్నీ, కవితల వెనుక కారణాల్ని, కారకాలని; అంతరంగాన్నీ, అంతస్తాపాన్నీ... సరదాగా చెప్పుకుపోయినట్లనిపించినా ఏ విషయమూ సరదాది కాదు. అలా రాయడానికి ఆయనన్నట్లు "అనంతమైన ఆపేక్ష" కావాలి. నిజానికి ముందుమాట వేరెవరు రాసినా పాఠకులకు ఇంతటి సమాచారం అందకపోనేమో!

సంగెవేని రవీంద్ర "మనసులోని కల్మషాన్ని కడిగే పనిలో" మరింతగా మునిగిపోవాలని ఆయన కవికిచ్చిన నిర్వచనాలకు ఉదాహరణగా మిగిలిపోవాలని ఆశిద్దాం.

ఫిబ్రవరి-ఏప్రియల్ 2019 రమ్యభారతిలో ప్రచురితం.

14 దామెర్ల కళ - కథ

2004 ప్రాంతంలో కాకినాడ సర్కార్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో "కళానుబంధం" పేరిట మాకినీడి సూర్య భాస్కర్ వ్యాసాల ద్వారా "చిత్రకళా విమర్శ" అనే ప్రక్రియ ఉందని మా తరంలో నావంటి వారికి మొదటిసారి తెలిసింది. ఆ తర్వాత "రామారావు నుంచి రామారావు దాకా" పుస్తకం; చినుకు మాస పత్రికలో "కవి చిత్రకారులు"–ఈ విభాగంలో వారి కృషి గురించి, చిత్రకళ గురించి మరిన్ని లోతైన విషయాలు తెలుసుకునే అవకాశం ఇచ్చాయ్.

"రామారావు నుండి రామారావు దాకా" పుస్తకంలో దామెర్ల రామారావు నుండి శిరందాసు వేంకట రామారావు దాకా పలువురు చిత్రకారుల జీవన/కళా చిత్రాన్ని ఆవిష్కరించారు మాకినీడి. ఆ పుస్తకం మొదటి అధ్యాయంలో ది డాన్సర్, యువతి, శ్రీ రామ వనవాసం, నంది పూజ, ల్యాండ్ స్కేప్ లాంటి కొన్ని చిత్రాలను పరిచయం చేసి; "దామెర్ల ప్రభావమూ... వారసత్వమూ" అధ్యాయంలో వారి శ్రీమతి సత్యవాణి; సోదరి బుచ్చి కృష్ణమ్మ మొదలుకుని శిష్య ప్రశిష్యుల వివరాలను తెలిపి "ఆధునిక ఆంధ్ర చిత్రకళ ఒక పర్వతమనుకుంటే దాని పాదాన్ని దామెర్ల స్థిరీకరించారు" అనే వాక్యంతో ఒక కళామూర్తి జీవితాన్ని ఒక్క వాక్యంగా సంక్షిప్తీకరిస్తారు.

ఐతే, పదేళ్ళ తరువాత "దామెర్ల కళ వారసత్వం" పుస్తకం కోసం మాకినీడి చేసిన కృషి మరింత కష్టమైనది. ఇది ఒకే రామారావు నుండి అదే రామారావు దాకా. రాజమండ్రి చిత్ర కళానికేతన్ 25 సం.లు పూర్తి చేసుకున్న ఒక చారిత్రక సందర్భంలో ఈ పుస్తకం తేవడం ప్రశంసనీయం.

ఫోటోగ్రఫీ లేని కాలంలో అసాధారణ వ్యక్తుల రూపాలను పదిలపరచే బాధ్యత చిత్రకారులు తీసుకుంటే; ఇపుడు ఒక అసాధారణ చిత్రకారుని జీవితచిత్రాన్ని మన తరానికి అందించే బాధ్యత కవి చిత్రకారుడైన మాకినీడి తీసుకోవడం అభినందనీయం. ఈ సందర్భంగా సి.నా.రె "అమ్మ బొమ్మ" కవిత గుర్తుకొస్తుంది. అది తలచుకోవడానికి ఇది సరైన సందర్భం.

"అమ్మ పోతూపోతూ తన బొమ్మ ఇచ్చిపోలేదు / కళ్ళు మూసుకుని చూస్తే అమ్మ బొమ్మ అలుక్కుపోతోంది / మిగిలిన ఆ కాస్త రూపం తుడుచుకుపోతే /దిగులుతో గుండె వణికిపోయింది / అమ్మ పటం గీయాలనుకున్నాను / అప్పుడు తెలిసింది నాకు / చిత్రకారుని కాదని / పద చిత్రణ మాత్రజీవినని / ఎంత మెదిపినా ఈ కలం కుంచె అవుతుందా? / పదాలు రేఖలవుతాయా? భావాలు రంగులవుతాయా?" తాను చిత్రకారుడు కాలేకపోయిన లోటుని జ్ఞానపీఠం కూడా తీర్చలేకపోయింది! అందుకే, సరైన సమయంలో ఎవరో ఒకరు ముందడుగు వేసి పదిలపరచకపోతే తరువాత తరాలు కోల్పోయే విషయాల్లో మరికొన్ని చేరిపోతాయ్.

నిజానికి, మహనీయుల జీవితాలు ఎలా చదివినా బానేఉంటాయ్. కానీ, చేయి తిరిగిన రచయితకు మాత్రమే సాధ్యమయ్యే ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు, ప్రణాళికాబద్ధ విభజన, శీర్షికలు – ఈ పుస్తకానికి పఠనీయతను పెంచాయి.

ఉదాహరణకు మొదటి అధ్యాయం శీర్షిక చూడండి – " ఒక సంఘర్షణ, ఒక సమన్వయం వెరసి ఒక చారిత్రక సందర్భం" –ఇందులో ప్రాచ్య, పాశ్చాత్య చిత్రకళలో మౌలిక బేధాలు; బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణలో మిగిలిన రంగాలతో పాటు కళారంగాలలోనూ వచ్చిన మార్పులు; మద్రాస్ స్కూల్, శాంతి నికేతన్, బొంబాయ్ జె.జె. స్కూల్ లకు అతీతంగా "ఆంధ్రా స్కూల్"గ కళావేత్తల గుర్తింపు పొందేంత వైయక్తిక ముద్ర వేసిన వైనం చర్చిస్తారు. ఆ తరువాత వంశం, పుట్టు పూర్వోత్తరాలు; తరువాత కాసేపు నాన్ డిటైల్డ్ టెక్ట్స్ లా అనిపించినా; నాటకాలకు బ్యాక్ గ్రౌండ్ తెరలు గీసే ఏ.ఎస్. రాం మొదలగు చిత్రకారులు దామెర్లను ఎలా ప్రభావితం చేశారు?.... మొదలైన కొన్ని అంశాలు ఆసక్తికరంగా సాగుతాయ్.

"ముంబాయికి ముందు కళాభ్యసనం" అధ్యాయం – ఆస్వాల్డ్ జెన్నింగ్స్ కూల్డ్రీ రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా రావడం, వారిద్వారా రామారావు గారికి, వారి మిత్ర బృందానికి లభించిన శిక్షణ మొదలైన సన్నివేశాలతో అత్యంత కీలకమైనది. "మీ ప్రాంతంలో సింహాద్వారాలు ఎంత గొప్పగా ఉంటాయో! కొంచెం పెద్ద సైజ్ లో మంచి సింహద్వారం పూర్తిగా రచించి ఇస్తావా?" అని గురువు అడిగినపుడు శిష్యులు ఊరంతా తిరిగి ప్రతి తలుపునీ పరిశీలించడం – ఎంత మంచి అభ్యసనా పద్ధతో!

రామారావు గారిని ముంబాయ్ "జంషెడ్‌జీ జిజియాభాయ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్" కు పంపడం; నేరుగా మూడవ సంవత్సరంలో ప్రవేశం; విశ్వకవి రవీంద్రులు విశ్వవిద్యాలయంలో ప్రసంగానికి భావనగర్ వచ్చినపుడు ప్రసంగం వింటూ వారి స్కెచ్ గీసి బహుమతిగా ఇవ్వడం, తాను చదువుకున్న జే.జే. స్కూల్లో ఇనస్పెక్టర్‌గా అవకాశం, లక్నో స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా పదవీబాధ్యతలు చేపట్టామన్నా వాటిని కాదని కళా, బోధనలకు అంకితంకావడం.. ఇవన్నీ మరో అధ్యాయంలో కనిపిస్తాయ్.

పర్యటనలు, ప్రశంసలు వీటితో ఆపకుండా దామెర్ల వారిపై వచ్చిన విమర్శలు అన్నీ తెలియజేయడం, చర్చించడం పుస్తకానికి సమగ్రతను కూర్చింది. జీవిత చరిత్రల రచనలో రచయితకు ఉండాల్సిన నిష్పాక్షికత మనకు స్పష్టంగా కనబడుతుంది.

"దామెర్ల కళా వారసత్వం" మరింత విస్తృతంగా ఈ పుస్తకంలో లభిస్తుంది. చివరలో దామెర్ల ఆర్ట్ స్కూల్ విద్యార్థుల వివరాలు చార్టుగా అందజేయడం చక్కని "అనుబంధం".

"బావి వద్ద" చిత్రం చూసి వేలూరి వెంకటేశ్వరరావు వ్రాసిన కవిత; "కృష్ణ లీలలు" చూసి రచయితకు గొట్టుముక్కుల నరసింహ శాస్త్రి "వేణుగీతి" గుర్తురావడం; దామెర్ల వారి మరణానంతరం వచ్చిన స్మృతి కవితలు గుర్తుచేసి విశ్లేషించడం; జీవిత చరిత్రకు సాహిత్య సుగంధం అద్దాయి.

మరోచోట "మందం అవసరమైన చోట నొక్కబడుతూ, కావలసిన తావులలో పెంచబడుతూ, సాగడమే కాకుండా స్ఫుటమౌతూ, అస్ఫుటమౌతూ, ధృఢమౌతూ, అధృఢమౌతూ ...ఒకో చోట కత్తుల్లా దూసుకుపోతూ, ఒకోచోట పాతమై జారిపోతూ, వివిధ రకాలుగా రీతులుగా సాగుతూ... ఇదీ చిత్రకళా శైలిని వర్ణించిన విధానం. పుస్తక రచయిత కవి అయినపుడే ఇలాంటి వాక్యాలు సాధ్యమవుతాయ్.

దామెర్ల వారి సమకాలీకులైన శ్రీ అడవి బాపిరాజు వంటి చిత్రకారుల పట్ల ఒకింత భక్తి భావం రచయితలో కనబడింది. దామెర్ల పట్ల అపరిమిత గౌరవానికి కొదువ లేకున్నా సమాన సమర్థత కలిగిన సమకాలీన చిత్రకారులు కొందరికి అంత ఘనత లభించలేదనే ఆవేదన మనకు స్పష్టంగానే తెలుస్తుంది – ఇది మాకినీడిలో విమర్శనా పార్శ్వం.

ఇక, దామెర్ల వారి వ్యక్తిత్వం, కళ, దృక్పథాన్ని గురించి వివిధ సందర్భాలలో తన పరిశీలన మేరకు కూఙ్రే వ్యక్తం చేసిన అభిప్రాయాల సమాహారమైన "Memories of Damerla Rama Rao" వ్యాసంలోని అంశాలు మనకు అదనపు సమాచారం ఇస్తాయ్.

కవితా సంపుటాలు, కథా సంకలనాలు ఎంతో అందంగా ఆర్భాటంగా ముద్రింప బడుతున్న ఈ రోజులలో, చిత్రకళకు సంబంధించి, అందులోనూ పదుల

సంఖ్యలో అరుదైన చిత్రాలు గల ఇంత గొప్ప పుస్తకం సాధారణమైన కాగితంపై ముద్రణకు నోచుకోవడం ఒకింత బాధ పెట్టింది. దామెర్ల వారి అభిమానులు, చిత్రకారులు పూనుకుని ఈ పుస్తకాన్ని రంగులలో మలిముద్రణ చేయాల్సిన అవసరం కనిపిస్తుంది.

వేంకట పార్వతీశ్వర కవులు తెలిపినట్లు "మృదుల సుమవల్లి పొదలియు బొదలకుండ దొగరు చిగురాకు తోచియు దోపకుండ; దొడగు నును మొగ్గ తొడిగియు దొడగకుండ... గాలి వసమున వసివాడి తూలిపోయిన" ఓ జీవితాన్ని; ముందుమాటలో శ్రీ టేకి మృత్యుంజయరావు అన్నట్లు – జీవించి చేసిన పనిని మరణించి కొనసాగించిన ఓ వైతాళికుని; తెలుసుకోడానికి ఈ పుస్తకం ఉపకరిస్తుంది.

నవమల్లెతీగ మే- 2019లో ప్రచురితం.

15 ఎన్నో వసంతాల నాటి పువ్వు

శ్రీ మేకా మన్మథరావు – సోమసుందర్ లిటరరీ ట్రస్ట్‌తో పరిచయం ఉన్న వారికి ఓ నిబద్ధ కార్యనిర్వాహకుడు. నలభై ఏళ్లనుండీ సాహిత్య ప్రయాణం చేస్తున్నవారికి, 'భారతి' చదివిన వారికి, రేడియో వినేవారికీ "ఊరి వెలుపల బావి", "నిన్న ఈ వేళప్పుడు" కవితలు వ్రాసిన కవి. అంతకు ముందు తరంవారికి మేకా సుధాకరరావుగారి అబ్బాయ్. ఇవన్నీ ఎందుకు "కనిపించిన ప్రతి మనిషీ ఒక మల్లి – పలుకరించిన ప్రతి మనసూ పాలవెల్లి" అనుకునే స్వచ్ఛమైన మంచిమనిషి. కవితా వారసత్వాన్ని కొనసాగిస్తూ నలభై ఏళ్ల క్రితం (1980లో) ఈయన వ్రాసిన కవితా సంపుటి "వసంతానికో పువ్వు".

సౌందర్యం, సురభిళం, మాధుర్యం మూడూ ఉన్న సుమాలివి. కలలన్నీ రేకులుగా, తలపులు తావిగా, ఆనందం మరందంగా, జీవన వసంతంలో హృదయ నికుంజపు తొలిపూతగా ఈ పుస్తకాన్ని పేర్కొంటూ సాహితీప్రియుల ముందుంచారు. తొలిపూత అనడంలో, వసంతానికి ఓ పువ్వు అని పేరు పెట్టడంలో భవిష్యత్ లో మరెన్నో వికసనాలకు హామీ ఇచ్చినా, అపుడపుడూ కొన్ని విడి పువ్వుల పరిమళాలు తప్ప ఈ నలభై వసంతాల పాటు మళ్ళీ ఇలాంటి గుచ్ఛాన్ని అందించలేదు.

మొదటి కవిత "కలలు – కవుల కలాలు" కవిత ప్రారంభం స్వీయ స్వప్న విశ్లేషణలా అనిపించినా, తనను ఈ రంగంలోనికి నడిపించిన కవుల, కావ్యాల తలపోత ఇది. మొదటి పుస్తకం మొదటి కవితలో పూర్వకవుల స్మరణకు ఇది ఔచిత్యవంతమైన ప్రయత్నం. "తెలవారకుండ మొగ్గలలోన చొరబడి వింతవింతల రంగు వేసి వేసి" అంటారు కరుణశ్రీ. ఇలా "ముడుచుకున్న మొగ్గలోనికి రంగులా మూసుకున్న కళ్ళలోనికి రంగు రంగుల కలలు రమ్య భావపుటలలు వస్తూ ఉంటాయ్" అంటారు మన్మథరావు. కల ఉన్నతిని కొలవాలంటే కలగన్న మనిషి లోతు తెలియాలన్నది కవి ఉద్దేశ్యం. ఎదలోని తలపులు కలలో నీడ చూసుకుంటాయిట.

వాక్యాన్ని కవిత చేయడం అప్పటికే బాగా తెలుసాయనకు. "అందం రెక్కలుకట్టుకుని ఎగిరిపోతూ అలసట తీర్చుకోడానికి ఆ యమునా నదీ తీరాన దిగినట్లుగా ఉంటుంది ఆ స్మృతి మందిరం". తాజమహల్ గురించి ఎందరో వర్ణించి ఉంటారు. వేటికీ తీసిపోని వర్ణన ఇది. ఓ అందమైన అమ్మాయిని చూసి దివి నుండి అప్సరసలు విహారం కోసం వచ్చారనడం విన్నాం కానీ ఓ భవంతికి ఇలాంటి అన్వయం అభినందనీయం.

చాలా కవితల్లో గేయం పోకడలు కనిపిస్తాయ్. డెబ్బై, ఎనభైలలో కవులందరిలోనూ ఇది సాధారణమే కదూ!

"సిక్క టెన్నెల్లోన సేరువగ కూకుండి
సిలిపి సూపుల తోటి సెరకు కొరుకుత ఉంటే
సెందురుడే పోయాడు సూరుడే వొచ్చాడు
సెరకు తరగనేలేదు సూపు మరలనే లేదు!". ముత్యాల సరాలు, ఎంకి పాటలు, కృష్ణ శాస్త్రి గీతాలు ఈ ఒరివడికి కారణం. "ఏ భాషలోనైనా సారస్వతం అతి ప్రాచీనదశలో గేయాత్మకంగానే ప్రాదుర్భవిస్తుంది. భూగంధ సారళ్యము, లాలిత్యము వంటి నిసర్గ సౌందర్యాలు ఇందులో ప్రకాశిస్తాయ్" అంటారు సోమసుందర్ ఓ సందర్భంలో. చాలా మంది కవులలో ముఖ్యంగా నాటి కాలంలో తొలి దశ సృజన ఈ తరహాలో జరగడానికి కారణం ఇదే. గేయపు నడక నుండి బయట పడినా బాణీకట్టి పాడడానికి వీలయిన కవితలు చాలానే ఉంటాయ్, ఈ పుస్తకంలో.

మరో కవిత "ఊరి వెలుపల బావి" కూడా గేయంలాంటి నడకతో ఉంది. కన్నెగా తల్లయినవారు, అన్నమే నోచనివారు, త్రాగుబోతు భార్యలు – ఇలా ఎందరినో తాను తల్లిగ ఒడిచేర్చి నిదురపుచ్చిందిట ఆ బావి. ఊరంతా ఆ బావి పాడుపడిందని విడిచిపెట్టారు కానీ మానవత లేదని బావే ఊరిని విడిచి పెట్టింది అంటారు. బావిని ఆనుకుని ఎదిగిన రావిచెట్టుని వర్ణిస్తూ "రావికి రక్తమిచ్చిన బావి" అంటారు. ఈ కవితకు మహాకవి శ్రీ శ్రీ న్యాయనిర్ణేతగా నిర్వహించిన పోటీలో మొదటి బహుమతి రావడం, బాపు చిత్రంతో ఆంధ్రజ్యోతిలో ప్రచురింపబడడం మన్మథరావుగారికి ఓ సతతహరిత జ్ఞాపకం.

"లంగరేసిన పడవలా ఆ ఏటి ఒడ్డున మా ఊరు" లాంటి దృశ్యమానం చేసిన సన్నివేశాలే కాదు, మనసును కల్లోలపరచే అంశాలనూ తీవ్రత తగ్గకుండా ఉపమానంతో చెప్పడం, ముప్పై ఏళ్ల వయసులోనే నేర్వడం అందరికీ సాధ్యం కాదు. అలాంటివి కొన్ని:

"దుర్వాసన లేదు కానీ చచ్చి పదిరోజుల తరువాత బ్రతికిన శవంలా ఉన్నాడు".

"పియానో మెట్లలాంటి ప్రక్కటెముకలు"

"శిథిలాలయ ప్రాకారంలో చవుడుకొట్టుకుపోయిన ఇటుకల్లా లోకంనిండా మంచి మరిచిన మనుషులు"

శవంపై కప్పిన తెల్లని వస్త్రంలా పరుచుకున్న వెన్నెల. (ఎందుకో! అలిసెట్టి ప్రభాకర్ గుర్తొస్తారు).

"మోడువారిన తన దెందంలో కన్నీళ్లను రంగరించి, శిశిరం వసంతం చిత్రీకరణకు రంగులను కలబోస్తుంది" లాంటి అబ్బుర పరచే వాక్యాలు నిండిన ఈ పుస్తకంలో ఒక కవిత గురించి మాత్రం కాస్త ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అదే "నిన్న ఈవేళప్పుడు". నిజానికి ఇది ఒక కథ. పాతబట్టలు ఉంటే ఇమ్మని అడిగిన ఒక నిర్భాగ్య యువతికి, మరణించిన తన కూతురి గుర్తుగా దాచుకున్న పూలచీరను ఇచ్చి, అరుగు మీద ఆకువేసి తనే స్వయంగా వడ్డిస్తాడు కవి. ఆ రాత్రే ఆమె మానభంగానికి గురై చంపబడినపుడు శవంపై కప్పిఉన్న నెత్తురోడే తన చిట్టితల్లి పూలచీర కవి హృదయాన్ని ఎంతగా ఛిద్రం చేసిందో... ఈ కవిత వెనుకున్న కథ.

ఇది **"హృదయ నారికేళాన్ని కోరుతున్న బాధ"** అంటాడు కవి. నిజమే. గుచ్చినపుడో, చీల్చినపుడో అనడం కన్నా 'కోరడం' అన్నపుడు తీవ్రత ఎక్కువ. అందుకే ఆ పదాన్ని ఎంచుకున్నాడు కవి. ఈ కవిత ఎత్తుగడే **"అన్నం అడగడానికి రాలేదమ్మా! ఆకలి నాకు అలవాటయిపోయింది"** అని మొదలవుతుంది. అంటే తాను ఆకలి కంటే దేనికి ప్రాధాన్యమిస్తోందో, ఏది కోల్పోవడానికి సిద్ధంగా లేదో చెబుతాడు కవి. చివరికి ఇలాంటి పాత్రల ముగింపులు కవితలోనైనా, జీవితంలోనైనా నాటికీ, నేటికీ ఒకటే. 'వాంగ్మూలం' కవిత కూడా కథనాత్మక కవితే. ఇలాంటి కవితలలో 'తిలక్' నిర్మాణవ్యూహం కనిపిస్తుంది.

నిజానికి ఈ పుస్తకం వచ్చేనాటికి "సోమసుందర్" ప్రభావం వీరి కవిత్వంపై లేదు కానీ వీరి గురించి వ్రాస్తూ వీరిద్దరి సాన్నిహిత్యాన్నీ ప్రస్తావించకపోవడం సాహసమే. అందుకే అందరికీ తెలిసినా నాలుగు మాటలు చెప్పుకుందాం. ట్రస్ట్ కార్యక్రమాల నిర్వహణద్వారా సాహితీస్రష్టలందరితో సన్నిహిత పరిచయం, చివరి దశలో సోమసుందర్ కవిత్వానికి లేఖకునిగా, సాహిత్య పత్రికలు చదివి వినిపిస్తూ గుణదోష చర్చలు ఇవి అందరికీ దక్కని అదృష్టాలు. స్నేహితుని కొడుకుగా పరిచయం మొదలై, డా. జి. సీతారామ స్వామితో కలిసి "నిద్రపోకు అనుభవాలు జారిపోతాయి, మేలుకోకు కళలు పారిపోతాయి"; "సైకత తీరంలో సాగర ఫేనం"; "కన్నీటి కెరటాలపై కవితల వెన్నెల" మూడు పుస్తకాలకు ముందుమాటలు వ్రాసేంతగా పెరిగి చివరికి "చంద్రభాగ" పుస్తకాన్ని అంకితం తీసుకునేంతగా సాగింది వీరి మైత్రి. తన ఆత్మకథ రెండవ భాగం (పూలు ముళ్ళు)లో "ఆరిపోతున్న స్మృతి దీపాలను ఎగసన దోస్తూ , సంఘటనలను జ్ఞాపకం చేస్తూ" పూర్తి కావడానికి దోహదం చేసారని సోమసుందర్ మన్మథరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు, నా మిత్రుడు అని సంబోధిస్తూ.

పిఠాపురం 'నూర్జహాన్ సెంట్'' వ్యాపారంలో భాగంగా పరిమళాన్ని వెంటబెట్టుకుని దేశమంతా తిరుగుతూ, సంవత్సరానికి ఓ రెండు, మూడు కార్యక్రమాలు తప్ప కుదురుగా కూర్చుని చదువుకోవడం, వ్రాసుకోవడం వీలునివ్వని జీవితం మన్మథరావు సృజనకు కొంత విరామమిచ్చింది. కానీ వ్రాయాలని సంకల్పించాలేగానీ ఆయనలో కవి ఎప్పుడూ నిరాశపరచలేదు. సాహితీస్రవంతి వార్షికోత్సవ సంచికలు, కవి సమ్మేళనాల సమయంలో స్థాయి తగ్గని తాజా కవితలను నేటికీ అందిస్తారు.

''వసంతాలను తనలో కలుపుకొంటూ తరిగిపోతుంది జీవితం. అనుభవాలను తనలో నిలుపుకొంటూ ఎదిగిపోతుంది హృదయం" అని సంపుటిని ముగించిన మన్మధరావు "అనుభవాలతో ఎదిగిపోయిన... గుండె" చెప్పిన సంగతులను నలభైఏళ్లుగా వినిపించకపోవడం న్యాయంకాదని గుర్తుచేస్తూ వచ్చే వసంతానికైనా మరో పువ్వునిస్తారని ఎదురుచూద్దాం.

16 కాస్త గంధం, కాస్త గంధకం 'చందన చర్చ'

తిరుపతి వేంకట కవుల కాలంలో సాహిత్యకారుల వాద ప్రతివాదాలు; గ్రాంథిక, వ్యావహారిక వాదుల విమర్శ ప్రతివిమర్శలు పత్రికాముఖంగా నడిచేవి అని పెద్దలు చెప్పగా వినడం, రా.రా. సాహిత్య వ్యాసాలు చదవడం తప్ప అటువంటి కుండబద్దలు కొట్టే విమర్శ వినడానికి, చదవడానికి ఇపుడు అంతగా అవకాశం లేదు. ఆ లోటు తీర్చే అతికొద్ది విమర్శకులలో శ్రీ చందు సుబ్బారావు ఒకరు. ప్రవాహ సదృశమైన ధార ఆశ్చర్యపరిస్తే, పదునైన మాటలను నిర్మొహమాటంగా ప్రకటించే అలవాటు ఆలోచింపజేస్తుంది. వీరి సాహిత్య వ్యాసాలు కొన్ని "చందన చర్చ" పేరిట 2017వ సం.లో రెండవ ముద్రణ (మొదటి ముద్రణ: 2000) చేశారు.

సభల్లో, ప్రసంగవశాత్తూ నొప్పించేమాటలన్నా ఉన్న యాభైమందిలో ఓ పది మంది శ్రద్ధగా వింటారు. అందులో ఇద్దరో, ముగ్గురో పట్టించుకుంటారు. పెద్దవాళ్ళు అలాగే చెబుతారు అని సరిపెట్టుకుంటారుగానీ పెద్ద ప్రమాదం లేదు. కానీ వ్రాయడం అలా కాదు. ప్రపంచమంతా చదువుతుంది. ఆలోచిస్తుంది. మాస్టారూ ఎందుకిలా వ్రాశారూ.. అని అడుగుతుంది. అందుకే, అలాగే అనిపించినా అందరం అనలేం. ఎన్నెన్నో అడ్డం వస్తాయ్.

సంకోచం లేకుండా చెప్పడానికి వయసు, విద్య, వృత్తి, అనుభవం... ఇలా చాలా విషయాల్లో పెద్దరికం అవసరం. అలా అని అవే అర్హతలు, స్థాయి కలిగిన వారంతా అంత సూటిగానూ, స్పష్టంగానూ "నాకిది నచ్చలేదబ్బాయ్" అని చెబుతున్నారా!. అంటే, ఈ అర్హతలు, స్థాయితో పాటు "ఏమనుకున్నా పరవాలేదు, నే ననుకున్నది చెప్పకుండా ఉండను" అనే నియమంలాంటిది ఏదో విమర్శకునికి కావాలి. విమర్శకు కావలసిన సామగ్రితో పాటు పైన చెప్పుకున్న లక్షణం పుష్కలంగా గల శ్రీ చందు సుబ్బారావు గారి అభిప్రాయాల సమాహారం ఈ "చందన చర్చ".

42 వ్యాసాలలో కవులు, కవిత్వం, కథలు, కథకులు, సంపుటాలు, సంకలనాలు, అనువాదాలు, లఘు కవితా రూపాలు, పరిశోధనలు, .. దాదాపు అన్ని సాహిత్య అంశాలూ ప్రస్తావనకు వచ్చాయ్. "సారపు ధర్మమున్" పద్యంలో తిక్కన గారు చెప్పినట్లు "దక్షులెవ్వారలుపేక్ష చేసి రది వారల చేటగు" అని భావించిన చందు తనకు నచ్చనివన్నీ ఖండితంగా చెప్పారు. అది ఎవరి గురించి అయినా సరే. అందుకే, తన గురువే అయినా, "సోమసుందరా! నీ పదం ప్రబంధం నుంచి బయట పడాలి" అని మొహమాట పడకుండా అనగలిగారు. ఇలా, ఏం చెబుతున్నా పూర్తి ఎరుకతో చెప్పారు. ఎక్కడా ఏదో చెప్పబోయి మరేదో చెప్పినట్లుండదు. రూపాలు, మార్గాలు, ప్రక్రియలు... వీటన్నిటి మధ్య Dissociation of Sensibilities అనేది సాహిత్యకారుల మధ్య సాధారణమే. అయితే ఈ రూప,మార్గ, ప్రక్రియల పట్ల తాను ముందే ఏర్పరచుకున్న అభిప్రాయాలతో కాకుండా, వాటికి సాహిత్య కారులు నిర్ధారించిన Properties తోనే వ్యాసకర్త మూల్యాంకనం చేయడం ప్రశంసనీయం.

తాను ఇచ్చిన Statementsకి అవసరమైన ఉదాహరణ లిస్తూ justify చేసిన తీరు బావుంది. శిష్టా కవిత్వం నవ్యతకు నాంది పలకలేదని చెప్పి, అంతటితో ఊరుకోకుండా ఉపోద్ఘాతం తరువాత పరిశోధనా వ్యాసంలా 1,2,3 అని పేరాలుగా

వివరిస్తూ, అందులో మరలా ఎ,బి,సి.. అంటూ ఉప అంశాలను చెబుతూన్నపుడు వ్యాస నిర్మాణం వెనుక ఎంత ప్రణాళిక ఉందో మనకు తెలుస్తుంది.

***

అన్నిటిలో అత్యంత విలువైన వ్యాసం "ఆధునిక ఆదిగురువు గురజాడ". అప్పారావు గారు కనీసం 1920 వరకూ జీవించి ఉంటే (మరణం: 1915) ఆధునిక సాహిత్య స్వరూపమే వేరుగా ఉండేదని; "విప్లవ రచయిత" అనే పదాన్ని సాహిత్య అర్థంలో వాడితే గురజాడకే చెల్లుతుంది అంటారు వ్యాసకర్త. గురజాడ రచనలు చేసేనాటికి దేశ స్థితిగతులు ఏమాత్రం అనుకూలంగా లేవు, గాంధీజీ పదేళ్ళ కుర్రాడు; వర్ణ వ్యవస్థను నిరసించే పరిస్థితి లేదు; ఆయన కొలువు రాజరికంలో; చుట్టూ గ్రాంథిక భాషావాదులు; బ్రిటీష్ పాలన; సైన్స్ అభివృద్ధి అంతంతమాత్రం; హేతువాదం ఇంకా లేదు. ఇలాంటి నవీన ప్రతిపాదనలు చేయడానికి అవకాశం శూన్యమైన స్థితిలో సాహసోపేతమైన రచనలు చేశారు, గురజాడ అంటారు. గురజాడ గేయాలలో చక్కని ఉదాహరణలు ఇస్తూ తన అభిప్రాయాలను మనచేతా ఔననిపిస్తారు. గురజాడ మరింతకాలం జీవించి ఉంటే భావకవిత్వం, సంప్రదాయవాదాల మనుగడ ప్రశ్నార్థకమే అంటారు. ఈ వ్యాసం ఓ ఉన్నతమైన వాక్యంతో ముగిస్తారు " తెలుగునాట ఆధునిక సమతావాద నాగరిక భావాలు చెప్పిన గురువులందరికీ గురువు ఒక్క గురజాడే... సమాజం ఘనీభవించి ఉన్నపుడు "మార్పు నా తీర్పు" అని చెప్పడం సామాన్యమైన సాహసం కాదు. అందుకే రెండు పొద్దులా ఆధునిక రచయితలూ ఆయనను స్మరిస్తూ ఉండడం".

కవిత్వ సంబంధ వ్యాసాలలో మిరియాల రామకృష్ణగారి "సువర్ణ స్వప్నం" ఎండ్లూరి సుధాకర్ గారి "కొత్త గబ్బిలం" కావ్యాల విశ్లేషణ అత్యుత్తమ కవితా వాక్యాలను ఉదాహరిస్తూ సమగ్రంగా నిర్వహించారు. "మరి బతుకు పుస్తకం మాటేంటి?" మరో చక్కని వ్యాసం. కనీస ఆర్థిక అవసరాలు తీరనపుడు వ్యక్తి సాహిత్య కృషికి విఘాతం కలుగుతుందని; అతని నుంచి సాహిత్య సమాజానికి అందవలసి నంత అందదని చెబుతూ, పుస్తకం వేసి పంచుకుంటున్న నేటి సాహిత్యకారుల స్థితిని వారి శైలిలోనే వివరిస్తారు. ఆరుద్రపై ఎలిజీ ఈ పుస్తకంలో ఎందుకు చేర్చారో?

***

చాలా వ్యాసాల శీర్షికలే ఆ వ్యాసంలో ఏం చెప్పబోతున్నారో పాఠకుడికి చెప్పేస్తాయి. ఎన్.గోపీ గారి "కాలాన్ని నిద్రపోనివ్వను" కవితా సంపుటికి "పదచిత్రం

ఫలించొద్దూ..” అనీ; పైన చెప్పుకున్న శిష్టా వ్యాసంలో “శిష్టా భ్రష్ట ప్రయోగం నవ్యతకు నాంది పలికిందా?”; ఆరుద్రకి నివాళినిస్తూ చలసాని ప్రసాద్ గారు వ్రాసిన వ్యాసం “ఆరుద్రమీద ఎప్పుడూ నిందలేనా?” “సాహిత్యం ఆహ్లాదాన్ని ఎలా కలిగిస్తుంది”; “హైకూల గురించి అంత ఆర్భాటమేలా?”; “ప్రపంచ సాహిత్య ద్వారం అనువాదం”; “చీకటి చిత్రశాలలో అజంతా”; “మల్లారెడ్డిని మరిచి పోయామా?”; “కేవల జ్ఞానం కవిత్వం కాదు”; – ఈ శీర్షికలు చదువుతున్నపుడే ఆయన ఏమంటారో తెలిసినా ఎలా అన్నారో అని ఆసక్తిగా చదువుతాం.

నగ్నముని కొయ్య గుఱ్ఱం; “యువ నుంచి యువ దాకా” కవితా సంకలనం (అజో విభో ప్రచురణ– సంకలన కర్త : శ్రీకాంత శర్మ); అల్లం శేషగిరి రావు కథ “చీకటి”; ఆకాశవాణి నిర్వహించిన కవి సమ్మేళనంలో వచ్చిన కవితల అనువాదాలు (మూసీ మాస పత్రిక ఫిబ్రవరి 99లో ప్రచురణ) వీటిపై వ్యాసాల్లో తన దృష్టిపథంలో కనిపించిన మంచిచెడులను అభిప్రాయాలుగా, అభ్యంతరాలుగా మనతో పంచుకుంటారు, చందు.

***

“కవిత్వంలో ప్లాసిబో”వ్యాసం కొత్త ద్వారాలను తెరుస్తుంది. ఇందులో చెప్పిన సంగతులు ఇచ్చిన ఉదాహరణలు ప్రత్యేకమైనవి. ఏ వ్యాధీ లేకపోయినా ఏదో ఉందని బాధపడుతున్నవాడికి, వైద్యుడు పంచదార గుళికను కేప్సుల్ రూపంలో ఇచ్చి వేసుకోమంటాడు. ఆ గుళికను placebo అంటారు. కొన్ని సందర్భాలలో ఒకే వ్యాధితో బాధపడేవారిని రెండు సమూహాలుగా చేసి కొందరికి ప్లాసిబోను, కొందరికి నిజమైన మందును ఇస్తే మానసిక సంతృప్తి వలన మొదటి వర్గంలోనూ నయమైన వారుంటారు. అపుడు మందు ప్రభావం ఉన్నట్లా? లేనట్లా? అలాగే, సాహిత్య వైద్యులూ కొన్ని సార్లు ఏది కవిత్వమో, ఏది ప్లాసిబోయో గుర్తించలేరంటారు. కవిత్వం పేరుతో కొన్ని సార్లు కవిత్వం కానిది ఏదో చోటుచేసుకున్నపుడు పాఠకుడికి “మానసిక సంతృప్తి” (సైకోమాటిక్ ఎఫక్ట్) ఉన్నంత కాలం అది కవిత్వంగానే చెలామణీ అయిపోతుంది అంటారు.

మరో వ్యాసం “మాటల సందడి ఎక్కువ.. మౌనం తక్కువ” ప్రధానంగా మెక్సికన్ కవి'ఆక్టేవియో పాజ్' భారతీయ సాహిత్యంపై చేసిన విమర్శ. ఈ వ్యాసం దాదాపు పాజ్ అభిప్రాయాల అనువాదం తప్ప సుబ్బారావుగారు ఎక్కడా పాఠకుడికి

కనపడరు, కేవలం పాజ్ అభిప్రాయాలలో కొన్ని ఎంపిక చేయటంలో తప్ప. ఐతే, "గతి క్రమాన్ని పసికట్టేది కళ" వ్యాసంలో విలువైన విషయాలు ప్రస్తావిస్తారు. ఇందులో కొన్ని వాక్యాలు చూడండి "పాదార్థిక జగతికీ అందుండి ఉద్భవించే కళాత్మక ప్రక్రియకూ అత్యంత సన్నిహిత బాంధవ్యం ఉంది. ఐతే సృష్టిని కొలతలు, దూరాలు, కాంతి సంవత్సరాలు, వివరాలు, ఎత్తులు, లోతులు, ఉష్ణ శీతల పీడనాలు అంటూ శల్య పరీక్ష చేసేది 'సైన్సు'; మనోహరం, రమణీయం, అద్భుతం, అమోఘం, భాసుర ప్రకాశం, భాస్కరోగ్ర తేజం, ఊహా మహా కల్పితం అంటూ వివరించే తత్త్వం 'కవిత్వం'. వాయువేగ మనోవేగాలు అనే సమాసానికి బదులు వేగము, దిశ, త్వరణము వేగవృద్ధి అనే విస్పష్ట సాంఖ్యాత్మక వివేచన సైన్సు అవుతుంది.

***

మొదటి వ్యాసం "విమర్శిస్తే ఆగ్రహిస్తారు జాగ్రత్త!" ; నలభయ్యో వ్యాసం "ఆయననా విమర్శించడం!". ఇవి రెండూ సాహిత్య కారులను విమర్శిస్తే వారితోనూ, వారి అభిమాన వర్గంతోనూ స్నేహానికి ఎలాంటి విఘాతం కలుగుతుంది? అనే విషయాన్ని చర్చిస్తారు. మరి అన్నీ తెలిసిన వ్యాసకర్త ఆ పనే ఎందుకు చేశారు? అనే ప్రశ్న కలుగుతుంది. ఆయనే ఒకచోట కోట్ చేసినట్లు "Literature is not a sedative.. it is irritant" కదా! ఇక్కడ ఇర్రిటంట్ అంటే కుదురుగా ఉండనీయని ఒక మానసిక అసౌకర్య స్థితిగా మనం భావిద్దాం. దాని నుండి బయట పడాలంటే ఒకటే మార్గం "నాకు ఇలా అనిపించింది, ఒప్పుకుంటావో, తప్పు అంటావో నీ ఇష్టం అని చెప్పెయ్యడమే".

చివరగా ఒక మాట. సుబ్బారావుగారు ఎక్కడా సుదీర్ఘ వివరణలు ఇచ్చుకోలేదు. ఏ వ్యాసం మూడు నాలుగు పేజీలకు మించలేదు. క్లుప్తంగా, స్పష్టంగా చెప్పడం, అన్ని పేజీలూ చదివేలా చెయ్యడంలో రచయిత చేయి తిరిగినతనం కనిపిస్తుంది.

నచ్చిన విషయాల మధ్యలో నచ్చనివి, నచ్చనివాటిలో మెచ్చినవి విభజించి విశ్లేషించడమెలాగో ఈ పుస్తకం చెబుతుంది. పొరలు పొరలుగా వేరుచేసి చూడడం, మనవైన అభిప్రాయాలను ధైర్యంగా ప్రకటించడం ఈ పుస్తకం అలవాటు చేస్తుంది.

17 జీవన 'కావ్యం' - పెన్నేటి 'పాట'

"వివిధ విస్తృత వాఙ్మయ సేవకుడు" అని సమకాలీనుల ప్రశంసలందుకున్న శ్రీ విద్వాన్ విశ్వం ఎన్నో మెట్లు దిగివచ్చి సాధారణ పాఠకుడికోసం వ్రాసిన కథ 'పెన్నేటి పాట'. ఒక్క మాటలో చెప్పాలంటే వారే అన్నట్లు ఇది పెన్నేటి గట్టున ఉన్న పల్లెల బ్రతుకు నీడ. శీర్షికలో పాట అన్నారు గానీ, ఇది కేవలం పాట కాదు కావ్యమని స్వయంగా ప్రకటించారు. సంస్కృత కావ్యాలెన్నిటినో అధ్యయనం చేసినవాడు, కొన్నిటిని అనువదించి మనకు అందించినవాడు ఆ మాట అన్నపుడు ఇక ఆలోచించేదే ముంటుంది. 'వాక్యం రసాత్మకం కావ్యం' ఐనపుడు వందల రసమయ వాక్యాల ఈ సృజన కావ్యం కాక మరేమిటి? అందునా నింపినది "ఏకో రస: కరుణ ఏవ". పేరులో పాట, లోపల పద్యాలు, గేయాలు, చెప్పినది కథ అయినా ఇది కావ్యమే. పద్యాలు కూడా చదివేప్పుడు గేయాలా అన్నంత హాయిగా సాగిపోతాయ్. అలా గానయోగ్యంగా పద్యాన్ని నిర్వహించడం విశ్వంగారి వంటి కొందరికి మాత్రమే అబ్బిన విద్య. అందుకే ఆరు దశాబ్దాలు గడిచినా కావ్యంగా అధ్యయనం చేస్తున్నాం, పాటగా పాడుకొంటున్నాం.

***

1950వ దశకంలో రాయలసీమ ప్రాంతంలో పెన్నానదీ పరీవాహక ప్రాంతంలో భాగ్యవంతుల, శ్రమజీవుల జీవనం ఆ రెండిటి మధ్యగల మందమైన అడ్డుగోడ ఆ ఓడలు బళ్ళు అయినపుడు జీవితాలలో చోటుచేసుకున్న పెనుమార్పులు దివారాత్రాలు కష్టిస్తేగానీ సాగని కూలీల బ్రతుకులు ఆ పేద కుటుంబాలలో ఆలుమగల అన్యోన్యత, కష్టకాలంలో ఇరుగుపొరుగుల సహాయాలు ఇవన్నీ మనకు కథలో ఎదురవుతాయి. అప్పటి భూస్వామ్య వ్యవస్థ, వెట్టి చాకిరీ తాలూకు ఆనవాళ్ళు కనిపిస్తాయ్.

ఈ కావ్యరచనకు ప్రేరణగా నిలిచిన అంశాలు మనకు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారి పీఠికలో అవగతమవుతాయ్. “ఒకనాటి వైభవ పరిశేషము క్రమముగా మావంటి వారి కన్నుల ఎదుటనే అంతర్ధానమైనది” అంటూ రాయలసీమ పరిస్థితులకు తల్లడిల్లిన విశ్వంగారి తీవ్ర నిర్వేదమే ఈ పెన్నేటిపాటగా పరిణమించినదని రాళ్ళపల్లివారు తెలియజేస్తారు.

గతంలోని ఘనతను కీర్తిస్తూ మొదలు పెడతాడు కవి. కర్షకులు, కవి పండితులు, నాణ్యమైన నేత పనివారు, మేధావులు, ఎడద చిక్కనకు పేరు గాంచిన వీరులు, శిల్పులు – ఇంతటి ప్రభావం నిండిన ఆనాటి రాయలసీమ పచ్చలబజారును తలపోసుకుంటాడు. అచట నొకనాడు పండిన ముత్యాల చాలు, నిండిన కావ్యాల జాలు, కురిసిన భాష్యాల జల్లు మన ఎరుకలోకి తెస్తాడు. అక్కడ ఆపి –

ఇది గతించిన కథ / వినిపింతునిక / నేటి రాయల సీమ కన్నీటి పాట.
కోటి గొంతుల కిన్నెర మీటు కొనుచు–
కోటి గుండెల కంజరి కొట్టుకొనుచు– అని మొదలుపెడతాడు.

అదేపెన్న అదే పెన్న
నిదానించి నడు
విదారించు నెదన్ వట్టి ఎడారి తమ్ముడు అని పాఠకుడిని చేయిపట్టి చూపుతూ నడిపిస్తాడు.
ఎదీ పెన్న, ఎదీ పెన్న /ఎదీ పినాకినీ
ఇదే పెన్న ఇదే పెన్న /ఇదే పినాకిని

నిజానికి ఒక కొండనో, నదినో, సముద్రాన్నో ఇదిగో అని ఎవరైనా చూపాలా! కానీ ఇదిగో అని చూపుతున్నా ఒక దృశ్యం కనిపించడం లేదంటే అది ఏనాడో అదృశ్యం అయిందని అర్థం. కవి తన వాక్య విన్యాసంతో ఒకప్పుడు ఉండేదేదో ఇపుడు లేదని చెబుతున్నాడు. నీటిజాలు బదులు ఇసుక వాలు చూపుతున్నాడు. **పార చేబట్టుకుని వంగి చీరు దనుక, ఇట్టే చెమ్మట కాలువ గట్టు దనుక** ప్రత్యక్షంగాని నదిని దృశ్యమానం చేస్తున్నాడు. **దోసిట నొక్కమారు పుక్కిలించిన జాలు, నీ పుట్టువునకు సార్థకత్వమ్ము, నిష్కల్మషత్వమబ్బు** అని దాని పవిత్రతను చెబుతున్నాడు. **ఇంతమంచి పెన్నతల్లి ఎందుకెండిపోయెనో? ఇంతమంది కన్నతల్లి ఎందుకిట్లు మారెనో?** అని వాపోతున్నాడు.

ప్రాచీన కావ్యాలలో మనం ఎన్నో నదీ వర్ణనలు చూసాం. భాగవతంలో యమునా నది వసు చరిత్రములో శుక్తిమతీ నది చంపూ రామాయణము, యయాతి చరితము, చిత్రభారతములలో గంగానది పరమయోగి విలాసము, శ్రీ రంగ మహాత్మ్యములలో కావేరీనది కృష్ణా మాహాత్మ్యములో కృష్ణానది వర్ణింపబడ్డాయి. వీటన్నిటిలో కొన్నిచోట్ల నదిని స్త్రీగా మరికొన్ని చోట్ల సరస్వతీ స్వరూపంగా ఇలా కవులు వారివారి ఊహాశక్తి మేరకు వర్ణించారు. కానీ వేదనాపూరిత హృదయంతో ఉన్నవాడి దృక్కోణం వేరుగా ఉంటుంది. అందుకే విశ్వంగారికి పూర్వకవులు చూసినవేవీ కనిపించడం లేదు. పెన్నా నదీ విహారంలో నాగకన్యలు కనపడరు గానీ నాగుపాములు ఎదురవుతాయని, గరుడ గంధర్వ కామినులు లేకున్నా బొంత గద్దలు మనపైన ఎగురుతాయని, దేవతా వృక్ష సమూహాలు లేకున్నా తిప్పతీగలు మొదలైనవి చుట్టుకుంటాయని, ఎక్కడ చూసినా పుట్టలు, గుట్టలు, నిట్రాళ్ళు, చేట్రాళ్ళు, బెట్రాళ్ళు.. ఇవీ కవికి కనిపించినవి.

ఒక్కో చెట్టు గురించి చెబుతూ ఏ చెట్టు ఎవరికి ఉరికంబంగా మారిందో, ఆ కథను చెబుతారు. ఏదీ విజయానికి గుర్తుకాదు. అన్నీ విషాదచిహ్నాలే. ఏ డొంకలో ఏ ఆడపిల్ల బ్రతుకు అన్యాయమైపోయిందో, ఏ డొంకలో ఏ కుటుంబం దోపిడీకి గురయ్యిందో చెబుతారు. ఐదుసర్గల ఈ గ్రంథంలో మొదటి సర్గను ముగిస్తూ పారలు పట్టుకుని పనికివచ్చే సమూహంలోని కథానాయకుడు రంగన్నను ప్రవేశపెడతారు.

***

ధనవంతుడైన నారపరెడ్డి కొడుకు రంగన్న. నారపరెడ్డి వైభవమంతా దానధర్మాలు, విలాసాలు, తనను కీర్తించే వారికిచ్చే పారితోషికాలు, వందిమాగధుల పోషణ – వీటన్నిటికీ ఖర్చయిపోతుంది. **"సర్కారు సిబ్బందికి కొంత సాలు జమాబంది పాలుకొంత అలేకార్ల లంచాలకు కొంత పెద్ద వకీలు పిల్లేకు కొంత కాంపౌండర్ మునుసామికి గుఱ్ఱాలకు, బగ్గీలకు, భటులకు, కూతుర్ల వివాహాలకు, భార్య కలరా (దూము)"** – వీటన్నిటికీ కణజాలు, నేలమాళిగలు, పాతరలు (ధాన్యం నిలువ ఉంచే ప్రదేశాలు) ఖాళీ ఐపోయాయి. జీవాలు (మేకలు, గొర్రెలు) తరలిపోయాయి. నారపరెడ్డి నారప్పగా మారిపోయాడు, అతడి కొడుకు రంగన్న భూస్వాముల ఇంట పనివాడుగా మారిపోయాడు.

రంగన్న కష్టాలను చెబుతూ కవి ఒక మాట వ్రాస్తారు – **ఎండు రొట్టె ముక్కలు అరిగింపుగాక ఎన్ని మిరప గింజల నమిలించినదియో**. మరోచోట వాడి పాట విని **చెట్టు పుట్టలకే గుండె పుట్టజేయు** అంటారు. ఈ వాక్యం విన్నపుడు "గాజు కన్నైన ఒక అశ్రుకణమురాల్చు" అన్న మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు గుర్తొస్తారు.

***

రంగన్న భార్య గంగమ్మ. అమ్మ, నాన్నపోయిన తర్వాత అక్క, బావల ఆలనా పాలనలో పెరిగింది. ఎద్దు పొడిచి బావ చనిపోయిన తర్వాత ఆమెకు కష్టం అంటే తెలిసి వచ్చింది. ఇక్కడ ఒక గొప్ప వాక్యం వ్రాశారు కవి – **లేమి ఏమి సేయు ప్రేమయున్న**. చిన్నప్పుడే మనకు నేర్పే శతక పద్యాల సరసన నిలువ వలసిన పద్య పాదం ఇది. మరోచోట గొప్ప చమత్కారం చేస్తారు విశ్వం గారు. రంగన్నని గంగన్నా అని, గంగమ్మను రంగమ్మఅని ఊరివారంతా పిలుస్తున్నారుట. వారిద్దరూ ఒక్కటే అని కవి ప్రకటించిన విధానం ఇది. కలవి పండ్లు, బలసకాయలు, రేణగాయలు, సీమ చింతలు ఇలా రాయలసీమ మాండలికంలో వివిధ ఫలాల పేర్లు మనకు కథాగమనంలో భాగంగా ఎదురవుతాయ్. మరో గొప్ప మాట ఇక్కడ చెప్పుకోవాలి. రంగన్న, గంగమ్మ ఒకరికోసం ఒకరు ఇంత చేస్తున్నా నీకోసమే నేనింత కష్టపడుతున్నానని ఎప్పుడూ అనుకోలేదుట. అందుకే కవి **మాటలేటికి మనసులో**

మరులు పొరల.. అంటారు. ఇది మరో శాశ్వత వాక్యం. ఇలాంటివి వారి అనువాద రచనలలో కూడా కోకొల్లలుగా లభిస్తాయ్. పంచతంత్ర కథలలో **అంతులేనిది విద్య, అల్ప మాయుస్సు** లాంటివి ఈ కోవలోనివే.

***

కలిమి, లేమి మధ్య అంతరాన్ని చెప్పడానికి ఎంతో సుదీర్ఘమైన వాక్యాలను, వ్యాఖ్యానాలను చేయలేదు కవి. ఎంత సరళంగా చెప్పారో చూడండి – **ఈ ఇంట నున్నంతసేపు కోయన్న కోటి సామాను ఈ ఇల్లు దాటితేనేమొ రాయెత్తితే రాయి నీను. ఇచట త్రేన్పులెగాని వినిపింప పూర్పులు.** ఇక రాత్రి అయితే ఊరి ముందు కరణం గారి ఇల్లు, చివర రెడ్డిగారి మేడలో మాత్రమే వెలుగు. మిగిలిన ఊరంతా అంధకారమే అంటారు. ఈ చీకటి, వెలుగు కేవలం కాంతి సంబంధ ప్రతీకలే కాదు అన్నది మనకు స్పష్టమవుతుంది.

చీకటిలోనే వస్తువులను చూడడానికి అలవాటుపడ్డాయి వారి కళ్ళు. అందుకే **అంత చుక్కల వెలుతురేయైన చాలు వారి కనులకు కనిపించు వస్తు తతులు** అంటారు. అంతకంటే వెలుగును ఆశించలేకపోవడం వారి దైన్యానికి పరాకాష్ఠ. మరికొందరికి చేద్దామన్నా పనిలేదు. అందుకే, "ప్రొద్దు పోకకే బ్రతుకు" అంటారు. జీవిక కేవలం కాలక్షేపం కావడం ఎంత విషాదమో!

ధనవంతుల మేడ మీద భారతపఠనం, వారింట సామ్యవాదం చదివే పిల్లలు ఇవన్నీ దినచర్యలో భాగాలుగా చెబుతారు. ఇవి కాలక్షేపాలే గానీ వాటి సారం జీవన విధానంలో అన్వయింపబడటం లేదు సుమా! అని చెప్పకనే చెప్పడం.

***

ఇక చివరి సర్గలో గర్భిణిగా ఉన్న మంగమ్మ మరో స్త్రీ తోడు లేక పడే కష్టం, కాయకష్టం చేసి వచ్చిన భర్త ఆమెకు సపర్యలు చేయడం వివరిస్తారు, కవి. అందరి ఆవేదనా తానే అనుభవిస్తూ ప్రశ్నలనూ సంధిస్తారు.

దైవమా ఉంటివా చచ్చినావ నీవు?
ధర్మమా గెంటిరా నిన్ను ధరణి నుంచి

సంఘమా తల కెక్కెనా సన్ని నీకు,
హృదయమా మానవుడు నిన్ బహిష్కరించె.

***

మాండలిక పదాలకు పుస్తకం చివర్లో టిప్పణి ఇవ్వడం ఎంతో ఉపయోగ పడుతుంది. ఒకచోట తేనె కొనాలంటే 'బొట్టు' కావాలి అన్నపుడు 'బొట్టు'కు అర్థం తోచలేదు. టిప్పణిలో 'కానీ' అని ఇవ్వడం వలన అవగాహన కలిగింది. ఔతుఖానా (స్నానపు గదిలో పెద్ద నీటి తొట్టి) వంటి పదాలు తెలిసాయ్. సందర్భోచితంగా చాలా సామెతలకూ స్థానం కల్పించారు. గూట్లో దీపం, నోట్లో కడి అనే సామెతను **గూటిలో దీపముంబెట్టి, నోటిలోన కబళము బెట్టుకొందురు గ్రామజనులు** అంటారు.

సరళరీతిలో సాగినట్లు అనిపించినా వారి పాండితీ ప్రకర్ష చూపే అద్భుత పద్యాలను, వర్ణనలనూ కొన్ని చోట్ల రుచి చూపించారు. **కలమ పాలికల యాలాల మేలి పాటల జుమ్మని మ్రోయు మించుల సితారు** – కావ్యంలోని మొదటి పాదం ఇది. ఒక్కో పదాన్నీ విడివిడిగా అర్థం చేసుకుని మొత్తం వాక్యానికి అన్వయించు కోవాలి. పద్యంలోని అన్ని పాదాలూ మరలా చివరి పాదానికి అన్వయించుకోవాలి. మొదటి పద్యం కొరుకుడు పడనిదే రెండవ పద్యం అందదు. తరువాత నుంచి అంతా సులువుగానే ఉంటుంది. మధ్య మధ్యలో ఇలాంటి పద్యాలు మరలా చదివే వేగాన్ని తగ్గిస్తాయ్.

జఠర లుఠ ఝుషమై, క
ర్మఠులై దరిజేరు జీవరాశుల మ్రింగున్
హఠమెంతని! ఇది చేయని
హఠాత్ కఠోర క్రియా విహారము కలదా!

***

సంస్కృత కావ్య నాటకాలంకారాలను, తర్కశాస్త్రాన్ని అధ్యయనం చేయడం రాజకీయ కార్యకలాపాలు, గ్రంథ ప్రచురణ, రాజద్రోహం క్రింద అరెస్టుకావడం, జైలులో నేర్చిన ఇతర భాషలు, ప్రముఖ దేశనాయకుల సాహచర్యం మీజాన్ పత్రికలో, ప్రజాశక్తి దినపత్రికలో పనిచేయడం, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి

ప్రధాన సంపాదకునిగా వ్యవహరించడం, బ్రహ్మసూత్రాలు శంకరభాష్యం నాలుగు సంపుటాలను, అథర్వణ వేదాన్ని అనువాదం చేసి ప్రచురించడం, ఆంధ్రప్రభ సంపాదకత్వం-ఇవన్నీ ఒకే వ్యక్తి తన జీవితకాలంలో సమర్థవంతంగా నిర్వహించాడంటే పొద్దుచాలని జీవితం అది. విశ్వంగారి సాహిత్యాన్ని చదివినపుడు ఆయన చూడని జీవితం, చదవని పుస్తకం ఉన్నాయా అని ఆశ్చర్యపోతాం.

***

జీవితం కూడా నదివంటిదే. ఎన్నెన్ని దారులలోనో ప్రవహించాలి. ఎన్నెన్ని ప్రవాహాలనో తనలో కలుపుకోవాలి తానూ మరో ప్రవాహంలో కలిసిపోవాలి. తాను పయనించినంత మేరా సస్యశ్యామలం చేయాలి. ఎండడమూ, నీటితో నిండడమూ నదికి తెలుసు. మోదము, ఖేదమూ కలిసి ఉంటాయని మనిషికి తెలుసు. అందుకే నదిని ప్రతీకగా తీసుకుని కోటి గొంతుల వేదనామయ జీవన కావ్యగానం చేసిన పెన్నేటి పాటగాడు - శ్రీ విద్వాన్ విశ్వం.

(సృజన నేడు పత్రికలో 1.11.2021న ప్రచురితం)

18 జననాంతర సౌహృదం - కాళ్ళకూరి శైలజ కవిత్వం.

ఒక కవి తాలూకు మొదటి కవితా పుస్తకం ప్రత్యేకమైనది. ఒక విధంగా అది దశాబ్దకాలపు అభ్యసన, అధ్యయనం తరువాత ఎదుర్కొనే పదో తరగతి పబ్లిక్ పరీక్ష. అందుకే, మొదటి పుస్తకం వెనుక ఒక సాధన, వడపోత, నిరీక్షణ ఇలాంటివెన్నో కలగలిసి ఉంటాయ్. ఊహ తెలిసిన నాటి నుంచీ అల్లుకున్న భావాలు సాహిత్య కృషి ప్రారంభమయ్యాక అక్షరాలై, ముందుతరం వారెవరో భుజం తట్టాక కవితలే అని భరోసాను నింపుకుని, చివరకు పుస్తకంగా నిలుస్తాయ్. నిజానికి మొదటి పుస్తకంలోని కవితల ఆధారంగా కవి అభిప్రాయాలను, దృక్పథాలను పూర్తిగా అంచనావేయలేం. సాహిత్య ప్రపంచానికి, పాఠకులకు కవి ఎలా పరిచయం కావాలనుకుంటున్నాడనే భూమికపై కవితల ఎంపిక ఆధారపడి ఉంటుంది. కానీ ఇది అంత సులభం కాదు. లాంగ్ బెల్ కొట్టగానే పిల్లలంతా పారిపోడానికి సిద్ధంగా ఉన్నట్లు కవితలన్నీ పుస్తకంలో ప్రవేశం కోసం కవి అనుమతికై ఎదురు చూస్తుంటాయి. అలా ఎక్కువ మక్కువ ఉన్నవే మనదాకా వస్తాయ్. తక్కినవి ప్రక్కకు పోతాయ్. ఐతే, అందరి విషయంలో ఇలాగే జరుగుతుంది అని అనలేం కానీ, చాలా వరకూ ఇంతే అని కాస్త గట్టిగానే చెప్పగలం.

అందుకే, మొదటి పుస్తకం ఆధారంగా కవిని అంచనా వేయాలంటే, వ్రాసిన వాటి వెనుక వ్రాయనివి, వ్రాసిన వాటిలో బయటపెట్టనివీ తెలియాలి. తొలి పుస్తకాల్లో సాధారణంగా వస్తువు, శిల్పం, అభివ్యక్తి వీటన్నిటా మన బహుముఖీనతను తెలియజెప్పే ప్రయత్నం చేస్తాం. ఇది అవసరం కూడా. లేకపోతే సాహిత్య సమాజం ఇతడు ఫలానా కవిత్వం మాత్రమే వ్రాస్తాడు అని ముద్ర వేసే ప్రమాదం ఉంటుంది.

ఇపుడు ఇదంతా ఎందుకు అంటారా? నిర్విరామ వైద్యురాలు, నిరంతర పాఠకురాలు కథ, కవిత్వము, వ్యాసం, ప్రసంగం – వీటన్నిటా కృషి చేస్తున్న డా. కాళ్ళకూరి శైలజ తను ఊహ తెలిసాక చూసిన యాభై ఏండ్ల ప్రపంచాన్ని విని, చదివిన సహస్రాబ్దాల మానవ పరిణామ క్రమాన్ని పదిలపరచుకుని పై సోపానాలన్నీ అధిగమించి అందించిన కవిత్వం – "కొంగలు గూటికి చేరే వేళ".

***

ఓ కొత్త మార్గంలో ప్రయాణం కొత్తదేదో తెలుసుకోవాలనే ఆకాంక్షతోనే జరుగుతుంది. **"ప్రపంచం అనే పర్వత మెదురుగా చిట్టి ఉడతనై నిలిచున్నానా?"** అని మొదలైన కవితలో **అటునుంచి ఇటు వచ్చాక , ఇన్ని శిలలు తొలచి నన్ను తెలుసుకున్నది నేనేనా!** అనే అభివ్యక్తి కనిపిస్తుంది. అదిగో, ఈ సాహిత్య ప్రయాణంలో ఆమె మొదట తెలుసుకున్నది అది. Know thyself పాత మాటే అయినా దానిని కవయిత్రి చెప్పిన విధానంలో నవ్యత ఉంది. ఇలా ప్రతి పదాన్నీ చాలా శ్రద్ధగా పూర్తి ఎరుకతో ప్రయోగించారు.

"నువ్వే ఉంటే ఏమి చేద్దువో,
ఏమేం చెప్పుదువోనన్న ఎదురుచూపు" – ఈ వాక్యంలో చివరిపదంగా "ఆలోచన" కాకుండా "ఎదురుచూపు" అనడం ద్వారా తను కోల్పోయిన దానిని మరలా అందుకోగలననే ఆశ ప్రతిఫలిస్తుంది. మరోచోట, సాయంకాలాన్ని **"తనను జయించిన పిట్టతో ఆకాశం వినీల శాంతిని పంచుకుంటుంది"**–అనడంలో వాక్య నిర్మాణంలో శ్రద్ధ, కొత్తగా చెప్పాలనే ఒక తపన కనిపిస్తుంది. ఎప్పుడూ చెప్పేదే – ఈ విన్యాస విశేషమే కదా, కవులను ప్రత్యేకంగా నిలిపేది.

***

కొన్ని చోట్ల ఒకటికి మించిన విశేషాల మేళవింపు వాక్యాన్ని గాఢతరం చేసింది. **"నా ప్రతి శ్వాసా నువ్వు కానుకగా పంపే జ్ఞాపకం".** ఇక్కడ – నేను జీవించి ఉన్నది నీ జ్ఞాపకాలతోనే నీ జ్ఞాపకాలు నువ్వు పంపే కానుకలు అనే బహుళ అర్థాలు ఒకే వాక్యంలో నింపేయడం కనిపిస్తుంది. అలా అని అన్నీ అలా లేవు. మనమున నాటిన మాటలు పద్యం మనకు తెలిసిందే, కదా! **పలుకు పదునెక్కి మనసును పీలికలు చేస్తే** అని అత్యంత సరళంగా అనగలిగారు.

సాధారణంగా ఒక మెరుపుతో కవిత ముగిస్తాం. అలాంటి ప్రత్యేకమైన ప్రయత్నం చెయ్యలేదు. అందుకే కవిత మధ్యలోనూ కొన్ని మెరుపులు మనకు దొరికాయ్. "అప్పుడు" కవితలో డాబాపై కుటుంబమంతా వెన్నెల భోజనానికి సిద్ధమైన దృశ్యాన్ని చూపుతారు. అన్ని ఏర్పాట్లూ ఉన్నాయ్. **ప్రత్యేకంగా పాట పాడనక్కర లేదు అంతా అందమైన గీతం** అన్నపుడు కవిత పతాక స్థితికి వెళ్ళింది. ఈ వాక్యాలు కవిత చివరలో ఉంటే మరింత అందంగా ఉండేదేమో!

మనం నడిచిన దారి కవితలో కూడా – **నన్ను దిగబెట్టి నీవు నిన్ను సాగనంపి నేను – ఒక్కదారి పలుమార్లు విరబూసేది!** అనే అత్యున్నత వాక్యాలు కవిత మధ్యలోనే వచ్చాయ్. ఒకరినొకరు సాగనంపి దారి విరబూసాక కవికి అక్కడ పనిలేదు.

"విలువ" కవిత నిర్వహణ పరంగా అత్యున్నతమైనది. మనిషి జీవితాన్ని, నాణాన్ని పుట్టుక నుంచీ చివరి దాకా తులనాత్మకంగా సంసర్గం చేస్తూ పరిణతి చెందిన శిల్పంతో ప్రతిభావంతంగా చెప్పారనిపించింది. కవిత మధ్యలో **చాన్నాళ్ళకు ఒక అయస్కాంతం ఆకర్షిస్తుంది – అపుడు నీ అస్తిత్వం తెలుస్తుంది** అనడం అబ్బురపరిచే వాక్యం.

***

మొదట తనను తాను తెలుసుకున్నాను అని ప్రకటించిన కవి అంతటితో ఆగిపోలేదు. **పెను తుఫానులోసైతం నిశ్చయంగా నడిచే కళ అబ్బింది, ఎక్కడుంటే అక్కడ విత్తునాటి తోటను పెంచగల మాలి** కాగలిగారు. అపుడు చుట్టూ ఉన్న ప్రపంచం వైపు దృష్టి సారించారు.

ఏటా చెరువు గట్టును కాసింతగా చప్పరించి
ఏమీ ఎరుగనట్టు తవ్వి తవ్వి నవ్వింది - నగరం ఒక భీతావహ సత్యం.
గాయం చూస్తే రెండే గాట్లు
స్వార్థం, మోసం కోరల ఆనవాళ్ళు - ఇలా పైకి మామూలుగా కనిపించినా చాలా సమాచారాన్ని తమలో దాచుకున్న వాక్యాలు పుస్తకంలో మనకు తరచు ఎదురవుతాయ్. తరచి చూస్తే సమాజాన్నీ చూపుతాయ్.

***

ఇక అనుభవసారమంతా పిండి వ్రాసిన కవితలు వ్యదార్థ గాధలు శీర్షికన ఇచ్చారు. పరిశీలన, సహానుభూతి దశలు దాటి కొన్ని చోట్ల తానే బాధితురాలు అయ్యారు.

ప్రతి రాత్రీ నల్లగా ఉండదు
ఒక్కోసారి రక్తంగా వెచ్చగా
స్వేదంలా ఉప్పగా కూడా ఉంటుంది - అన్నపుడు మామూలు పదాలు మనకు కొత్తగా కనిపిస్తాయ్. వెచ్చగా, రక్తంలా వెచ్చగా, ఉప్పగా, స్వేదంలా ఉప్పగా - అనే పదాలకు ప్రత్యేకమైన భావాలను పొదవుకుంటాయి. నాకైతే హైస్కూల్ రోజుల్లో A.G. Gardiner వ్రాసిన "All about a Dog" పాఠం చెబుతూ "it was a bitterly cold night" అనే వాక్యం గురించి మా మేస్టారు చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి.
ఎన్ని అరచేతులు కావాలి
ఒక ప్రాణ దీపం వెలిగించేందుకు - ఇక్కడ ప్రాణదీపం నిలిపేందుకు అనలేదు కవి. ఎందుకు? చమురు అంతా ఖాళీ అయ్యి, చేయి దాటిపోయాకే కదా! ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది. అందుకే అవి తిరిగి వెలిగించాల్సిందే.

ఇక, **దగ్ధ పరిమళం, మచ్చలు** ప్రతి వాక్యాన్ని ప్రస్తావించ వలసిన కవితలు. వీటిలో ఒక పదాన్నో, వాక్యాన్నో కోట్ చెయ్యడం అంటే, మిగిలిన వాటిని అవమానించినట్టే. "వసీరా" కవిత్వానికి ముందుమాటలో శివారెడ్డి "ఒక వ్యక్తిత్వం కలిగిన కవిత నుంచి ఒక ముక్క తీసి చూడండ్రా అని చూయించటం, కవితకి హాని చేసినట్టే - కవిత మొత్తం ఇచ్చే అనుభవంలో ప్రతి చరణం ఒక భాగం" అంటారు. అచ్చంగా అలాంటి కవితలు పై రెండూ.

చివరాఖరికి కవితలో ఏముందో చూద్దాం. కళ్ళు బైర్లు కమ్మితే కొడుకు మీద బెంగ అనుకుని కాళ్ళు పీకితే వయసు మీరిన నిస్సత్తువని నోరెండిపోతే వేసంగి లెమ్మని పొద్దుపుచ్చిన ఓ తల్లి తన వ్యాధి ముదిరాక, **ఆడోళ్ళ వార్డులో అమ్మను** ఆఖరి చూపు చూసి పొమ్మని కొడుకుని వేడుకుంటోంది. చుట్టూ ఉన్న తనలాంటి స్త్రీలనే చూస్తూ **ఈడ ఎటుచూసినా నాలాంటి అమ్మలే అని** బాధను Generalize చేస్తోంది. **ఎన్ని పేనాల రాక, ఎన్ని పేనాల పోక చూస్తిమో** అని జీవన తాత్వికతను గుర్తుచేసుకుంటోంది. ఐనా, ఆశగా **ఒంటి రెక్క తలుపు కిర్రుమన్నన్ని సార్లూ** ఎదురుచూస్తూనే ఉంది. వ్యాధి లక్షణాలు, కవిత్వ లక్షణాలు రెండిటి పట్లా కవికి గల ఎరుక ఈ కవితలో తెలుస్తుంది.

ఈ అధ్యాయం అంతటికీ మకుటాయమానమనదగ్గ వాక్యం **ప్రార్థనలన్నిటికీ ప్రాణాన్ని కానుకగా ఇచ్చే దివ్య లోకం** – బహుశా భవిష్యత్తులో ఈ కవిత పాఠ్య గ్రంథాలలోకి వస్తే పిల్లలు ఆసుపత్రిని నిర్వచింపుము అనే ప్రశ్నకు జవాబుగా పై వాక్యాన్ని చదువుకుంటారేమో!

చాలాచోట్ల మనకూ ఇలాగే జరిగిందే, ఇలాంటి సన్నివేశంలో మనమూ ఉన్నామే! అనిపిస్తుంది. కాళిదాసు పర్యుత్సుకో భవతి యత్సుఖితోపి జంతు: అంటాడు. అంటే సుఖంగా ఉన్నప్పుడు కూడా ప్రాణి చెప్పలేని ఉద్వేగానికి లోనవుతుంది. కారణం, భావ స్థిరాణి జననాంతర సౌహృదాని – వెనక జన్మల అనుబంధాలు ప్రాణి భావాలలో తెలియకుండా చోటు చేసుకుంటాయి. శైలజగారి భావాల కలబోతలు, పదాల కలనేతలు పదే పదే పై శ్లోకాన్ని గుర్తు చేస్తాయ్. అందుకే వారి కవిత్వం జననాంతర సౌహృదం.

***

రాంభట్ల నృసింహ శర్మ అనే కవి "పేరు చెప్పక్కర లేదు, పేగు ప్రేమతో అతికించిన కవరంచులు చెబుతాయ్, ఆ ఉత్తరం ఎవరిదో" అంటారు. అదిగో ఈ పుస్తకం అలా పేగు ప్రేమతో అతికిన కాగితాల దొంతర. **గుల్ల గుమ్మడి వీణగా పలికినట్లు, ఎండుపుల్ల గూడుగా ఒదిగినట్టు** జీవుని వేదనంతా విభిన్న రూపాలలో నాలుగు అధ్యాయాలుగా వ్యక్తమై ఈ సంపుటిగా మారింది. ఆ వీణ వైణికుని స్వయం

సంతృప్తి కోసం చేసే సాధనగా కాదు, సార్వజనీనమ్ కావాలి ఆ గూటిలో వేల హృదయాల ఆవేదనలకు సాంత్వన దొరకాలి . ఈ బాధ్యతలను ఇప్పటికే స్వీకరించిన కవయిత్రిగా ఇకపై **నిద్రలోనూ తీరిక దొరకని** కవితా వ్యాసంగంతో గడపాలని మనసారా కోరుకొంటున్నాను.

(ఆంధ్రప్రభ "సాహితీ గవాక్షం"లో 02.05.2022 న ప్రచురితం).

LONAARASI
(Sahitya Vyasalu)

Avadhanula Mani Babu, M.Sc., B.Ed.,

ఇందులో...

సమన్వయ సరస్వతి శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ "శ్రీ నీలకంఠేశ్వరా";

డా. ఎన్. రామచంద్ర "కుముద్వతీ తీర కథలు";

డా. శిఖామణి "యానాం కవితలు";

డా. అద్దేపల్లి రామమోహనరావు ముందుమాటలు;

శ్రీ బొల్లోజు బాబా "మూడో కన్నీటి చుక్క";

డా. పైడిపాల "నూట పదియార్లు";

శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి "నాన్న కుర్చీ";

శ్రీ ఎమ్మెస్ సూర్యనారాయణ "హరికథా భిక్షువు";

డా. కాండూరి సీతారామచంద్రమూర్తి "నిలువెత్తు గురజాడ";

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి "కథా పుష్కరిణి";

శ్రీ చలపాక ప్రకాష్ "మూడో కన్ను";

శ్రీ సంగవేని రవీంద్ర "చౌరస్తాలో సముద్రం";

శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ "దామెర్ల కళ – వారసత్వం";

శ్రీ మేకా మన్మథరావు "వసంతానికో పువ్వు";

శ్రీ చందు సుబ్బారావు "చందన చర్చ";

విద్వాన్ విశ్వం "పెన్నేటి పాట";

డా. కాళ్ళకూరి శైలజ "కొంగలు గూటికి చేరే వేళ"

... పుస్తకాలపై నే చేసిన ప్రసంగాలు, వ్రాసిన సమీక్షలు ఉన్నాయ్.

శతకం, కథ, కవిత్వం, పీఠికలు, సినీగేయ విశ్లేషణ, జీవిత కథ, పరిశోధన వ్యాసం,విమర్శ, పద్యం... ఇలా 9 సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాలపై నా అవగాహనను 18 వ్యాసాలుగా వినమ్రంగా మీ ముందుంచుతున్నాను.